నవశక్తి

Vol. 2, no. 23

(May. 24, 1939)

బెజవాడ, 1939

Record no. 682

Navaśakti

Vol. 2, no. 23

(May. 24, 1939)

Bejavāḍa, 1939

Record no. 682

Regd. No. M. 3824

నవశక్తి

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారపత్రిక

సంపుటం 2 | బుధవారం 24-5-39 బెజవాడ | సంచిక 23

మునగాల రైతు సభ



గత మాసం మునగాల ఎస్టేటు గ్రామాలలో ఆచార్య రంగాగారు సంచారం చేసినప్పటి ఒక దృశ్యం. మునగాల రైతులకూ—రాజాగారికీ మధ్య జరిగిన ఒడంబడికలోని షరతులు రైతులచే చాలావరకు పాటించబడినా, రాజాగారిచే పాటించబడక పోవడంవల్ల విషమపరిస్థితి యేర్పడి, రైతులు సత్యాగ్రహానికి నిశ్చయించు కొన్నారు.

20 పేజీలు ** అణా

★ కథ

వెదురుచేటతో చేటెడు— వెండిపళ్లెంతో గుప్పెడు

కామ్రేడ్ అశ్వనీకుమార్ దత్తు

రెండేళ్ళక్రితం ఒక స్నేహితుని ఊరికి వెళ్ళాను. రాత్రి భోజనాలైన తరువాత అరు బయట వెన్నెట్లో పడక కుర్చీలమీద కూర్చొని గ్రామఫోను ప్లేట్లు వేసుకుంటున్నాము. ఇంతట్లోనే ప్రక్క నున్న మేడలోనుంచి శ్రీనివాసరావుగారు సొంపూరు ఖద్దరు కండువా వల్లెవాటుగా వేసుకొని చిటికిన వ్రేలికి తగిలించిన తమలపాకుల చిలకలు ఒక్కొక్కటే నోట్లో వేసుకుని నములుతుంటూ చిరునవ్వుతో వచ్చి మరొక కుర్చీలో ఆసీను లయ్యారు. గ్రామఫోను అనివేని పరస్పర పరిచయం అయ్యాక పిచ్చాపాటి చెప్పుకో నారంభించాం. ఆయన మామిడి, కొబ్బరి, బత్తాయి తోటల్ని గురించి, చెట్లు కాపునుగూర్చి, ప్రస్తుత ధరలనుగూర్చి, అప్పులు వడ్డీలు ఒక పేమిటి పెద్ద రైతులగోడు అంతా యేకరువుపెట్టారు. చేతుల నున్న బంగారు మురుగులు, బంగారు మొలత్రాడు సంధ్యాసంధ్యాలలో తళతళలాడాయి. మా స్నేహితుడు కుర్చీలో కునికిపాట్లు పడుతో అప్పుడప్పుడు 'ఊఁ' కొట్టుతున్నాడు. క్రొత్త పరిచయం మూలాన్ని మర్యాదకు లోటు రానీయకుండా తెచ్చి పెట్టుకున్నట్లు కనపడకుండా ఎంతో శ్రద్ధతో వింటున్నాను హఠాత్తుగా ముఖం గంభీరంగా పెట్టి "అయ్యా మీరు మంచివాళ్లు. మీది చాలా పెద్ద కుటుంబం; అంతా జమీందారీ పోయి; మీ తండ్రిగారి కులంలో జమీందారులు డిప్టీకలెక్టర్లు. మేజిస్ట్రేట్లు మీ ఇంటిలో మకాం చెయ్యకుండా, ఆతిథ్యం పొందకుండా వెళ్లిన పాపాన్ని పోలేదు. ఈ మధ్యని వెండి పళ్ళాలు నాలుగు చేయించానండి. మీకు వాటి నాణ్యం, అందచందాలు, బాగా తెలుస్తాయి. ఒకసారివచ్చి పరీక్షించండి" అంటూ లేచారు పది గంటలైంది. అయినా ఆయన ముందుదారి తీస్తోంటే మర్యాదకు కట్టుబడి వెంబడించాను.

నిద్రపోతున్న స్త్రీలు, పిల్లలు, వృద్ధులు ఆయన కుటుంబం యావత్తూ లేచి గుమిగూడింది. వెండికంచాలు, గిన్నెలు, పళ్ళాలు, బంగారపు శ్రీ కృష్ణ విగ్రహం; వంటింటిలోనే వున్న చిన్న అందమైన చలవరాతి దేవాలయం విశాలమైన దొడ్డి, మేడగదుల్లో వున్న నగిషీ చెక్కిన పందిరి పట్టిమంచాలు, నిలువుటద్దాలు. కోడళ్లు తెచ్చుకున్న సారె సామాన్లు—యింకా యెన్నో యెన్నో వస్తువులు వాటి చరిత్రలతో వర్ణిస్తూ చెప్పారు. ఒక గంటవరకూ వోపిక పట్టి వింటూ, చూస్తూ తిరుగుతూనే వున్నాను. పదకొండు గంటలకు నాకు శెలవు యిచ్చి నేను పడే బాధనుంచి రక్షించారు.

ఉదయాన్నే లేచి నా స్నేహితుడు నవ్వుతూ యీ పూట శ్రీ గారి యింటిలో కందా కాబోలు అన్నాడు. నేనూ ఆశపడ్డాను. అంత మర్యాద, అంత ప్రేమ, అంత చనువూ వూరికేపోతాయా? అనుకోవడంలో తప్పేముంది?

బత్తాయి కాయల బుంగలు, కొబ్బరి బొండాల బుట్ట మా కళ్ళముందే ఆయన యింటిలోకి వెళ్ళాయి.

కాని పగలు పన్నెండు అయింది. అపూటకి యిక లాభంలేదు. ఊపిరి తిరగనిపని ఆయనకి. సాయంకాలము పిలుస్తాడులే. అంటూ వూరడింపుగా పలికాడు నా మిత్రుడు.

సాయంకాలము కూడా గడిచిపోయింది. మర్నాడు నా ప్రయాణం. సాయంకాలము మళ్లీ అదేరీతిగా యింటుమించుగా అదేవద్దతుల మీద శ్రీగారు వచ్చి సంభాషణ సాగించారు. పన్నెండు గంటలకి నా ప్రయాణం అని రెండు మూడుసార్లు మాటల సందర్భంలోనే నా మిత్రుడు చెప్పాడు. ఓహో! అదేమిటండీ అప్పుడే వెళ్ళిపోవడం. మరొక పదిరోజులుండి కొంచెం ఖులాసాగా గడపండి. మీ స్నేహితుడు చాలా మర్యాదస్థుడు. అతిథి అభ్యాగతులని ఆదరించడంలో ఆయన్నిచూచి అనేక మంది పాఠాలు నేర్చుకోవాలి. అని జారీగా జారీగా చేశాడు.

ఆయన వెళ్లగానే నా స్నేహితుడు విరగబడి నవ్వడం ఆరంభించాడు. ఎందుకు నవ్వుతావ్, ఆయన యింకా పూర్తిగా మేడలోకేనా వెళ్ళలేదు, అని వారించాను. ఆయనకు యిదే వృత్తి. మా యింటికీ, యీచుట్టు ప్రక్కలకీ వచ్చే అతిథుల్నీ, క్రొత్త అల్లుళ్ళనీ భోజనం చేసిన తర్వాత యింటికి పిల్చి మేడలు, దొడ్లు, తోటలు చూపిస్తూ వుంటారు. మాటలుచెప్పి తృప్తిపరచాలి కాని, మాడలుయిచ్చి చాలనిపించ గలమా? అనేది ఆయన తరుచుగా వుపయోగించేమాట అని చెప్పాడు. ఇది అద్వైత మన స్తత్వం అనుకొని వూరడించుకొని నా దారిని నేను ప్రయాణం కట్టాను.

2

సామర్లకోట ప్యారీకంపెనీ కూలీలు దాదాపు 800 మంది తమ బాధల్ని భరించలేక ఆరు నెలలు కంపెనీ దొరలకు చేసుకున్న మనవులు, పంపుకున్న విజ్ఞప్తులు, ప్రభుత్వానికి పంపుకున్న అర్జీలు, వ్యర్థమైపోగా సమ్మెకట్టారు. శాంతియుతముగాను, దీక్షతోనూ కార్మికులు బ్రహ్మాండంగా సమ్మె సాగిస్తున్నారు.

పదిరోజులు గడిచిన తర్వాత ఆ సమ్మె కార్మికాభిమానుల దృష్టిని ఆకర్షించింది. బహిరంగ సభలు, ప్రదర్శనాలు, వూరేగింపులూ జోరుగా సాగుతున్నాయి.

విదేశీ పెట్టుబడికి, దేశీయ కూలీలకు జరిగే యీ పోరాటంలో కార్మికులు విజయం పొంది తీరాలని నాయకులు హెచ్చరించారు. దొడ్డితోవను ఫ్యాక్టరీలోకి దూరే ద్రోహుల్ని ఖండిస్తూ వుపన్యాసాల తుపాను రేగింది. కూలీలు ధైర్యంతో నిలబడ్డారు.

పన్నెండోరోజున కూడా కూలీలు రణరంగములో తుపాకీ గుండ్ల వర్షంలోకూడా వరుసల్లో నుంచి తప్పుకోని యుద్ధవీరులవలె, శిక్షణాయుతంగా, ప్రవర్తిస్తున్నారు.

కూలీ సభల్లో సృష్టింపబడిన వుత్సాహకరమైన వాతావరణంలో వుత్సుకులైన కూలీలు, ఉద్యుక్తులైన కార్మికులు దృఢనిశ్చయులైన సమ్మెదార్లు రాత్రి యిండ్లకు వెళ్ళడంతోటే ఆకలి బాధతో దహించుకుపోయే పెళ్ళాం బిడ్డల్ని చూచి కృంగిపోతూన్నారు. కడుపుల్లో తేళ్లూ, జెర్రులూ పాకుతున్నాయి.

సభల్లో ప్రప్రథమాన్ని "ఆకలి, ఆకలి, మండేఆకలి, వరములన్నిటిని నమతేఆకలి" అంటూ కార్మిక నాయకులు హృదయం కరిగే రీతిని పాడుతున్నారు.

కార్మికనాయకులు దావానలంలో వ్యాపిస్తూ భగ భగమని మండుతూన్న ఆకలిచిచ్చును ఆర్పేందుకు సమ్మెనిధిని వసూలుచే సేటందుకు, సమ్మెదార్లను జట్లులక్రింద విడదీసి బియ్యం, చింతపండు, ఉప్పు, పప్పు వగైరాలను, చందాలను పోగుచేసేందుకు, చుట్టుప్రక్కల గ్రామాలకు పంపారు.

దళాధిపతులు ఓపిగ్గా ప్రతిగృహస్థుడికీ, సమ్మె కారణాలు వివరించి, కూలీలసమ్మెను నెగ్గించవలసిన బాధ్యత, వారిని యీలోపుగా ఆకలి చిచ్చుకు యెరచేయకుండా కాపాడ వలసిన భారం, ప్రజలమీద వున్నదని బోధిస్తూ వారిచ్చినది వసూలు చేసుకు వస్తున్నారు.

దళాధిపతి—రావు ఒక్కొక్కప్పుడు అంటే అతిత్వరగా చకచకా పనులు కావలసిన సమయాల్లో చాలాచికాకు కలిగించేటప్పటికీ, యితర సమయాల్లోముఖ్యంగా నిధి వసూళ్ళలోనూ సమ్మెదార్లను శాంతియుతంగా నుంచడంలోను ఆయన శాంతం అత్యద్భుతంగా వుపకరిస్తూంది.

'వే—' అనే గ్రామంలో మంచిస్థితిపరులూ, రంగేళీపురుషులూ, అతిథీదలూ, వున్నారని విని ఆపూరికి ఆయన దళం తరలింది నాలుగిళ్ళ భవంటులూ, కొత్తఫక్కీ మేడలూ, పూరుచుట్టూవున్న తోటలూ చూచి చాలా తీసుకురావచ్చునని ఆశించారు. దళంలోని కార్మికులు అతి వుత్సాహంలో ఆయనని వెంబడించారు.

ఉత్తరంవైపున వున్న పెద్దతామర చెరువు ప్రక్కనుంచి గ్రామంలోని మట్టిరోడ్డువుంది. చెరువులో తామరాకులు చాలా అల్లుకొని యున్నాయి. ఉదయం బాల భానునికి తామర పువ్వులు వెండిదళాలతో ఆహ్వానిస్తూన్నాయి.

సమ్మెదార్లు గ్రామంలో చొరబడి, మేడల్లో వున్న పెద్ద ఆసామీలతో సమ్మెకథను వినిపించారు. ఆలకిస్తూ, ప్రశ్నలువేస్తూ ఒక మోతుబరీ రైతుసమ్మెదార్లను ఆపాడు. వేసే అడ్డదిడ్డప్రశ్నలకీ, చొప్పదంటు ప్రశ్నలకీ ఓపిగ్గా, నచ్చేటట్టు, —రావుగారు జవాబు చెబుతున్నారు. కనీసం ఒక బస్తా ధాన్యం అయినా యిచ్చి తీరతారనీ, ఆముహూర్తం త్వరలో వస్తుందనీ, యెదురు చూస్తూన్నారు, దళంలోని కూలీలు.

ఒక గంటన్నర సంభాషణ తర్వాత ఆ ఆసామికి వీరిని యిక వదలిపెట్టడం మంచిదని తోచింది. 'ఒ నేవ్' చిన్నమ్మి యిల్లారా, వీరికి బియ్యం యిచ్చి పంపు అని పెద్ద దాసీని ఆజ్ఞాపించాడు.

వరిచేలు యెండిపోయినపుడు ఒక్కవర్షం జల్లుకి తహతహలాడుతూ వేచివుండే రైతుల్లాగు కూలీలు కనిపెట్టియున్నారు. ఒక అరగంట తర్వాత కాళ్ళ కడియాలు, వేళ్ళమట్టులు, టక్‌టక్‌మని చప్పుడు చేసుకుంటూ వెండిపళ్ళెంతో వస్తోన్న మహాలక్ష్మమ్మ కనిపించింది.

తమలపాకుల్లో రెండు వరహాల రూపాయల్ని పెట్టి తాంబూలాన్ని బహుమతి చేస్తారు.

ఆమె అంతకంతకూ సమీపిస్తోంది. కూలీలకి ఆతురత హెచ్చుతోంది. కలకలలాడే మహాలక్ష్మమ్మ వదనంలోని మందహాసం యెన్ని ఆశల్ని కల్పించదూ?

'అబ్బాయిలూ యేంతెచ్చారు? బియ్యం పట్టేందుకు అబస్తా యిల్లాపట్టు' అంటూ ఆమె వెండి పళ్ళాన్ని ముందుకు చాచింది.

కూలీల ముఖంలోనూ, దళాధిపతి వదనంలోనూ, రక్తపు బొట్లులేవు. గుండెలు బరువెక్కాయి. ఉచ్ఛ్వాసనిశ్వాసాలు మందగించాయి. వెండిపళ్ళెంలో గుప్పెడు బియ్యం.

—రావు మరి మాట్లాడలేదు. ముఖంవాల్చి గాజుకళ్లతో యేదో దీర్ఘాలోచనలో మునిగి మేడలు, పెంకుటిళ్ళ వీధులుదాటి గడ్డియిళ్ళ పూరిగుడిసెల, వైపుదారి తీశాడు.

ఆ యిండ్లలోని పేద కుటుంబీకులకి మనస్సు కరిగేట్లా సమ్మె వృత్తాంతాన్ని చెప్పాడు. "మీవీ, మావీ ఒకేరకం అయిన కష్టాలు, ఆకలి రుచి మీకు వేరుగా మనవి చెయ్యనక్కర్లేదు." అని బస్తా ముందుకుంచాడు. వెంటనే వీధిలోని రెండువైపుల్లోవున్న యిళ్ళల్లో నుంచీ వెదురు చేటలనిండా బియ్యం పట్టుకొని —రావుగారి చెయ్యి బరువెక్కి క్రిందకు దింపుకొని, మరొకరి సహాయంకూడా తీసుకొని బస్తా పట్టుకొనేస్థితికి తీసుక వచ్చారు ఆ పేదప్రజలు.

ఆ బస్తా ధాన్యంతో నిండినట్టుగానే వారి హృదయాలుకూడా కృతజ్ఞతతో నిండిపోయాయి.

ధాన్యాన్ని రెండు శేర్ల చొప్పున 80 కుటుంబాలవరకూ భజించారు.

బీదలు చేటల్తో చేటడైతే,

భాగ్యవంతులు వెండిపళ్ళాలతో గుప్పెడు!

సంపుటం 2 సంచిక 23

నవశక్తి

బుధవారం 24-5-39

సంపాదకవర్గం: మద్దుకూరి చంద్రశేఖరరావు (సంపాదకుడు). కంభంపాటి సత్యనారాయణ. పుచ్చలపల్లి సుందరయ్య. తుమ్మల వెంకట రామయ్య.

రాష్ట్ర కాంగ్రెసు కర్తవ్యం

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కార్యనిర్వాహక సభ ఈనెల 28 వతేదీని బెజవాడలో సమావేశం కానున్నది. ఈ సభ అతిప్రాముఖ్యమైనదని చెప్పక తప్పదు. నేడు భారత దేశాన్నీ, ఆంధ్రరాష్ట్రాన్నీ ఎదుర్కొనుచున్న క్లిష్ట సమస్యల గురించి తగిన నాయకత్వం వహించాలని రాష్ట్ర కాంగ్రెసును కోరుతున్నాం.

త్రిపురీ కాంగ్రెసులో "జాతీయ వాంఛా తీర్మానం" ప్యాసయింది. మనము సత్వరం స్వరాజ్యము స్థాపించుకోగల పరిస్థితులలో నున్నామని ఆ తీర్మానము తెలియజేసింది. కాని ఈ తీర్మానం దేశమంతటా ప్రచారం గావించితేగాని, ప్రచారం గావించి దేశాన్ని సంసిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తేగాని, మన శత్రువును సరిగా ఎదుర్కొలేము. మరొక స్వాతంత్ర్య సంగ్రామానికి ప్రజలను సంసిద్ధ మొనర్చాలని కాంగ్రెస్ మహాసభ ఆజ్ఞాపించినపుడు, దాన్ని ప్రజలకు తెలియజేయాలిసిన అవసరం రాష్ట్ర కాంగ్రెసు సంఘాలపైన ఉంటుంది. అలా ప్రచారం గావించకుండుట కర్తవ్యాన్ని నెరవేర్చకపోవుటే అని చెప్పాలి.

తరువాత కలకత్తాతో జరిగిన యుద్ధ వ్యతిరేక తీర్మానము. మరొక ప్రపంచ యుద్ధానికి ప్రతి సామ్రాజ్యమూ తయారవుతున్నది. ఆయుధాల పోటీల పరువులకు అంతులేదు. వచ్చే సామ్రాజ్య యుద్ధంలో భారతదేశ ఆర్థిక సంపత్తునూ, మనుష్య బలాన్నీ ఉపయోగించుకొన జూచుటేగాక, భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని అణచడానికి మన దేశమందంతటా 'రక్షణ' పేరిట సైనిక సన్నాహాలు గావించుతున్నారు. నూతన రాజ్యాంగ శాసనాన్ని మరింత సంకుచితపరచి, రాష్ట్రీయ కాంగ్రెసు ప్రభుత్వాల కాలుచేతులను కట్టివేస్తున్నారు. ఈ అపాయాన్ని గుర్తించి, రాష్ట్రమందంతటా యుద్ధ వ్యతిరేక తీర్మానాన్ని విశదీకరించాలి. బీహారు ప్రభుత్వం రాబోవు యుద్ధాన్ని గురించి, రాజ్యాంగ శాసనంలోని సవరణలను గురించి ఒక తీర్మానం తేబోతున్నదట. మన రాష్ట్ర ప్రభుత్వముకూడ రాబోయే యుద్ధంలో పాల్గొనమని కాంగ్రెస్ వైఖరిని ఖచ్చితంగా తెలియజేస్తూ, నూతన రాజ్యాంగ శాసనంలో తెచ్చిన సవరణలను అమలుపర్చ నిరాకరించుతామని, తెలియజేయాలి. అలా తెలియజేయమని మద్రాసు ప్రభుత్వానికి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు తెలియజెప్పాలి.

జాతీయవాంఛా, యుద్ధవ్యతిరేక తీర్మానాలను, విరివిగా ప్రచారం గావించాలని క్రింది కాంగ్రెసు సంఘాలకు "సర్క్యులర్ల"ను పంపాలి. అవసరమైన కరపత్రాలు ప్రకటించాలి. ప్రచారక దళాలను ఏర్పరచి రాష్ట్రమంతా ప్రబోధింపజేయాలి. ఆప్రచారక దళాలు, ఇతర సామ్రాజ్య వ్యతిరేకవాదుల సహకారాన్ని పొందాలి. ఈ పనుల నిర్వర్తించితేనే, మనము త్రిపురి, కలకత్తాలలో చేసికొన్న తీర్మానాలను ఆచరణలో పెట్టినవార మౌతాము.

ఇక రెండవ విషయం కాంగ్రెసు సభ్యత్వం. కాంగ్రెసు సభ్యులను జేర్పించడానికి ఇక రెండు నెలలే గడువుంది. కాంగ్రెస్ బల మధికమవుచున్న కొలదీ దురదృష్టవశాత్తు, కాంగ్రెసులో దొంగమెంబర్లు అధికమగుచున్నారు. దానికి ఒక్క మితవాదులే వగవ నవుసరంలేదు. కాంగ్రెస్ క్షేమమే పరమావధి గలవారందరూ విచారింపదగినదే. కాని ఈ దొంగమెంబర్లు అధికమగుటకు కారణం అధికారవాంఛయే. జిల్లాబోర్డులు, తదితర స్థానిక సంస్థలను తమ పలుకుబడి క్రిందకు లాగుకోవాలను అధికారవాంఛయే ఈ కృత్రిమ సభ్యత్వానికి కారణం. ఇలాంటి చర్యలను రాష్ట్ర కాంగ్రెస్ కనిపెట్టి ఉండాలి. కాని కాంగ్రెసును శుద్ధిచేయు అవకాశము లభించింది కదా యని సామ్రాజ్యవ్యతిరేక సంస్థలను, కార్మిక కర్షక సంఘాలలోనివారిని తరుమరాదు. సోషలిస్టు భావాలుగల తోడి కాంగ్రెసువాదులను బయటకు నెట్టరాదు. దురదృష్టవశాత్తు, సోషలిస్టులపై డిసిప్లినరీ చర్యలు గైకొనియు, తీవ్ర కాంగ్రెస్‌వాదుల సభ్యత్వాన్ని రద్దుపరచియు, కార్మిక కర్షక పోరాటాలలో పాల్గొను క్రింది కాంగ్రెసు సంఘాలను బెదరించియు, రాష్ట్రకాంగ్రెస్ తీవ్రవాదుల మిత్రభావాన్ని కోల్పోయింది. ప్రజలలో అప్రతిష్ఠకు గురియైనది. ఈసంవత్సరమైనా, జమీందార్లకు, జమీందార్ల ఏజంట్లకు పదవులే పరమావధిగా బెట్టుకొని కాంగ్రెసులో చేరువారికి వందలాదిగా సభ్యత్వ పుస్తకా లీయక సక్రమంగా సభ్యత్వపు పుస్తకాలు చేరునట్లు చూడాలి. కాంగ్రెసు సిద్ధాంతాలను నమ్మి, సామ్రాజ్య వ్యతిరేక పోరాటానికి సన్నిద్ధమయ్యే కూలీలను, రైతులను వేలకొలది సభ్యులుగా చేర్చుకొనే ప్రయత్నం చేయాలి.

మూడవది కృష్ణాజిల్లాబోర్డు ఎన్నికలు. 'ఇంట గెల్చి రచ్చ గెలవాలి.' ఇంతవరకు కృష్ణాజిల్లాబోర్డు ఎన్నికలలో కాంగ్రెసు గెల్చుట గాని, కనీసం సరియైనపోటీనిచ్చుట గాని జరిగియుండలేదు. దీనికి కారణం ప్రజాబలంలో విశ్వాసముంచలేపోవడం, అధికార కాంగ్రెసువాదులలో కొందరు జమీందార్లకు మిత్రభావం చూపడం. ఈసారియైనా, కాంగ్రెస్ గెలవాలంటే, కనీసం మంచిపోటీ నీయాలంటే జిల్లాకాంగ్రెసువాదులలో ఐక్యత అవసరం. ఐక్యతను భగ్నపరచేది, భగ్నపరచినది పశ్చిమ కృష్ణా జిల్లా కాంగ్రెస్ వ్యవహారం. 35 వేల కాంగ్రెసు సభ్యులను తిరిగి ఎట్టి షరతులు లేకుండా పునరుద్ధరించి—గౌరవప్రతిష్ఠలకు గింజుకొనక—జిల్లాకాంగ్రెస్ ఐక్యతను కాపాడాలి. ఈ సభ్యత్వంలో క్రుళ్ళు ఉన్నదంటారా, మొదట పునరుద్ధరించి, తర్వాత అన్ని జిల్లాలలో ఎట్లు కాంగ్రెసు సభ్యులను పరిశీలించుతున్నారో, అలాగే పరిశీలించి శుద్ధిచేయవచ్చు. అంతేకాని మొత్తాన్నే రద్దుచేయడం, ఒక భాగాన్ని పూర్తిగా రాజకీయ రంగాన్నుండి తొలగించడం కాంగ్రెసుకే హాని. ఐక్య కాంగ్రెసే; జిల్లాలలో జమీందార్ల ధాడిని ఎదుర్కొనగల్గుతుంది.

ఇక జిల్లాబోర్డు అభ్యర్థుల విషయం. ఇదివరకు జయించడమే ప్రధానంగా పెట్టుకొని, క్రొత్తవారికి కాంగ్రెసు బురఖా తగిలించడం, తర్వాత వారెదురు తిరిగి కాంగ్రెసు ప్రతిష్ఠకు హాని కల్గించడం అక్కడక్కడ కల్గిన అనుభవమే. అలాంటి ఘటనలు జరుగకుండా కాంగ్రెసు పోరాటంలో ధక్కామొక్కీలు తిన్నవారినే, కాంగ్రెసు భక్తులై విశ్వాసపాత్రులుగా ఉండేవారినే అభ్యర్థులుగా నియమించేటట్లు చూడాలి. కాంగ్రెస్ జిల్లాబోర్డులలో ఎందుకు పాల్గొంటున్నదీ, ఏమి చేయవలసిందీ తెలియజేస్తూ ప్రజల అత్యవసర కోర్కెలను ఆధారం చేసికొని, ఒక ప్రణాళిక (ఎన్నికల మానిఫెస్టో) తయారుచేయాలి. ఆప్రణాళికను ప్రజలలో విరివిగా వ్యాప్తమయేటట్లు చూడాలి, ఆనాడే తమ అభ్యర్థులు పెడత్రోవలబోకుండా ప్రజలు ఒత్తిడి తేగలరు.

నాల్గవ విషయం రాష్ట్ర ప్రభుత్వానికి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు ఈయవలసిన సలహాలను గురించి. దాదాపు రెండు సంవత్సరాలు గావచ్చినా ఇంతవరకు కార్మిక శాసనం గావించలేదు. త్వరలో చేయబోతున్నారని వినికిడి. మన రాష్ట్రంలో నేడు కార్మికుల కష్టాలు వృద్ధిపొందిన ఫలితంగా కార్మికులలో అశాంతి ప్రబలింది. దీనికి తోడు దురదృష్టవశాత్తు ప్రభుత్వ నిర్బంధ విధానంకూడ తీవ్రంగా ఉంది. చీరాల ఘటనలతో మరచిపోకుండ, చిట్టివలస కాల్పులు వచ్చాయి. రాష్ట్ర కాంగ్రెసు విచారణ జరిపింది. అంతేగాని కార్మికులకు న్యాయం కలుగలేదు. కల్గించేటట్లు చూడాలి. మద్రాస్ ట్రేడ్ యూనియన్ నాయకులు కోరుచున్న కనీసపు కోర్కెలను ఆధారముచేసికొని కార్మిక శాసనము త్వరగా పాస్‌చేయవలెనని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాలి.

ఇక రైతుల విషయం. కాళీపట్నం వ్యవహారంలో, రాష్ట్ర కాంగ్రెసు ఇదివరకు అవలంభించిన వైఖరి అసంతృప్తికరంగా ఉంది. రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి గావించిన సంధి షరతులనే మునగాల జమీందారు ఉల్లంఘించ ప్రయత్నించుచున్నాడు. సంధి షరతులను ఉల్లంఘించ రైతుకోర్కెలను తీర్చడానికి జమీందారుపై ఒత్తిడి తేవాలి. ప్రకాశం కమిటీ రిపోర్టు ననుసరించి వెంటనే బిల్లు తేవాలని ప్రభుత్వానికి జ్ఞాపకము చేయాలి.

వ్యవసాయ కూలీల విషయం. రాష్ట్రములోనున్న బంజరు భూములు, వ్యవసాయ కూలీల పరిస్థితులనూ విచారించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలి. ఆ కమిటీ వ్యవసాయ కూలీలకు భూములను ఇప్పించడానికి తగు భూములెక్కడెక్కడ ఉన్నాయో విచారించాలి. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వము ఎలాంటి "బిల్లు"ను తీసుకురావాలో ఈ కమిటీ సూచించాలి. ఈ కమిటీలో నేడు వ్యవసాయ కూలీలలో పనిచేయుచున్న కాంగ్రెసువాదులను వేయాలి.

ఇంకో ముఖ్యమైన విషయం. యు. పి. రాష్ట్ర ప్రభుత్వము "కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగించమని" కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. అట్టి తీర్మానాన్ని మన రాష్ట్ర ప్రభుత్వముకూడ చేయాలని రాష్ట్ర కాంగ్రెసు కోరాలి.

అన్నిటికంటె మరువరాని విషయం మరొకటి. అన్ని రాష్ట్రాలలోను వలంటీరు దళాలు ఏర్పరచారు. ముఖ్యంగా యు. పి. రాష్ట్రం ఈవిషయంలో ముందంజ వేసింది. కనీసం 10 వేలమంది వలంటీర్లనయినా రాష్ట్రకాంగ్రెసు తయారుజేయాలి.

ఈ పైవిషయాలన్నీ మనస్సునందుంచుకొని రాష్ట్రకాంగ్రెసుసంఘం, ఈసారి తగిన మార్గం చూపుతుందని ఆశించుతాము.

వివిధ రాజకీయాలు

ఛాంబర్లేన్ ఛాలెంజి

బ్రిటిష్ విదేశ రాజ్యాంగ నీతినిగురించి పార్లమెంటులో జరిగిన చర్చకు బ్రిటిషు ప్రధాని ఛాంబర్లేన్ జవాబు చెబుతూ, వలసదేశాల విషయమై "మనం సంస్కరణలిచ్చి శాంతిని తెచ్చుకోవడం అసంభవం: ఆ విధముగా మనము చేస్తే, వారి కోర్కెలు ఇంకా ఎక్కువౌతాయి" అన్నాడు. గ్రేట్ బ్రిటన్ ప్రపంచ యుద్ధములో యిరుక్కున్నప్పుడు బ్రిటిషు రాజ్యాంగవేత్తలు ఇండియాకు కొన్ని సంస్కరణలయినా ఇచ్చి భారతీయుల అసంతృప్తిని చల్లారుస్తారని ఆశించే కొందరు జాతీయ నాయకులకు ఈ జవాబు కొంత గాభరా పెట్టక మానదు. కాని, సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు అంతిమ పోరాటాన్ని సాగించాలని ఉవ్విళ్ళూరే భారత ప్రజాసామాన్యానికి మాత్రం ఛేంబర్లేన్ ఇచ్చిన జవాబు ఒక ఛాలెంజ్‌గానే అన్వయమవుతుంది.

ఇండియా గవర్నమెంటు సర్క్యులర్

ప్రపంచయుద్ధమువంటి ఆపత్సమయంలో బ్రిటన్ దేశం ఇండియానుండి సహాయము పొందడానికి అన్ని యేర్పాట్లు చేసుకొంటూంది. ఈ మధ్య ఇండియా గవర్నమెంటు వేర్వేరు ప్రాంత వ్యాపార సంస్థలకు, పారిశ్రామిక సంస్థలకు సర్క్యులర్ ఒకటి పంపింది. దాని ప్రకారము, యుద్ధకాలములో గ్రేట్ బ్రిటన్‌కి ఎగుమతి చేయవలసిన సరకులు త్వరత్వరగా సప్లయి కావడానికి ఇప్పుడు తాత్కాలికముగా ఇంగ్లండులో నివసించే పారిశ్రామిక నిపుణుల యొక్క వర్తకశిఖామణులయొక్క ఎడ్రసులు జూలై 1 వ తేదీలోగా ప్రభుత్వానికి పంపాలి. ఆవిధముగా పంపితే, ఆపత్సమయము (ప్రపంచ యుద్ధమువంటిది) వచ్చినప్పుడు వెంటనే వారందరినీ బ్రిటిషు ప్రభుత్వము ఇండియాకు రవానా చేస్తుంది. అప్పుడు బ్రిటన్‌కి కావలసిన యుద్ధసామగ్రి, ముడిసరకు వగయిరా చకచకా ఎగుమతి చేయబడతాయి.

యుద్ధ సమయములో సైనికులకు కావలసిన సప్లయిలు చురుకుగా అందజేయటానికి ఇండియాలో సైనిక డిపార్టుమెంటు యే విధంగా స్వదేశీ పరిశ్రమలకు ప్రోత్సాహం యిస్తూందో కంట్రాక్టు డైరెక్టరు సాంవత్సరిక నివేదిక తెలియజేస్తోంది. ఈ రిపోర్టు ప్రకారము, గత సంవత్సరములో సైనిక డిపార్టుమెంటువారు రూ. 2,26,35,251 ల విలువగల సరకులు మన దేశములో కొన్నారు. లాహోరు, ఢిల్లీ, కలకత్తా నగరములలో వీరి ఏజంట్లు సప్లయిచేసిన రకరకముల ఆహారధాన్యాలు, పప్పు, నెయ్యి, టీ-మొదలయిన సరకుల విలువ 1937 వ సంవత్సరములో కంటే విపరీతముగా ఎక్కువయింది. సరిహద్దు ప్రజల తిరుగుబాట్లను అణచడానికి ప్రభుత్వము గావించిన యుద్ధములో యీ సప్లయిలన్నీ అవసరమయాయి.

ఈ విధముగా, విదేశీ సామ్రాజ్య ప్రభుత్వము కాంగ్రెసు మహాసభ ప్యాసుచేసిన యుద్ధ ప్రతికూల తీర్మానాన్ని పూర్తిగా నిర్లక్ష్యంచేసి, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకముగా, ఇండియాలో యుద్ధ సన్నాహాలు చేస్తోంది.

జాతీయ ప్రతికూల శక్తుల విజృంభణ

దేశములో ఉన్న జాతీయ ప్రతికూల శక్తులు రోజు రోజుకీ విజృంభిస్తూ, బ్రిటిషు ప్రభుత్వం యొక్క ఈ పన్నాగాలకు సహాయ పడుతున్నాయి. బెంగాల్ రాష్ట్రములో 100 కి 55 మందికి ఉద్యోగాలు మహమ్మదీయులకు ప్రత్యేకించాలంటూ ప్రధాన మంత్రి ఫజ్లుల్‌హక్ ఒక మెమొరాండము తయారుచేశాడు. అనేక మతాలు గల ఇండియావంటి దేశములో యీ పద్ధతి ఉండి తీరాలని అతడు వాదిస్తున్నాడు. కాంగ్రెస్ పార్టీ నాయకుడైన శరత్‌చంద్రబోసు ఉద్యోగాల విషయములో మతముల ప్రసక్తి తీసుకొనిరావడము దారుణము అనీ, తెలివితేటలను బట్టే ఎవనికైనా ఉద్యోగము యివ్వాలనీ, తీవ్రంగా విమర్శిస్తున్నాడు. ఫజ్లుల్ హక్ మెమొరాండము ఆచరణలోకి రాకుండా చూడవలసిందని రవీంద్రనాథ ఠాకూర్, పి. సి. రే వంటి బెంగాల్ నాయకులు గవర్నరుకు ఒక విజ్ఞప్తిని పంపారు.

ఇదే విధముగా, కలకత్తా మ్యునిసిపాలిటీలో సంయుక్త నియోజకవర్గాల పద్ధతిని నిర్మూలించి, ప్రత్యేక నియోజకవర్గాల నేర్పాటుచేసే బిల్లు బెంగాల్ శాసనసభలో ప్యాసయింది. ప్రజాభిప్రాయము దీనికి పూర్తిగా వ్యతిరేకము. 25,000 మంది సమావేశమైన ఒక బహిరంగసభలో ఈబిల్లును ఖండిస్తూ తీర్మానము ఆమోదించబడింది. ఇది పనికిరాదని తెలియజేస్తూ 1 లక్షమంది కలకత్తా పౌరుల సంతకాలు కూడా తీసుకొంటున్నారు.

గయలో హిందూ—మహమ్మదీయ నాయకుల ప్రోత్సాహమువల్ల హిందువులు, మహమ్మదీయులు దౌర్జన్యానికి దిగారు. 14 గురు చచ్చిపోయారు. 124 గురికి గాయాలు తగిలాయి. ఈ కలహం 36 గంటలు సాగిన తరువాత పోలీసులు అణచివేశారు. బాబు రాజేంద్ర ప్రసాదు, ముస్లింలీగ్ అధ్యక్షుడు స్వయంగా వెళ్ళి ఉభయ మతాలవారు సఖ్యంగా ఉండవలసినదని హెచ్చరించి, సహాయ నిధిని ఒకదాన్ని ఏర్పరచారు. రాష్ట్రీ కాంగ్రెసు కమిటీ తరఫున రాజేంద్రప్రసాద్ 500 రూపాయలు విరాళం యిచ్చాడు.

యు. పి. రాష్ట్రంలో మహమ్మదీయులకూ—మహమ్మదీయులకూ మధ్య పోరాటము జరుగుతోంది. షియా మహమ్మదీయులు తమకు పవిత్రగ్రంథమైన 'తబర్రా'ను పఠిస్తూంటే, సున్నీ మహమ్మదీయులు అభ్యంతరము పెట్టారు. 'తబర్రా'ను పఠించడం నిషేధిస్తూ యు. పి. కాంగ్రెసు మంత్రివర్గము ఉత్తరువు చేసింది. వెంటనే షియాలు సత్యాగ్రహం ప్రారంభించారు. ప్రతి రోజు 100 మంది, 200 మంది, చొప్పున అరెస్టు అవుతున్నారు. ఇప్పటికి సుమారు 9000 మంది షియాలు అరెస్టు చేయబడ్డారు. భారత దేశంలో ఉండే ముస్లిం ప్రజల కందరికీ ప్రాతినిధ్యం వహించే సంస్థ ముస్లిం లీగ్ ఒక్కటేనని బడాయికొట్టే జిన్నా ప్రభృతులు యీ ఆందోళనలో ఏమీ కలుగజేసుకొనడంలేదు. ముస్లింలీగ్‌యొక్క యు. పి. శాఖ సమావేశమైనపుడు యీ తగాదాను పరిష్కారం చేయడానికి ఎట్టి చర్య తీసుకొనలేదు. కాంగ్రెసు ప్రభుత్వాన్ని ఏ విధంగానైనా బలహీన పరుద్దాం అని ముస్లింలీగ్ నాయకుల అభిప్రాయం. కనుకనే యీ తాటస్థ్యం. యు. పి. ప్రధాని గోవిందవల్లభపంతుకీ, కిద్వాయి మొదలైన యితర మంత్రులకూ, ఆకాశరామన్న ఉత్తరాలుకూడా వస్తున్నాయి. ఖూనీ చేస్తాం అని ఆ ఉత్తరాలలో బెదరింపులు ఉన్నాయి. ఈ విధంగా దేశంలో మతకలహాలు వ్యాపిస్తూంటే, భారతీయులు స్వరాజ్యానికి అనర్హులని బ్రిటిషు ప్రభుత్వము చెప్పడానికి అవకాశం చిక్కింది.

బెంగాల్ శాసన సభలో లలితచంద్రదాసు అనే కాంగ్రెసు సభ్యుడొక తీర్మానాన్ని ప్రతిపాదించాడు. గాని ప్రకారము, బెంగాలులో మతావేశాలను అణచడానికి బెంగాల్ ప్రభుత్వము తగిన చర్య తీసుకొనవలసినదని సిఫార్సు చేయబడింది. సంయుక్త నియోజకవర్గాలను నెలకొల్పుట, అల్పసంఖ్యాకులకు సీట్లు రిజర్వు చేయుట యిత్యాది కార్యక్రమము కూడా తీర్మానములో సూచించబడింది. కాని, శాసనసభ ఆతీర్మానాన్ని నిరాకరించివేసింది.

సంస్థానాలలో నిరంకుశత్వం

ఇండియాలో బ్రిటిష్ ప్రభుత్వానికి దాసోహము చేసే సంస్థానాధీశులు రోజురోజుకీ తమ నిరంకుశత్వాన్ని ఎక్కువ చేస్తున్నారు. లింబ్డీ సంస్థానములో రాక్షసపరిపాలన తాండవమాడుతోంది. బయటికి పారిపోయిన వేలకొద్దీ ప్రజల ఆస్తులను సంస్థానప్రభుత్వము స్వాధీనము చేసుకొంది. రైతుల్ని నిర్బంధించి రాజభక్తి ప్రమాణాల మీద సంతకాలు చేయిస్తున్నారు. ప్రజా మండలిలో సభ్యులుగా ఉన్నవారిని రాజీనామాలు పెట్టిస్తున్నారు. గంగపూర్‌లో నిరాయుధులయిన రైతులపై తుపాకులు కాల్చినప్పుడు 32 రు చచ్చిపోతే కాల్పులను ప్రభుత్వము సమర్థించుతూ ప్రకటనచేసింది. భావనగర్ ప్రజల ప్రజాపరిషత్ మహాసభను జరుపుకొనే సందర్భములో ఊరేగింపు చేసుకొంటూంటే, రౌడీలు దౌర్జన్యముగా చెదరగొట్టి, ఇద్దరు పరిషత్ నాయకుల్ని గాయపరిచారు. తిరువాన్కూరు సత్యాగ్రహోద్యమములో పాల్గొన్న 21 స్టేట్ కాంగ్రెసు నాయకులు శాసనసభ ఎన్నికలకు నిలబడకూడదని ప్రభుత్వము ఆంక్ష విధించింది. కనుక, ఎన్నికలలో పాల్గొనకూడదని స్టేట్ కాంగ్రెసు తీర్మానించింది. తిరువాన్కూరుసంస్థానము అంతటిలోనూ విప్లవ నినాదాలను, కమ్యూనిస్టు ప్రచారాన్ని, ఎర్రజెండాను, నిషేధిస్తూ సంస్థాన ప్రభుత్వము ఉత్తరువు లిచ్చింది. మైసూరు సంస్థానములో యస్. రామస్వామి మొదలయిన ప్రచారకులమీద 144 వ సెక్షన్ ప్రయోగించబడింది. వారు 2 నెలల వరకూ ఉపన్యాసాలివ్వకూడదు. టి. యస్. సుబ్బన్న, రాజశేఖర్ అనే యిద్దరిమీద ఊరేగింపులు జరపకూడదంటూ నిషేధాజ్ఞ జారీ చేయబడింది. రాజద్రోహానికి శిక్షింపబడిన సిద్దయ్య, సుబ్రహ్మణ్యంగార్లను జైలులో నానాహింసలు పెడుతున్నారు. హైదరాబాద్ సత్యాగ్రహులమీద సంస్థాన ప్రభుత్వం గావిస్తూన్న దారుణాలకు హద్దే లేదు.

యు. పి. ప్రభుత్వం భారతదేశ చరిత్ర

కాని, యీ జాతీయ నిరోధక శక్తులతోబాటు జాతీయ శక్తులుకూడా విజృంభిస్తూనే ఉన్నాయి. యు. పి. శాసనసభలో ప్రతిపాదించబడిన అనధికార తీర్మానం ఒకటి కాంగ్రెసు ప్రభుత్వంచే అంగీకరించబడి, ప్యాస్‌చేయబడింది దాని ప్రకారము, స్కూళ్ళలో బోధించబడు భారతదేశ చరిత్రకు సంబంధించిన గ్రంథాలన్నీ పరిశీలించి, మతద్వేషాలను రెచ్చగొట్టే భాగాలను—ఇతర దేశాలకంటె ఇండియా తక్కువ అనే అభిప్రాయాన్ని ప్రచారంచేసే భాగాలను, తొలగించడానికి ఒక ఉపసంఘము నియమించబడుతుంది.

అట్టి భాగాలు "విషపూరితమైన"వని తీర్మానాన్ని ప్రతిపాదించిన అబ్బాస్‌గారు చెప్పారు. విదేశస్థులచే రచింపబడ్డ పుస్తకాలు చరిత్రకాదనీ, ప్రచారము అనీ న్యాయశాఖా మంత్రి కట్జూ పలికాడు. నేటి మన విద్యావిధానంలో తీవ్రమైన సంస్కరణలు తీసుకొనిరావలసిన ఆగత్యము కాంగ్రెసు సంస్థచే గుర్తించబడింది. యు. పి. కాంగ్రెసు ప్రభుత్వం యీ విషయములో ఇతర ప్రభుత్వాలకంటె ముందడుగు వేస్తోంది. చరిత్రకు సంబంధించిన గ్రంథాలన్నీ పూర్తిగా మార్చివేయవలసిన ఆవసరము యిదివరకే కాంగ్రెసు ప్రభుత్వాలు గుర్తించి యుండవలసింది. ఇప్పుడైనా ఆ అవసరము గుర్తించి ముందుకు పోతారని ఆశిస్తున్నాం.

ముస్లింల జాతీయత

ఒక వైపున కొన్ని రాష్ట్రాలలో హిందూ—ముస్లిం నాయకులు జాతీయ శక్తులతో ఢీ కొంటూంటే, మరికొన్ని రాష్ట్రాలలో జాతీయ స్వభావాన్ని ప్రకటిస్తున్నారు. వీరికీ—ముస్లిం ప్రజా సామాన్యానికీ మధ్యగల సంబంధమే యిందుకు కారణము. బొంబాయిలో సమావేశమైన జమియత్ ఉలేమా (అహరార్సు) మహాసభకు అధ్యక్షత వహించిన మౌలానా హబీబర్ రహిమాన్‌గారు యీ విధముగా ఉపన్యసించారు

"మనం ఎందువల్ల ముస్లింలీగ్‌తో చేరము అంటే బ్రిటిషు ప్రభుత్వంతో సహకారము చేయడమే ఆసంస్థ యొక్క ప్రధాన సూత్రము. ఇస్లాం మతం ఉచ్చదశలో ఉండాలనీ, ఇండియాకు స్వాతంత్ర్యం రావాలనీ, అహరార్లు కోరుతారు....ఇండియా బానిసత్వంలో ఉన్నంత కాలం యితర ముస్లిం దేశాలకు స్వాతంత్ర్యం రాదు." ఆహ్వాన సంఘాధ్యక్షుడైన ఆలీ బహదూర్‌ఖాన్ యిలా చెప్పాడు, "ఇండియాలో నేడు రెండే పార్టీలు ఉండాలి. ఒకటి, దోచుకొనే బ్రిటిష్ సామ్రాజ్యవాదులు, రెండు, దోచుకొనబడే భారతీయ ప్రజలు" ప్రపంచ యుద్ధంలో ముస్లింలు గ్రేట్ బ్రిటన్‌కి ఏ విధముగానూ సహాయము చేయకూడదను తీర్మానం మహాసభలో ప్యాస్‌చేయబడింది. ముస్లింలు ఎవరూ యీ మహాసభకు వెళ్ళవద్దని జిన్నా ప్రకటించినప్పటికీ వేలకొద్దీ మహమ్మదీయులు హాజరయ్యారు.

కాశ్మీర్ ముస్లింలు—ముస్లింలీగ్

ఇదే విధంగా, కాశ్మీర ముస్లిం కాన్ఫరెన్సుకు అధ్యక్షుడైన యస్. యం. అబ్దుల్లా సంస్థాన ప్రజలయెడ ముస్లింలీగు చూపుతూన్న ప్రతికూల వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ స్టేట్‌మెంటు యిచ్చాడు, 8 కోట్లమంది సంస్థాన ప్రజల హక్కులకు ముస్లింలీగ్ అపకారం చేస్తున్నదని స్పష్టంగా చెప్పాడు. కాబట్టి కాశ్మీర్ సంస్థాన మందలి ముస్లిం ప్రజలు కాంగ్రెసు విధానాన్ని అనుసరిస్తున్నారని ప్రకటించాడు.

బ్రిటిష్ ప్రభుత్వానికి జోహారులుచేసే ముస్లింలీగ్ నాయకులు సంస్థాన ప్రజల పోరాటంలో జోక్యం కలిగించుకొంటే, సంస్థాన ప్రభుత్వాలు—వాటితోబాటు బ్రిటిషు ప్రభుత్వము బలహీన మవుతాయి. కనుకనే సంస్థాన ప్రజలు మహమ్మదీయులే అయినప్పటికీ, ముస్లిములీగ్ నాయకులు వారి హక్కులకై పోగరు.

పంజాబు కాంగ్రెసు—ముస్లిము ప్రజలు

పంజాబు రాష్ట్రీ కాంగ్రెసు కమిటీ కార్యదర్శి సోహన్‌సింగ్‌జోష్‌గారు క్రింది కమిటీలకొక సర్క్యులర్ పంపారు. దాని ప్రకారము, జిల్లా, తాలూకా, స్థానిక కాంగ్రెసు కమిటీ ఎన్నికలలో సాధ్యమైనంతవరకు మహమ్మదీయులనే అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకొనేటట్లుచూడాలి. ఈసూచనలో ఎంతైనా అర్థం ఉంది. మతవైషమ్యాలను రెచ్చగొట్టి పలుకుబడి సంపాదించుకొంటూన్న జాతీయప్రతికూల మంత్రివర్గము అధికారములో ఉన్న పంజాబులో, కాంగ్రెసు పలుకుబడిని, బలాన్ని ఎక్కువచేయడానికి పై సూచన చాలావరకు ఉపయోగపడుతుంది. కాంగ్రెసు సంస్థపై ఆమంత్రివర్గము మోపుతూన్న నిందలకు జవాబు చెప్పినట్లవుతుంది.

పంజాబులో వెట్టి నిర్మూలన

పంజాబు మంత్రివర్గము కాంగ్రెసు మంత్రివర్గాల మాదిరిగానే ప్రజలలో పలుకుబడిని హెచ్చు చేసుకోవడానికి సకలవిధాలా ప్రయత్నిస్తోంది. రాబోయే ప్రపంచసంగ్రామములో బ్రిటిషు ప్రభుత్వానికి సహాయము చేయమని ప్రజల్ని హెచ్చరించేటప్పుడు మీకు యీ ఉపకారము చేశాం ఆ ఉపకారం చేశాం అని ప్రచారము చేయవచ్చు.పంజాబు రాష్ట్రములో ఎవరూ ఎవరిచేతా వెట్టి చేయించుకో కూడదని పంజాబు ప్రభుత్వము కమ్యూనిక్ ఒకటి ప్రకటించింది. ఈవిషయము పల్లెటూళ్ళలో అందరికీ తెలిసేలాగు దండోరా వేయించి, గ్రామోద్యోగుల యొక్క, వెట్టి చేసే కష్టజీవుల యొక్క సంతకాలు తీసుకొనమని ఉత్తరువులు పంపుతోంది.ఇండియాలో అనేక ప్రాంతాలలో వెట్టి మొదలయిన మధ్యయుగపు చిహ్నాలు చాలా అమలులో ఉన్నాయి.కాంగ్రెసు మంత్రులు అధికారానికి వచ్చాక యీ పాడు ఆచారాన్ని చట్ట రీత్యా నిషేధించారు అనేక రాష్ట్రాలలో. ఆదేవిధముగా పంజాబునందలి సికిందర్ ప్రభుత్వము కూడా నిషేధిస్తోంది. ఐతే, ఒక్క విషయము మరచిపోకూడదు. ఏప్రభుత్వము అయినా వెట్టిని నిషేధిస్తూ ఉత్తరువులు ప్యాసుచేసినంతమాత్రాన అది నిర్మూలనకాదు. జమీందారీ విధానాన్ని నాశనము చేసి, వ్యవసాయము చేసే ప్రతిరైతుకీ భూమిపై హక్కుయివ్వాలి. జీవనోపాధికి తగినంత భూమి లేకపోవడమువల్లనే అసంఖ్యాక ప్రజలు వెట్టి చేసి బ్రతకవలసివస్తోంది.

ఒరిస్సా రాష్ట్రీ కాంగ్రెసు కమిటీ

బరంపురములో సమావేశమైన ఒరిస్సా రాష్ట్రీ కాంగ్రెసు కమిటీ ముఖ్యమైన తీర్మానాలు కొన్ని చేసింది. ఒరిస్సా కాంగ్రెసు మంత్రివర్గము రాష్ట్రీ కాంగ్రెసు కమిటీతో సరిగా సహకారము చేయడములేదనీ; ప్రజల అభిప్రాయాలను మంత్రివర్గము తెలుసుకొనకుండా శాసనాలు మొదలయినవి చేయడమువల్ల కాంగ్రెసు ప్రభుత్వం అంటే ప్రజలలో "కావలసినంత" అసంతృప్తి ఏర్పడినదనీ; యిక ముందైనా రాష్ట్రీ కాంగ్రెసు కమిటీతో మంత్రులు సహకారము చేయవలసిందనీ; రాష్ట్రీ కమిటీ సూచించే పద్ధతుల ప్రకారము మంత్రులు శాసనాలు చేయవలసిందనీ — తీర్మానించబడింది.

మొట్టమొదటి నుండీ కాంగ్రెసు మంత్రులకూ, కాంగ్రెసు కమిటీలకూ, అన్యోన్యభావం ఉండియున్నట్లయితే, ప్రజలలో ఈ అసంతృప్తికి అవకాశమే ఉండేదికాదు. మన మద్రాసు రాజధానికి కూడా గోదావరకు ఒరిస్సాగతే

[illegible]

క్షత వహిస్తూ, యిలా అన్నాడు, "ఫెడరేషన్‌ని ఇప్పుడు ఉన్నట్లుగా ఆచరణలో పెట్టే అవకాశాలు తక్కువ. ఎందువల్లనంటే సంస్థానాధీశులు సహితము దానికి వ్యతిరేకులు." కొందరు సంస్థానాధీశులు ఫెడరేషన్‌ని వ్యతిరేకిస్తూన్నమాట వాస్తవమే. కాని వారు వ్యతిరేకిస్తూన్న కారణాలకూ, కాంగ్రెసువారు వ్యతిరేకిస్తూన్న కారణాలకూ, ఎంతో భేదము ఉంది. ఫెడరేషన్‌ని అంగీకరిస్తే తమ హక్కులు కొన్ని పోతాయని సంస్థానాధీశుల భయము. భారతీయులు ఇప్పుడు అనుభవించే కొద్ది హక్కులుకూడా లాగివేయబడతాయని కాంగ్రెసు అంటుంది. ఫెడరేషన్ విషయములో సామ్రాజ్యవాదుల జోహుకుందార్లకూ, స్వాతంత్ర్య పిపాసగల కాంగ్రెసు సంస్థకీ, ముడిపెట్టడము సత్యమూర్తికే చెల్లింది.

అయితే 21-5-39 వ తేదీని మద్రాసులో సమావేశమైన జిల్లాకాంగ్రెసుకమిటీ (మద్రాసు)లో ఈక్రింది తీర్మానం ఆమోదించబడెను.

"బొంబాయి, కుంభకోణం వగైరా స్థలములలో శ్రీ సత్యమూర్తిగారు యిచ్చిన ఉపన్యాసములయందు ఫెడరేషన్ యెడల చూపిన వైఖరిని యీ సభవారు ఖండించుచున్నారు, ఇండియన్ నేషనల్ కాంగ్రెసు యొక్క విధానానికి, సిద్ధాంతాలకు, ఈవైఖరి వ్యతిరేకము. ఈవిషయములో తమిళనాడు కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడు తగిన చర్య తీసుకొనవలసినదిగా యీ సభవారు కోరుచున్నారు."

వేఱ్వేఱు ప్రదేశాలలో

ఆర్థిక-రాజకీయ పాఠశాలల కార్యక్రమం

గుంటూరుజిల్లా, నిడుబ్రోలులో ప్రారంభమయిన ఆంధ్ర రైతాంగ విద్యాలయములో సుమారు 50 మంది యువకులు తరిఫీదు పొందుతున్నారు. అఖిల భారత రైతుసంఘ ఉపాధ్యక్షులైన ఆచార్య రంగా గారు నేటి భూమి శిస్తు విధానములోని అవకతవకలను విశద పరుస్తూ, న్యాయమైన విధానము ఎట్టి పద్ధతుల మీద నిర్మించబడవలసినదీ తెలియజేస్తూ ఉపన్యసించారు. శ్రీ సీతారామయ్యగారు, మన దేశములో కరువులు, కరువు నివారణకై ప్రభుత్వము అవలంబించవలసిన మార్గాలు—ఈవిషయాన్ని గురించి ఉపన్యసించారు. మన చేనేత పరిశ్రమను గురించి శ్రీ పెండ్యెం వెంకట్రాములుగారిచ్చిన ఉపన్యాసం ఆకర్షవంతముగా ఉంది. గుంటూరుజిల్లా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ కార్యదర్శి కామ్రేడ్ పి. వి. శివయ్యగారు కాంగ్రెసు చరిత్రను రోజుకు 12 గంటలచొ॥ పాఠాలు, ఉపన్యాసాలు చెప్పబడుతూన్నప్పటికీ విద్యార్థులు విసుగుచెందక, కుతూహలంతో ప్రశ్నలు వేయుట, చర్చలు సాగించుట మొదలయినవి వాటిలో పాల్గొంటున్నారు.

ఇచ్ఛాపురం

మే 1 వ తేదీని ప్రారంభించబడిన ఇచ్ఛాపురం రాజకీయ—ఆర్థిక పాఠశాల జయప్రదంగా సాగుచున్నది. కామ్రేడ్ చున్నీముఖర్జీ (కలకత్తా) గారు ప్రతిదినం ఉదయము 5½ నుండి 6½ వరకునూ సాయంత్రం 6 నుండి 7 వరకునూ, విద్యార్థులకు మిలిటరీ శిక్షణ యిస్తున్నారు. నిత్యము పాఠములు నేర్పుటకు కామ్రేడ్స్ సి. సూర్యనారాయణ, జొన్నలగడ్డ రామలింగయ్యగారలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నారు. బొంబాయి కార్మిక నాయకులైన కామ్రేడ్ ఖార్డికర్ (బొంబాయి)గారు మానవ సంఘ పరిణామాన్ని గురించీ, పల్లెటూళ్ళలో చేయవలసిన ప్రచార పద్ధతులను గురించీ, విపులంగా ఉపన్యసించారు.

కార్మిక—కర్షకులలో ఏలా చైతన్యము కలుగజేయాలో విద్యార్థులకు ప్రత్యక్షంగా తెలియజేయుటకై విద్యార్థులు, అధ్యాపకులు అప్పుడప్పుడు చుట్టుపట్ల గ్రామాలలో ప్రచారంకూడా చేస్తున్నారు. 11 వ తేదీని ఇచ్ఛాపురమునకు 6 మైళ్ళ దూరంలో ఉన్న రాజపురం గ్రామానికి వెళ్ళారు. గ్రామస్థులు మిక్కిలి ఉత్సాహంతో ప్రచారకులను ఆహ్వానించారు. గ్రామ కాంగ్రెస్ సంఘాధ్యక్షులైన శ్రీ పిన్నింటి రామన్నశర్మ గారు వారికి ఆతిధ్యం యిచ్చారు. మధ్యాహ్నం గ్రామస్థుల ఆర్థిక స్థితిగతుల్ని గురించి విద్యార్థులు విచారణ చేసి, ఒక నివేదికను తయారు చేశారు. 5000 మంది జనాభాలో 500 మందికి మాత్రమే సంతకము చేయగలరనీ; భూమి బొత్తిగా లేని కూలీ జనం మొత్తము 3000 అనీ; 30 యకరములకంటె ఎక్కువ భూవసతి గలవారు 4, 5 గురుకంటె లేరనీ—గ్రామస్థు లిచ్చిన సాక్ష్యమువల్ల ప్రచారకులు తెలుసుకొన్నారు.

ఇదేవిధముగా బెల్లుపడ, రత్తకన్న వగైరా గ్రామాలలో ప్రచారము జరిగెను. పాఠశాలయొక్క పైనందిన కార్యక్రమము చక్కగా సాగుతోంది.

పామర్రు

కృష్ణాజిల్లా, పామర్రులో స్థాపించబడిన ఆర్థిక—రాజకీయ పాఠశాలకూడా జయప్రదంగా సాగుతోంది. కామ్రేడ్ మునుపల్లి రామారావుగారు మిలిటరీ శిక్షణ యిస్తున్నారు. శ్రీ గోపరాజు రామచంద్రరావుగారు పరిణామ వాదాన్ని గురించీ; కామ్రేడ్ మాడభూషి వెంకటాచారిగారు సంస్థానాలు—ఫెడరేషన్ అనే విషయాన్ని గురించీ; కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణ గారు భారత జాతీయ పోరాటాలను గురించీ, కామ్రేడ్ తుమ్మల వెంకట్రామయ్యగారు భారత కార్మికోద్యమాన్ని గురించీ; ఇంకా యితరులు ఫెడరేషన్, రైతు ఉద్యమం, సోషలిస్టు ఉద్యమం, మొదలైన విషయాలను గురించి ఉపన్యాసాలిచ్చారు. కామ్రేడ్ కె. యల్. నరసింహంగారు సామ్యవాద సిద్ధాంతాలను గురించీ, ప్రతాప రామసుబ్బయ్యగారు రాజకీయ భూగోళాన్ని గురించి ఉపన్యసించారు.

పల్లెకోన

పల్లెకోనలో నిర్వహించబడుచున్న వేసంగి రాజకీయ పాఠశాల ఉత్సాహవంతముగా జరిగినది. టి. వి. కృష్ణమూర్తిగారు మిలిటరీ డ్రిల్లు నేర్పినారు. కామ్రేడ్ కంభంపాటి సత్యనారాయణగారు (ఎం. ఏ. బి. యల్.) కాంగ్రెసు చరిత్రను గురించి విపులంగా ఉపన్యాసాలిచ్చారు. వావిలాల గోపాలకృష్ణయ్యగారు రైతు సంఘాలు—వాటి ఆవశ్యకతను గురించి బోధించారు. మహీధర రామమోహనరావుగారు ప్రథమ భారత స్వాతంత్ర్య సమరాన్ని గురించీ, రష్యా విప్లవాన్ని గురించీ, బోధించారు. పి. వి నరసింహంమూర్తిగారు భారత కార్మికోద్యమాన్ని గురించీ, అంతర్జాతీయ కార్మికోద్యమాన్ని గురించీ, ఉపన్యసించారు. 1935 వ సంవత్సరపు నూతన ఇండియా రాజ్యాంగ చట్టము, ముఖ్యంగా ఫెడరేషన్‌ను గురించి కంభంపాటి సత్యనారాయణగారు తెలియజేశారు.

హిందూపురం

అనంతపురము జిల్లా యువజన సంఘం తరఫున ఈనెల 5 వ తేదీని ప్రారంభించబడిన పాఠశాలకు జిల్లా అన్నివైపులనుండీ సుమారు 80 మంది యువకులు విద్యార్థులుగా వచ్చి పాఠాలు నేర్చుకొంటున్నారు. శ్రీ యస్. ఆర్. సుబ్బారావుగారు హిందూస్థానీ సేవాదళ ట్రైనింగు యిస్తున్నారు. రాయలసీమ—పరిశ్రమలు, నేటి ప్రపంచ పరిస్థితులు, సోషలిజం ఎందుకు, భారత జాతీయోద్యమ చరిత్ర, ఫెడరేషన్ మొదలైన విషయాలపై పలువురు ఉపన్యాసాలిచ్చారు.

మైపాడు

నెల్లూరు జిల్లా కాంగ్రెస్ సోషలిస్టుపార్టీవారి యాజమాన్యమున మైపాడు ఆర్థిక—రాజకీయ పాఠశాల 15-5-39 వ తేదీని శ్రీమతి దర్శి సుభద్రమ్మగారిచే ప్రారంభించబడింది. నెల్లూరుజిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులైన శ్రీయుత బద్దిపూడి వెంకట నారాయణ రెడ్డిగారు అధ్యక్షత వహించారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు సుశిక్షిత సైనికులవలె స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనవలసినదిగా సభాధ్యక్షులు హెచ్చ



శ్రీమతి దర్శి సుభద్రమ్మగారు

రించారు. శ్రీ సుభద్రమ్మగారు పాఠశాలకు ప్రారంభోత్సవం గావిస్తూ, గ్రేట్ బ్రిటన్‌యొక్క విదేశాంగ రాజనీతిని తీవ్రంగా ఖండించి, సామ్రాజ్యవాద యుద్ధములో భారతీయులెవరూ బ్రిటిష్ ప్రభుత్వానికి సహాయము చేయకుండా గ్రామ గ్రామాలలో ప్రచారము చేయువలసిందని పాఠశాల విద్యార్థుల్ని హెచ్చరించారు. శ్రీ వెన్నెలగంటి రాఘవయ్యగారుకూడా విద్యార్థులకు హితోపదేశం చేశారు.

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యగారు మైపాడు పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా ఉండి, భారతజాతీయోద్యమ చరిత్ర, కార్మిక-కర్షక పోరాటాలు, ఫెడరేషన్ వగైరా విషయాలను బోధిస్తున్నారు.

అమరావతి

18-5-39 వ తేదీని గుంటూరు జిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీ యాజమాన్యాన అమరావతిలో వేసంగి పాఠశాల ప్రారంభమైంది. 15 రోజులవరకూ నిర్వహించబడుతుంది. కామ్రేడ్ వావిలాల గోపాలకృష్ణయ్యగారు పాఠశాలకు ప్రిన్సిపాల్‌గా ఉన్నారు.

అస్సాం ఆయిల్ పనివారి సమ్మె సాగుతూనే వుంది

మిలిటరీ కాల్పులను గూర్చి న్యాయమైన విచారణ జరగాలి

ఈసమ్మె సుమారు 50 రోజులనుంచి సాగుచున్నది. ఏప్రిల్ 18 వ తేదీని ఈసమ్మె సందర్భములో జరిగిన కాల్పులను గూర్చి మేజిస్ట్రీటు విచారణ పూర్తియైనది. రిపోర్టు ప్రభుత్వమునకు పంపబడినది. కార్మికులు ఇందు ఎట్టి నిస్పృహ లేక సమ్మె తీవ్రముగా సాగించుచున్నారు. యూరోపియనులపై సాంఘిక నిషేధము తీవ్రముగా సాగుచున్నది. సమ్మెను విచ్ఛిన్నము చేయుటకు కంపెనీవారు కరపత్రములద్వారాను, మిలిటరీసహాయముచేతను చేయుచున్న ప్రయత్నములన్నీ విఫలములయినవి. కొంతమంది మహమ్మదీయులు, మహమ్మదీయ కార్మికులను చీల్చుటకు ప్రయత్నించి విఫలులైరి.

ఇంకనూ కాంగ్రెసు ప్రధాని మిలిటరీ దళమును ఆక్కడనుంచి తొలగించలేదు. రాష్ట్రీ కాంగ్రెస్‌కమిటీ మిలటరీని తొలగించాలని ప్రధానికి సూచించినట్లు తెలియుచున్నది. కాని అట్లు తొలగించుట దుర్లభమని ప్రధాని ప్రత్యుత్తర మిచ్చినట్లు తెలియుచున్నది. కాని క్రొత్త పనివారలను తెచ్చి పనిచేయించుట కొరకు కంపెనీవారు చేయు ప్రయత్నములకు మిలటరీ సహకారము చేయకూడదని సూచించాడు.

అస్సాము కాంగ్రెస్ కొయలిషన్ మంత్రివర్గంలోని కార్మిక శాఖా మంత్రి రెండు పార్టీలను సంప్రతించి యేప్రియల్ 25 వ తేదీన యీ వివాద పరిష్కారమునకై యీ క్రింది సూచనలు గావించాడు.

(1) యేప్రియల్ 3 వ తేదీన పనిలోనున్న వారందరిని తిరిగి కంపెనీపనిలో ప్రవేశపెట్టుకోవాలి. (2) ఈ సమ్మెకు కారణమగు, తొలగింపబడిన 5 గురిని వెంటనే తాత్కాలికముగ పనిలో పెట్టుకోవాలి. తరువాత వారి విషయము పరిష్కార కమిటీ ఆలోచించుతుంది. (3) కంపెనీ యెంతవరకు విచారణ కమిటీ సూచనలు ఆచరణలో పెట్టినది లేనిది, విచారణ జరుగు సమయమందు తొలగింపబడిన పనివారల విషయము, వివాద గ్రస్తమగు యితర విషయములు పరిష్కార కమిటీకి వదలివేయుటకు వుభయ పార్టీలు అంగీకరించాలి. (4) పరిష్కార కమిటీ తీర్పు వుభయపార్టీలు అంగీకరించవలసి ఉంటుందని కంపెనీవారికి కంపెనీ యజమాని తెలియచేయాలి.

కాని కంపెనీవారు యీ సూచనలు అంగీకరించలేదు. అందువలన కార్మిక సంఘమువారు అంగీకరించిననూ సమ్మె పరిష్కారము కాలేదు.

యేప్రియల్ 18 వ తేదీని జరిగిన కాల్పులను ఆజిల్లా మేజస్ట్రీటు జ్యూడిషియల్ విచారణచేసి రైఫుల్ మెన్(మిలటరీ)కాల్చుటవలన ముగ్గురు మరణించారని, వారు ఆత్మరక్షణార్థమై కాల్చవలసి వచ్చిందని, కంపెనీ ఉద్యోగస్తులు కాల్చలేదని, తెలియచేశాడు. కాని కేంద్ర సమ్మె కమిటీ రిపోర్టుయందు చుట్టుప్రక్కల దుకాణదార్లు సాక్ష్యమిచ్చుచు, ముందు కంపెనీ ఆఫీసర్లే కాల్చుచుండగా తాము చూచామని, తెలియచేసినట్లు ప్రకటింపబడినది.

కాంగ్రెస్ ప్రధాని యీ విషయమందు న్యాయాన్యాయములు గ్రహించుటకు అనధికారవిచారణకమిటీని యేర్పచాలి. సమ్మె పరిష్కారమగుటకు అభ్యంతరం కల్గించినది కంపెనీ యజమానులు గనుక వారి మీద తగుచర్యతీసుకొని వారు కార్మికులతో సమాధానమునకు వచ్చునట్లు కాంగ్రెసు మంత్రివర్గం కృషిచేయాలి.

విజయనగరం

మిల్లు యజమానికి రూ॥ 260 లు జరిమానా

విజయనగరములో శ్రీ సూర్యప్రకాశ రైస్, గ్రౌండ్ నట్ (వేరుశనగ) ఆయిల్ (నూనె)మిల్సు యజమాని తన మిల్లులో జరిగిన ఒక ప్రమాదమునుగురించి సకాలంలో పైఅధికారులకు తెలియజేయకపోవుటవలనను, మరలవద్ద తగు రక్షణ సదుపాయాలను ఏర్పరచక, నోటీసులు సరిగా ప్రకటించనందున, వారిపై ఫ్యాక్టరీ ఇన్స్పెక్టరు కేసుపెట్టగా, ఫ్యాక్టరీ ఆక్టు క్రింద మిల్లు యజమానికి 260 రూ॥లు జరిమానా విధించబడినది.

ఆంధ్ర రాష్ట్ర ప్రెస్ వర్కర్సు యూనియన్

పై యూనియన్ సాధారణ సభ్యుల సమావేశము 28-5-39 ఆదివారము ఉదయం 11 గంటలకు బెజవాడ ప్రెస్ వర్కర్సు యూనియన్ ఆఫీసులో జరుగును. సభ్యులందరు తప్పక విచ్చేయ ప్రార్థన. ఉదయం 10 గంటలకు కార్యనిర్వాహకవర్గ సమావేశము జరుగును.

పిల్లలమర్రి వెంకటేశ్వర్లు,
ప్రధాన కార్యదర్శి.

సామర్లకోట

సామర్లకోట పంచదార మిల్లులో సమ్మె యింకా జరుగుతోంది. రోజూ సభలు, ప్రదర్శనాలు జరుగుతున్నాయి. సమ్మె సహాయార్థము చందాలు, బియ్యము వగైరా వసూలు చేయబడుచున్నవి. రాణీపేట, నెల్లికుప్పం మిల్లులలో ప్రధానమంత్రిగారి సలహాపై సమ్మె ఆపుచేయబడింది. సామర్లకోటలో గత సంవత్సరము సమ్మె జరిగినప్పుడు కార్మికమంత్రిగారు,కార్యదర్శిగారు వారి సమస్యలన్నీ పరిష్కారం చేస్తామన్నారు. కాని, సంవత్సరం కావస్తూన్నా యింకా ఏమీ కదలికయే లేకపోవటంవల్ల కార్మికులవిశ్వాసాన్ని మంత్రివర్గం పొందలేకపోతూఉంది. మంత్రివర్గం ఈవిషయంలో తియ్యటి కబుర్లు కట్టిపెట్టి క్రియలో కార్మికులకు లాభం చూపించుట ప్రారంభించాల్సి వుంది.

యం. యస్. యం. రైల్వేపనివారల యూనియన్

బిట్రగుంట బ్రాంచి :

బిట్రగుంట బ్రాంచి యూనియన్ సంవత్సర సమావేశము కామ్రేడు యస్. గురుస్వామిగారి అధ్యక్షతక్రింద జరిగింది. 13—5—39 వ తేదీ సాయంత్రము రైల్వే పనివారలు గొప్ప వూరేగింపులో యూనియన్ ఆఫీసు వద్దనుంచి బయలుదేరి రైల్వేకాలనీ అంతా తిరిగిరి.

ది 14—5—39 వ తేదీ ఉదయము కామ్రేడు వి.వి. నరసింహం యం.యల్.ఏ. గారు యూనియన్ ఆఫీసు వద్ద కార్మిక పతాకోత్సవము జరిపిరి.

కామ్రేడు సుబ్బరామయ్యగారి నాయకత్వమున కార్మికులు, ఎఱ్ఱజండాలతో కామ్రేడు గురుస్వామి, జి.కృష్ణమూర్తిగార్లకు ఘనమగు స్వాగత మొసగిరి. యస్.ఐ. రైల్వేపనివారల యూనియన్‌కార్యదర్శి కామ్రేడు శివరామన్ నాయరు సభా ప్రారంభోత్సవం జరిపిరి. తమ ప్రారంభోపన్యాసంలో కార్మికులు తమ యూనియన్‌ను బలపరచుకొనవలసిన ఆవశ్యకతనుగూర్చి తెలియజేసిరి.

కామ్రేడు యస్. గురుస్వామిగారి అధ్యక్షోపన్యాసము.

"ఈ సంవత్సరము మన యూనియన్ బాగా అభివృద్ధి చెందింది. మద్రాసులో అఖిలభారత రైల్వే పనివారల సమ్మేళనము కలుసుకొని ముఖ్యమైన తీర్మానములుచేసింది. రైల్వేబోర్డుతో రైల్వేపనివారల కష్టములనుగురించి చర్చించుటకు పోతోవున్నాను. ప్రావిడెంటు ఫండు, ఎక్కువ ప్యాసులు, సెలవలు నిలవ వుంచుకునే అధికారము, కనీసపు వేతనములు నిర్ణయించుట మొదలగు పనివారల కనీసపు కోర్కెలను రైల్వేబోర్డువారు అంగీకరించి, వెంటనే పనివారలకు యివ్వాలి. విట్లీ కమీషనువారు సూచించినట్లుగా తగాదా పరిష్కార సంఘము (జాయింటు స్టాండింగు కమిటీ) వెంటనే ఏర్పాటుచేయాలి. రైల్వేబోర్డు ఇండియా గవర్నమెంటు వారు వీటిని నిరాకరిస్తే హిందూదేశ రైల్వేలలో పరిస్థితులు విషమిస్తవని తెలుసుకోవలసి ఉంటుంది........ మద్రాసు కాంగ్రెసు మంత్రివర్గము కార్మిక శాసనములు జేయబోతున్నది. కాంగ్రెసు మంత్రివర్గం వచ్చిన తరువాత పనివారల హక్కులు కాపాడబడుతవనే ధైర్యము మనలో హెచ్చింది" అని ఉపన్యసించిరి.

తరువాత యం. యస్. యం. రైల్వే పనివారల యూనియన్ ప్రధాన కార్యదర్శి, జి. కృష్ణమూర్తిగారు వుపన్యసించారు. "యీ బ్రాంచి సభ్యత్వము చాలా ఎక్కువైంది. ఈ బ్రాంచి పనివారల కష్టాలను విచారించి పై అధికారులకు తెలియజేస్తూ బాగా పనిచేసింది. పనివారలు శ్రద్ధతీసుకొని యీ బ్రాంచిని బలవత్తరం జేసేటట్లు జూడాల"ని చెప్పారు.

కార్యదర్శి నివేదికను అంగీకరించిన తరువాత 1939-40 కు కార్యనిర్వాహక ఎన్నికలు జరిగినవి కామ్రేడ్ సుబ్బరామయ్య ఉపాధ్యక్షులుగను, కామ్రేడ్ మాణిక్యం కార్యదర్శిగను, ఐదుగురు కార్యనిర్వాహకవర్గ సభ్యులుగ ఎన్నుకొనబడిరి.

కాకినాడ

కాకినాడ ఉప్పుమాల్ కూలీల సంఘ జనరల్ బాడీ సమావేశము 13-5-39 తేదీని జరిగింది. లేబర్ కమీషనర్‌గారి నిర్ణయములనుగూర్చి సంఘ కార్యదర్శిగారు స్పష్టంగా వివరించారు.

కంపెనీవారు నిర్ణీత కాలముకంటె ½ గంటసేపు కార్మికులచే ఎక్కువపనిచేయించుచున్నారని దానిని ఆపుచేయవలసినదని యజమానులను కోరుతూ ఒక తీర్మానము చేయబడినది. సంఘాన్ని రిజిష్టరు చేయడానికి ఒకతీర్మానంచేయబడింది. పీస్‌వర్కుచేయు రవానాశాఖలోనికార్మికులకు రేట్లు ఎక్కువచేయవలసినదని కోరబడినది. 21 వ తేదీని అఖిల భారత రాజకీయ ఖైదీల దినోత్సవమును జరుపుటకు తీర్మానింపబడింది.

పరిణీత

శరత్-బాబు

విరచితం

★

"చక్రపాణి"

అనువాదం

శేఖరుడు సెలవు తీసుకునేసరికి వెన్నెల వచ్చింది. ఈసమయము లోనే గిరీనుడు పైనుంచి దిగి, బహుశా వాళ్ళ అక్కయ్య ఇంటికికాబోలు, వెళ్ళిపోయాడు.

గురుచరణుని భార్య— "మా అల్లునితో నీకు పరిచయం లేదా శేఖరనాథ్! అంత మంచి కుర్రవాడు ప్రపంచంలో లేడు" అని అన్నది.

అందులో ఏమీ సందేహము లేదనీ, పరిచయం కూడా ఉన్నదనీ చెప్పి శేఖరుడు తొందరగా వరాండాలోకి వచ్చి లలితను చూసి చప్పున ఆగిపోయాడు.

లలిత ఇంతవరకూ తలుపు చాటున నిలబడి ఉన్నది. ఇప్పుడు బయటకు వచ్చి—"అమ్మను తీసుకురావటానికి ఇవ్వాళే పోతున్నారా?" అని అడిగింది.

"అఁ!" అన్నాడు శేఖరుడు.

"అమ్మ చాలా దిగులుపడిందా?"

"అఁ, దాదాపు పిచ్చిదానిలాగా అయిపోయింది."

"మీవంట్లో ఎలా ఉన్నది?"

"బాగానే ఉన్నది!" అని శేఖరుడు ప్రాణాలు తప్పించుకొని గబ గబ బయటపడ్డాడు. రోడ్డుమీదకు వచ్చి, అతను సిగ్గుతోనూ, ఏవగింపు తోనూ ఆపాదమస్తకం కంపించిపోయాడు. లలిత ప్రక్కన నిలబడటం చేత తన దేహం అపవిత్రమైనదని ఎంచసాగాడు. ఇంటికి వచ్చి ఏదోవిధ ముగా పెట్టెను సర్ది మూసివేశాడు. ఇంకా బండికి వేళ ఉన్నదని తెలుసు కొని, ప్రక్కమీద పండుకొని లలితవిషాక్త స్మృతిని కాల్చి భస్మం చేయా లని శపథం చేసి, హృదయంలో ఘృణాదావానలాన్ని ప్రజ్వరిల్ల జేశాడు. ఆదహనయాతనలో శేఖరుడు లలితను అనకూడని మాటలన్నీ అన్నాడు. ఆఖరుకు, కులట అనటానికి కూడా సంకోచించలేదు. ఇంతకు ముందు గురుచరణుని భార్య మాటల సందర్భంలో—ఇది అంత సంతోషంతో చేసిన పెళ్ళి కాదు, చివరిఘడియవరకూ, ఇలా అవుతుందని ఎవరూ అను కోలేదు. లేకపోతే మీ అందరికీ కబురు చేయమని లలిత చెప్పనేచెప్పింది —అని వెళ్ళబెట్టింది. లలిత ఈ స్పర్ధ చూసి శేఖరుని హృదయాగ్ని కొడిగట్టింది.

౧౨

శేఖరుడు తల్లిని తీసుకొని తిరిగి వచ్చాడు. వివాహం ఇంకా పది పన్నెండు రోజులున్నది.

రెండు మూడు రోజులున్న తర్వాత ఒకనాడు శేఖరుడు ఏదో పని ఉండి తల్లిదగ్గరకు వచ్చాడు. లలిత అక్కడ తలవంచుకు కూర్చుని ఏదో పనిచేస్తున్నది. శేఖరుడు తొట్రు పడ్డాడు.

"ఎందుకు వచ్చావురా?" అని తల్లి అడిగింది.

శేఖరుడు ఎందుకువచ్చినదీ మరచిపోయి—"కాదు, ఇప్పుడుకాదు!" అని చకచక బయటకు వెళ్ళిపోయాడు. లలిత ముఖం ఇతనికి కనపడ లేదు. కాని చేతులమీద దృష్టి పడింది. చేతులను గాజులు తప్ప ఇకేమీ లేవు. శేఖరుడు క్రూరంగా నవ్వి 'ఇదో రకం వేషం!' అని అనుకొన్నాడు. గిరీనుడు భాగ్యవంతుడని ఇతనికి తెలుసును. అతని భార్య ఇలా నిరాభర ణగా ఉండటానికి కారణమేమిటో ఇతనికి బోధపడలేదు.

అనాడే, సాయంకాలం ఏదో అవసరపు పనిమీద శేఖరుడు క్రిందకు దిగివస్తున్నాడు. లలిత పైకి ఎక్కివస్తూ ఇతన్నిచూచి ప్రక్కకు వత్తుకొని నిలబడింది. కాని, శేఖరుడు దగ్గరకు రాగానే చాలా సంకోచముతో— "మీతో ఒకమాట చెప్పాలి" అని అన్నది.

శేఖరుడు టక్కున ఆగి—"ఎవరికి! నాకా?" అన్నాడు.

"ఔను, మీకే!" అన్నది లలిత మెల్లగా.

"నాతో నీకేమిమాట!" అని శేఖరుడు గబ గబా క్రిందకు దిగి పోయాడు.

లలిత కొంచంసేపు అక్కడే చేష్టలుడిగినదానివలె నిలబడి, చిన్ని నిట్టూర్పు విడిచి నెమ్మదిగా వెళ్ళిపోయింది.

మర్నాడు ఉదయం, శేఖరుడు వరండాలో కూర్చుని ఆనాటి పత్రిక చదువుతూ ఉండగా గిరీనుడు వచ్చాడు. అతని రాక శేఖరునికి ఆశ్చర్యం కలిగించింది. గిరీన్ నమస్కరించి, దగ్గరలో ఉన్న కుర్చీని లాక్కుని కూర్చున్నాడు. శేఖరుడు ప్రతి నమస్కారంచేసి చేతిలోని పత్రిక ఒక ప్రక్కనపెట్టి గిరీనుని వంక జిజ్ఞాసాదృక్కులతో చూస్తూ ఉండి పోయాడు. ఒకరినొకరు ఇద్దరూ ఎరుగుదురు. కాని ఎప్పుడూ మాట్లాడుకోలేదు. మాట్లాడాలని ఇద్దరిలో ఎవరుకూడా, నేటివరకు కుతూ హలం చూపించలేదు.

గిరీన్ ఎత్తుకోవటమే వ్యవహార విషయం ఎత్తుకున్నాడు.

"ఒక అవసరం ఉండి మిమ్మల్ని ఇబ్బంది పెట్టటానికి వచ్చాను. మా అత్తగారి ఉద్దేశం మీరు వినే ఉన్నారు—ఈ ఇల్లు మీకే అమ్మాలని ఆమె కోరిక. త్వరలో ఏదో ఒక సంగతి తేల్చుకుంటే ఈ మాసంలోనే ముంగేరు వెళ్ళిపోతాము. ఈ సంగతి చెప్పటానికే నన్ను మీ వద్దకు పంపారు."

గిరీన్ను జూడగానే శేఖరుని హృదయంలో తుపాను రేగింది. ఈ మాటలు ఆతనికేమీ బాగా ఉండలేదు.

"మంచి సంగతే. కాని, నాన్న చనిపోయినప్పటినుంచీ అన్నయ్యదే పెత్తనం. వారికే చెప్పటం మంచిది" అన్నాడు అప్రసన్నముఖంతో.

"ఆ సంగతి నాకూ తెలుసును. కాని వారికి మీరు చెప్పటమే మంచిది" అని గిరీనుడు మందహాసం చేశాడు.

"మీరు చెప్పినా చాలును. ఆ తరపున సంరక్షకులు ఇప్పుడు మీరేగా!" అన్నాడు శేఖరుడు పూర్వ ధోరణిలోనే.

"నేను చెప్పవలసిన అవసరం ఉంటే చెప్పుతాను. కాని ఈ పని మీరు తలుచుకుంటే సులువుగా అవుతుందని చెల్లి చెప్పింది.

శేఖరుడు ఇంతసేపటినుంచి జాలీసుకు ఆనుకునే మాట్లాడుతున్నాడు. ఇప్పుడు తిన్నగాలేచి కూర్చుని—"ఎవరూ చెప్పింది?" అని అడిగాడు.

"చెల్లి—లలిత చెప్పింది."

శేఖరుడు విస్మయముతో హతబుద్ధుడయాడు. తర్వాత గిరీన్ చెప్పిన మాటలు ఒక్కటికూడా అతని చెవి దూరలేదు. కొంచెముసేపు విహ్వల దృష్టితో గిరీన్‌వంక చూసి—"క్షమించండి, గిరీన్‌బాబుగారూ! మీరు లలితను వివాహం చేసుకోలేదా?" అని అడిగాడు.

గిరీనుడు నాలుక కొరుక్కొని—"చిత్తం, లేదు.—వారి నందరినీ మీరు ఎరుగుదురు కదా—కాని—" అన్నాడు. ఇంకా పూర్తి చేయలేదు.

"కాని, అలాంటి మాటలు జరగలేదే?"

"నిజమే, అలాంటి మాటలు జరుగలేదు. గురుచరణబాబుకు నేను ఎక్కడా పెళ్ళి చేసుకోనని మాట యిచ్చాను. వారు చనిపోయిన తర్వాత లలిత నాకు సంగతులన్నీ చెప్పింది. ఎవరికీ తెలియకపోయినప్పటికీ ఆమె వివాహం జరిగిందట! భర్త జీవించి ఉన్నాడట. ఈ సంగతులు ఇతరు లెవ్వరూ విశ్వసించేవారు కారు; కాని, నేను మాత్రం విశ్వసించాను. అదీ కాక, స్త్రీలకు ఒకమాటుకంటె ఎక్కువసార్లు వివాహం జరుగదు.—అదే మిటి?"

శేఖరుని కళ్లు అశ్రువులతో నిండినవి. ఇప్పుడు అభాష్పాలే ధారగా కళ్ళవెంట, గిరీనుని ఎదుటనే, బొట బొట కారినవి. కాని ఇతనికి ఈ సంగతే తెలియదు. పురుషుల ఎదుట పురుషుని ఈ దుర్బలత్వము వెల్లడి కావటం లజ్జాకరమని ఇతనికి తోచనుకూడా లేదు.

గిరీనుడు మాట్లాడకుండా చూస్తూ ఉన్నాడు. అతని మనస్సులో ఉన్న సందేహము ఇప్పుడు తీరిపోయింది—లలిత భర్తను కనిపెట్టాడు! శేఖరుడు కళ్ళు తుడుచుకొని—"మీరు లలితను ప్రేమించేవారు కాదూ?" అని అడిగాడు.

గిరీన్ ముఖంమీద ప్రచ్ఛన్న వేదన ఛాయగా గోచరించింది. కాని మరుక్షణానే మందహాసం చేసి—"ఈప్రశ్నకు జవాబివ్వటం అనవసరం! ప్రేమ ఎంతన్నా ఉండనివ్వండి, ఎరిగి ఉండి ఇతర్ల భార్యను ఎవ్వరూ వివాహం చేసికోరు. పోనివ్వండి, పూజ్యులను నేను విమర్శించతలచలేదు" అని లేచి ఇంకోమాటు నవ్వి—"పోతున్నాను. మళ్ళీ కనపడతాను" అని నమస్కరించి వెళ్ళిపోయాడు.

శేఖరుడు గిరీన్ను మొదటినుంచీ ద్వేషిస్తూ వచ్చాడు. ఈ ద్వేషం రాను రాను ఏవగింపులోకి కూడా దిగింది. కాని నేడు అతను వెళ్ళిపో గానే, శేఖరుడు లేచి క్రింద కూర్చుని తల నేలకు ఆనించి, ఆ అపరిచిత బ్రాహ్మయువకుని ఉద్దేశించి అనేకసార్లు నమస్కరించాడు. మానవుడు రెండో కంటికి తెలియకుండా ఎంత స్వార్థత్యాగం చేయగలడో, ఎటువంటి కఠోర వాగ్దానాలనైనా నవ్వుముఖంతో ఎలా చెల్లించగలడో, ఇవ్వాళ, శేఖ రుడు మొట్టమొదట తెలుసుకున్నాడు.

మధ్యాహ్నము భువనేశ్వరి తన గదిలో చాపమీద కూర్చుని లలిత తోడ్పాటుతో కొత్త గుడ్డలు వరుసలు పెడుతూ ఉన్నది. శేఖరుడు గది లోనికి వచ్చి శయ్యమీద కూర్చున్నాడు. ఇవ్వాళ ఇతను లలితను చూసి వ్యాకులపడి పరుగెత్తలేదు.

"ఎందుకు వచ్చావోయ్?" అని ప్రశ్నించింది తల్లి.

శేఖరుడు జవాబివ్వలేదు. కొంచెంసేపు మాట్లాడకుండా గుడ్డల పొత్తులవంక చూసి—"ఏంచేస్తున్నావమ్మా?" అన్నాడు.

కొత్తగుడ్డలు ఎవరెవరికివ్వాలో లెఖ్ఖపెట్టి చూస్తున్నాను. బహుశా, ఇంకా కొనాల్సి ఉంటుందనుకొంటాను— ఏమి తల్లీ?" అని లలితను అడిగింది.

లలిత ఔనన్నట్టు తల ఊపింది.

"నేను పెళ్ళిచేసుకోకపోతేనో అమ్మా?" అని శేఖరుడు నవ్వుతూ అడిగాడు.

భువనేశ్వరికూడా నవ్వుతూ—"ఇదివరకు నీవు చేసినవాటికంటే ఇది ఏమంత గొప్ప పని!" అని అన్నది.

"ఇప్పుడుకూడా అలాంటి పరిస్థితులే వచ్చాయమ్మా!" అని శేఖ రుడు మళ్ళీ నవ్వుతూ అన్నాడు.

"అదేమిటిరా? అలాంటి అపభ్రంశపు మాటలు నోట రానీయకు!" అన్నది తల్లి గంభీరంగా.

"ఇన్నాళ్ళనుంచీ నోట రానివ్వలేదమ్మా! ఇక రానివ్వకపోతే కుద రదు—పాపం చుట్టుకొంటుంది."

భువనేశ్వరికి అర్థం కాక శంకితదృష్టితో చూస్తూ ఊరకున్నది.

"నీ ఈ కుర్రవాని తప్పులు చాలాసార్లు క్షమిస్తూ వచ్చావు. ఈసారి కూడా క్షమించు అమ్మా! నిజంగా, నేను ఈపెళ్ళి చేసుకోను."

కొడుకు మాటలు, ముఖభంగిమా చూసేసరికి భువనేశ్వరికి ఉద్వి గ్నత కలిగింది. కాని ఆ భావాన్ని అణచి—"సరే చేసుకోవద్దులే, పో ఇక్కడనుంచి. నన్ను వేధించబోకు శేఖర్! నాకు బోలెడు పనులున్నవి!" అన్నది చీకాకుతో.

శేఖరుడు నవ్వాలని వ్యర్థప్రయత్నం చేసి, పొడి గొంతుకతో— "కాదమ్మా! నీకు నిజం చెప్తున్నాను. నే నీ పెళ్ళి చేసుకోను" అన్నాడు.

"ఎందుకని? ఇదేం పిల్లల ఆటా?"

"పిల్లల ఆట కాదు కనుకనే చెప్తున్నానమ్మా!"

భువనేశ్వరికి ఈమాటు నిజంగానే భయం కలిగింది.

"ఏం వచ్చింది? నాకు స్పష్టంగాచెప్పు శేఖర్! నాకీ గందరగోళం మాటలేమీ బాగుండలేదు" అన్నది.

"ఇవ్వాళ కాదమ్మా, ఇంకోరోజున విందువుగాని."

"ఇంకోరోజున చెప్పుతావా?" అని భువనేశ్వరి చేతులోని గుడ్డలు అవతల పారవేసి—"అయితే నన్ను ఇవ్వాళే కాశీకి పంపు. ఈ సంసా రంలో నేను ఒక్క క్షణంకూడా ఉండను" అన్నది.

శేఖరుడు తలవంచుకు కూర్చున్నాడు.

భువనేశ్వరి అస్థిర చిత్తంతో—"లలితకూడా వెంట వస్తానంటు న్నది. దాన్నికూడా తీసుకుపోయేటట్టు చూడాలి," అన్నది.

ఈమాటు శేఖరుడు తలఎత్తి నవ్వాడు.

"నువ్వు తీసుకుపోదలచుకుంటే ఇంకా చూసేదేముంటుంది? నీ ఆజ్ఞను అది ఎలా మీరుతుందమ్మా!"

శేఖరుని నవ్వు ముఖంచూసి భువనేశ్వరికి కొంచెం ఆశ కలిగింది. ఒకమాటు లలితవంకచూసి—"విన్నావా తల్లీ, వాడి మాటలు? నేను తలచుకొంటే చాలు, నా ఇష్టం వచ్చినచోటికి నిన్ను తీసుకువెళ్ళగలనని వాడు అనుకొంటున్నాడు—వాళ్ల అత్త అనుమతి తీసుకోవద్దా?" అని అన్నది.

లలిత మాట్లాడలేదు. శేఖరుని ధోరణిచూసి కుంగిపోతూ ఉన్నది.

"ఆమెకు చెప్పదలచుకొంటే చెప్పు, అది నీ ఇష్టం. కాని అసలు నీమాట ప్రకారమే జరుగుతుందమ్మా! ఈ సంగతి నాకూ తెలుసు, నువ్వు తీసుకువెళ్లదలచుకొన్న మనిషికీ తెలుసు. లలిత నీ కోడలు!" అని శేఖ రుడు తలవంచుకు కూర్చున్నాడు.

భువనేశ్వరి విస్మయంతో స్తంభితురాలయింది. తల్లినా కొడుకు ఇలా పరిహసించటం! అతనివంక కోపంగా చూస్తూ—"ఏమన్నావు? లలిత నాకేమవుతుంది?" అని అడిగించి.

శేఖరుడు తల ఎత్తలేకపోయాడు. కాని జవాబిచ్చాడు.

"చెప్పితినిగా అమ్మా! ఇవ్వాళకాదు నాలుగు సంవత్సరాలకు ఎక్కు వైంది. అంతా నేను చెప్పలేను. దానినే అడుగు చెప్పుతుంది." అని తలఎత్తి చూచాడు. లలితచెరగు మెడకు చుట్టుకొని భువనేశ్వరికి నమస్క రించ బోతున్నది. శేఖరుడుకూడా లేచివచ్చి ప్రక్కన నిలబడ్డాడు. ఉభ యులూ ఒక్కమాటుగా తల్లికాళ్లవద్ద కూర్చుని నమస్కరించారు— తర్వాత శేఖరుడు వెళ్లిపోయాడు.

భువనేశ్వరి కళ్ళవెంట ఆనందాశ్రువులు కారసాగినవి. నిజంగా ఆమె లలితను చాలా ప్రేమిస్తున్నది. పెట్టెతెరచి నగలన్నీ బయటకు తీసి ఒక్కటొక్కటిగా అలంకరిస్తూ క్రమంగా సంగతులన్నీ తెలుసు కున్నది. అన్నీవిన్న తర్వాత—"అందుకనేనా గిరీన్ కాని పెళ్లిచేసు కున్నది?" అని అడిగింది.

"ఔనమ్మా, అందుకే. గిరీన్‌బాబులాంటి మనుష్యులు ఈ ప్రపం చంలో ఉన్నారో లేదో నాకు తెలియదు. నేను వారితో, నాకు వివాహమై నది, భర్త నన్ను స్వీకరించనీ స్వీకరించకపోనీ, బ్రతికే ఉన్నాడు; అని చెప్పగానే వారు విశ్వసించారు."

భువనేశ్వరి లలిత తలను స్పృశిస్తూ, "ఉండట మేమిటి తల్లీ! జన్మ జన్మాలూ దీర్ఘ జీవి అయి ఉంటాడని నేను ఆశీర్వదిస్తున్నాను— కొంచెంసేపు కూర్చో తల్లీ, నేను పోయి పెళ్ళికూతురు మారిందని అవినాశునితో చెప్పి వస్తాను!" అని పెద్దకొడుకు గది వైపుకు వెళ్ళి పోయింది.

సమాప్తము.

కాంగ్రెసులో మరొక కొత్త నాయకత్వం నేడు అవసరమా?

ఎం. యన్. రాయి చిట్టగాంగులో కమ్యూనిస్టులమీద, సోషలిస్టులమీద, దండయాత్ర ప్రారంభించాడు. కమ్యూనిస్టులయొక్క, సోషలిస్టులయొక్క, అంతిమపతనం సమీపిస్తున్నదని అతడు ప్రకటించాడు. "విప్లవ పతాకాన్ని వారు క్రిందికి లాగివేశారు. జాతీయైక్యత అనే భ్రమతో వారు అభివృద్ధి నిరోధక శక్తులకు నీచంగా లొంగిపోయారు" అని రాయి తన ఉపన్యాసంలో చెప్పాడు. కమ్యూనిస్టులచే దించివేయబడిన విప్లవ పతాకాన్ని రాయి, అతనికిగల కొద్దిమంది అనుచరులు, యిప్పుడు తిరిగి ప్రతిష్ఠించి అతివాదులందరికీ నాయకత్వం వహించి, కాంగ్రెస్ సంస్థను నేడు నడుపుతూన్న మితవాద నాయకులస్థానే విప్లవ నాయకత్వాన్ని రాయి ఇక స్థాపించవచ్చు! ఎందువల్ల నంటే, కమ్యూనిస్టులు గాంధీవాదంలో విప్లవతత్వం ఉన్నదనీ, పటేల్ ముఠావారి నియంతృత్వ నాయకత్వం సామ్రాజ్య ప్రతికూల పోరాటంలో తప్పనిసరి అనీ త్రిపురీలో వాదించలేదా? కమ్యూనిస్టులు తమ పూర్వకాలపు 'వాదస్తపు అతివాదతత్వాన్ని, విడిచిపెట్టి, విప్లవ నిరోధక శక్తుల దాడికి పూర్తిగా లొంగిపోలేదా? స్వాతంత్ర్య సంపాదనకై కదంతొక్కుతూ నడిచే ప్రజలను గాంధీజీ కుటీరంవైపు నడిపించాలని కమ్యూనిస్టులు నేవురించలేదా? రాయిదృష్టిలో సోషలిజానికి, కమ్యూనిజానికి, ద్రోహం జరిగింది. జాతీయ విప్లవ శక్తులకు ద్రోహం జరిగింది. ఒక్క యం. యన్. రాయి మాత్రం అతివాద శక్తుల నాయకుడుగా మిగిలాడు! మిగిలిన వారందరూ పారిపోయారు!!

రాయిచేసిన యీ ఆరోపణలలోని వంకరటింకరలు, అతిశయోక్తులు, తీసివేస్తే త్రిపురీలో కమ్యూనిస్టులు అవలంబించిన విధానం యొక్క అర్థం ఏమిటి? నేడు కాంగ్రెసులో ఐక్యనాయకత్వంకొరకు వారు నిలబడ్డారు. అందుకై చివరవరకూ కృషిచేశారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదం మీద భారతీయులందరూ తక్షణమే దాడిసల్పాలని కమ్యూనిస్టులు కోరారు. వర్కింగు కమి



ఎం. ఎన్. రాయ్

టీని స్వాధీన పరచుకోవడానికి వారు నిరాకరించారు పంతు తీర్మానాన్ని ఒక అవకాశంగా తీసుకొని గాంధీవాదంమీద, గాంధీ నాయకత్వం మీద, దండయాత్ర సాగించడానికి వారు ఒప్పుకోలేదు. రాబోయే పోరాటానికి అత్యవసరమైనట్టియు, ప్రధానమైనట్టియు, సమస్య ఐక్యత. దానిని ఏవిధంగానైనా వెనుక్కు నెట్టడానికి వేసిన యెత్తే పంతు తీర్మానం. ఈ విషయాన్ని కమ్యూనిస్టులు చక్కగా గుర్తించారు. కనుకనే కమ్యూనిస్టులు ఆ తీర్మానాన్ని పోరాట విచ్ఛిన్న స్వభావంకలిగిన దానినిగా చూచి, దానిని వ్యతిరేకించారు. మితవాదులు దొడ్డిదోవగుండా ప్రవేశించి తమ పెత్తనాన్ని స్థాపించుకొనడానికి మాత్రమే ఆతీర్మానం ప్రతిపాదించబడినదని కమ్యూనిస్టులు స్పష్టంగా తెలియజేశారు.

మేము నేరస్థులమే!

కాబట్టి ఈ ఆరోపణలన్నింటికీ మేము నేరస్థులమే! మేము యీవిధానాన్ని బుద్ధిపూర్వకంగానే అవలంబించాము. త్రిపురీ కాంగ్రెసుకు ముందు, తరువాత కూడా అనేక వ్యాసాలద్వారా యీ విధానాన్ని మేము స్పష్టీకరించి, సమర్థించుకొన్నాం. మేము త్రిపురీలో అవలంబించిన విధానం లొంగిపోవడం ఎన్నటికీ కాదు. అభివృద్ధికీ సామ్రాజ్య వ్యతిరేక శక్తుల ఐక్యతకూ, ఆ పరిస్థితులలో అంతకంటె మరొకమార్గం ఏదీ లేదు. కమ్యూనిస్టులు-సోషలిస్టులు కలసి యీ విధానాన్ని ఆచరణలో పెట్టగలిగి యున్నట్లయితే; మితవాద పంథానుగాని (కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ అవలంబించిన తటస్థ మార్గం) అతివాద పంథానుగాని (కొందరు కమ్యూనిస్టులు

మితవాద నాయకత్వం పోవాలని రాయి అంటాడు

చూపిన వైఖరి) పోకుండా సరియైన విధానాన్ని ఆచరణలో పెట్టగలిగి నట్లయితే: ప్రెసిడెంటు బోసు యీ సమస్యకు వ్యక్తిగతంగా కంటె రాజకీయంగా ఎక్కువ ప్రాధాన్యత నిచ్చియున్నట్టయితే: కామ్రేడ్ రాయి ఎన్ని తీవ్రవాద పలుకులు పలుకుతూన్నప్పటికీ మితవాదనాయకులకు జయం రాకుండా చేయగలిగేవాళ్ళం. కనుక యీ వ్యాసంలో రాయి సూచించిన పంథాను విమర్శన పూర్వకంగా పరిశీలిస్తూ ఏ విధంగా అది జాతీయ పోరాటాన్ని భగ్నంగావించేదిగా ఉందో నిరూపిస్తాను.

ప్రతిద్వంద్వ నాయకత్వం

త్రిపురీ కాంగ్రెస్‌లో ఏర్పడిన సమస్యలపై మనకూ, కామ్రేడ్ రాయికీ, మధ్య భేదాభిప్రాయాలకు ప్రారంభం. అధ్యక్షుని ఎన్నికలో సంపాదించిన విజయాన్ని అర్థం చేసుకోవడంలో వచ్చింది. ఆయెన్నిక ఫలితముగా వెంటనే మనం మొండిగా ప్రవర్తిస్తూన్న నియంతృత్వ నాయకులపై తిరుగుబాటు జండాను ప్రతిష్ఠించ వలసినదేనా? తక్షణం కాంగ్రెసు సంస్థను వీరి పెత్తనంనుండి తప్పించడానికి అతివాదులందరూ బ్రహ్మాండమైన ఒక పోరాటానికి దిగవలసినదేనా? లేక, సుభాస్ బోసు విజయానికి అర్థం, కాంగ్రెసు సాధారణ సభ్యులు నేటి నియంతృత్వ నాయకుల వైఖరి యెడల ప్రకటించిన ప్రతికూలభావం మాత్రమేనా? ఆ నాయకుల్ని సాంతంగా తొలగించవలసిన అవసరం సాధారణ సభ్యులు గుర్తించి ఆవిధంగా వోటుచేశారా? రాయిదృష్టిలో అధ్యక్షుని ఎన్నిక ఒక నూతన దశను తీసుకువచ్చింది. అతడు స్థాపించిన కాంగ్రెస్ అతివాదుల సమితి (రాడికల్ కాంగ్రెస్‌మెన్స్ లీగ్) యొక్క ప్రణాళికలో యీక్రింది విధంగాఉంది: "కాంగ్రెసులో నేడు ప్రతిద్వంద్వ నాయకత్వం స్థాపించడానికి, చైతన్యం కలిగి చివరవరకూ పోరాడే విప్లవకారులందరూ ముందడుగు వేయవలసిన తరుణం వచ్చింది."

దీన్ని మనం ఎందుకు నిరాకరించాం?

ఈ నినాదం జాతీయ పోరాటాన్ని భగ్నంగావించే స్వభావాన్ని కలిగియున్నదని మనం మొదటినుంచీ దాన్ని నిరాకరిస్తూవచ్చాం. ఎందువల్ల? నేటి నాయకత్వం చూపుతూన్న నిరంకుశ వైఖరియెడల నానాటికీ ఎక్కువౌతూన్న అసంతృప్తిని మనం గుర్తించలేదా? నూతన రాజ్యాంగ చట్టాన్ని ప్రతిఘటించడంలోను, ముఖ్యంగా ఫెడరేషన్ ప్రతికూల పోరాటాన్ని నడిపించడంలోను, వర్కింగ్‌కమిటీ అవలంబిస్తూన్న 'డ్రిఫ్టు' విధానాన్ని (ఆపద వచ్చిన తరువాత ఆలోచిద్దాంలే! అనే తత్వం) అకస్మాత్తుగా మనం మరచిపోయామా? గాంధీవాదములో మనకు అకస్మాత్తుగా విప్లవతత్వం కనపడిందా? నిజం చెప్పవలసివస్తే, ఇట్టివి యేవీ జరగలేదు. రాయిచే యివ్వబడిన ప్రతిద్వంద్వ నాయకత్వ నినాదాన్ని మనం అంగీకరించి యున్నట్లయితే, గత మూడు సంవత్సరాలనుంచీ దేశంలోని అతివాద శక్తులన్నీ అవలంబిస్తూన్న 'జాతీయైక్య సంఘటన'ను ఒక్కసారి నిరాకరించడం జరిగేది. కాబట్టి, రాయి యిచ్చేనినాదం సరియైనదా, కాదా అనే ప్రశ్నకు జవాబు చెప్పాలంటే, మొట్టమొదట మనం అతి ప్రధానమైన సూత్రాన్ని పరిశీలించవలసి యుంటుంది. బోసు ఎన్నికలో ముగిసిన గత 18 మాసాలలోని ఘటనలవల్ల మన జాతీయోద్యమంయొక్క వర్గసంబంధాలు పూర్తిగా మారిపోయి, "జాతీయైక్య సంఘటన" అర్థరహితమని మనం భావించుకొనవలసి యుంటుందా? ఇదే మనం పరిశీలించవలసిన ప్రధాన సమస్య.

మళ్ళీ త్రిపురీ

కాని, ప్రధాన సమస్యల్ని పరిశీలించేముందు అధ్యక్ష ఎన్నికయొక్క ప్రాధాన్యత ఎందుకో ఉందో చూదాం. డెలిగేట్లు పోరాటానికే తమ వోట్లు యిచ్చారు. ఫెడరేషన్ విషయంలోను, పౌరసత్వపు హక్కులు విశాలవంతంగా చేయడానికి కాంగ్రెస్ మంత్రులు అవలంబించే అసంతృప్తికరమైన వైఖరి యెడలను, ఎన్నికల ప్రణాళికను వారు ఆచరణలో పెట్టడంలోను, సంస్థానాల విషయంలో చూపబడే మిత్రభావం విషయంలోను నేడు అవలంబించబడుతూన్న 'డ్రిఫ్టు' విధానానికి వ్యతిరేకంగా వోటు చేశారు డెలిగేట్లు. అంతేగాని, ఇప్పటి నాయకత్వాన్ని తొలగించడానికి వోటు చేయలేదు.

నాయకు లవలంబించే విధానం యెడల అసంతృప్తి లేకపోలేదు. కాని, ప్రజలనుండి నాయకులు దూరం చేయబడలేదు. నేడు మనం యీ దశలో లేము కాబట్టి, ప్రస్తుత నాయకత్వాన్ని తొలగించి క్రొత్త నాయకత్వం స్థాపించాలి అనడంలో అర్థంలేదు. ఈ విషయం మితవాద నాయకులకు పూర్తిగా తెలుసు. అందువల్లనే వారు ఒకే స్వభావం గలిగిన వర్కింగుకమిటీ(హోమొజీనియస్ క్యాబినెట్) కావాలి. అనే నినాదాన్ని లేవదీశారు సుభాష్ బోసు విజయం తన పరాజయమేనని గాంధీజీ పలికినప్పుడు; బోసు యిష్టప్రకారం అతివాదులతో కూడిన వర్కింగు కమిటీనే నియమించవలసినదని గాంధీజీ చెప్పినప్పుడు; పోరాట సమస్యకంటె నాయకత్వపు సమస్యకే అతడు ఎక్కువ ప్రాధాన్యత యిచ్చాడు. సుభాష్‌బోసుకు వోటుచేసిన డెలిగేట్లు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ, ఏ నాయకత్వం ఉండాలి అనే ప్రశ్న వచ్చినప్పుడు వారు పడిపోక తప్పదని గాంధీజీకి చక్కగా తెలుసు. పోరాటం మొదలయినరాజకీయసమస్యలపై వోటుచేయవలసివస్తే యీడెలిగేట్లుఅధిక సంఖ్యలోనే ఉంటారు. ఆ విధంగా వారునాయకత్వాన్ని ముందుకునడిచేలాగు ఒత్తిడి తేగలిగి యుండేవారు. కొత్త భావాలను నాయకులు అంగీకరించేటట్లు చేయగలిగి యుండేవారు గాంధీజీ ఇచ్చిన స్టేటుమెంటు, వర్కింగ్ కమిటీ మెంబర్ల రాజీనామాలు, పంతు తీర్మానము—యీ మూడింటిలోను ఒకే భావము కనపడుతుంది. ఇప్పటి నాయకత్వం యెడల అధిక సంఖ్యాక డెలిగేట్లకు ఉన్న విశ్వాసాన్ని ఆధారంగా చేసుకొని, ప్రధాన రాజకీయ సమస్యలను కప్పిపుచ్చడానికీ, ఆ అధిక సంఖ్యాకులలో రాజకీయంగా ఉన్న ఐక్యతను చీల్చడానికీ, వేసిన యెత్తు ఇది అధ్యక్షుని ఎన్నిక ద్వారా గజగజలాడిన నాయకత్వం తిరిగి తమ ఆధిక్యతను స్థాపించుకొనడానికి అవలంబించిన విధానంయిది. కాని, రాయిస్టులు చేబట్టిన పద్ధతులవల్ల కూడా ఫలితమిదే. సోషలిస్టులు, కమ్యూనిస్టులు, రాయిస్టులు కలిసి కొత్త (అతివాదుల) నాయకత్వంకొరకు వోటుచేసియున్నట్లయితే, మితవాదులకు ఇంకా ఎక్కువ సంపూర్ణ విజయం లభించేది. అతివాదుల్ని వారు దూరంగా ఉంచేసి యుండేవారు. అంతే కాకుండా నేటి నాయకత్వాన్ని తొలగించాలి అనే నినాదాన్ని యివ్వడంతోబాటు ప్రజాసామాన్యంలో దాన్ని అర్థం చేసుకొనేటంత రాజకీయ చైతన్యంకూడా ఉండియుండాలి. కాని అది లేదు. కనుకనే, మితవాద నాయకులు స్వాతంత్ర్య పోరాటంఅనే రాజకీయ సమస్యను పూర్తిగా విడిచిపెట్టి, "పాత నాయకత్వమా, కొత్త నాయకత్వమా" అనే విషయంమీద పోరాటానికి దిగారు.


స్వరాజ్య పోరాటంలో దేశీయ పెట్టుబడిదార్ల పాత్ర

ప్రతి ద్వంద్వ నాయకత్వ సిద్ధాంతాన్ని అంగీకరించడం అంటే అర్థం, 'జాతీయైక్యసంఘటన' విధానాన్ని విడిచిపెట్టడమే అన్నమాట. నేటి నాయకత్వాన్ని (గాంధీజీ నాయకత్వం) తొలగించాలని కోరితే, దాని అర్థం ఐక్య సంఘటనలో పాల్గొంటూన్న ఒక వర్గాన్ని అంతటినీ బయటికివెళ్ళగొట్టడం అన్నమాట. ఈ వర్గమే దేశీయపెట్టుబడిదార్లు. వారి అనుభ

యులు, ఈ వర్గం నేడు విదేశీ ప్రభుత్వానికెదురుగా నిలబడి, సంపూర్ణ స్వాతంత్ర్యాన్నీ, ప్రజా ప్రభుత్వాన్నీ, కోరే సామ్రాజ్య వ్యతిరేక శక్తులలో ఒకటి. వీటి సఫలతకై ప్రజాపోరాట కార్యక్రమానికి కూడా కట్టుబడి ఉంది. ఒకవైపు వీరి హక్కులు సామ్రాజ్యవాదుల హక్కులతో ఢీకొంటూంటే, మరొకవైపున రైతులు-కూలీలు-గుమాస్తాలు యిత్యాది ప్రజాసామాన్యం యొక్క హక్కులతో కూడా ఢీకొంటున్నాయి. ఇందువల్లనే దేశీయ పెట్టుబడిదార్లు మన స్వరాజ్య పోరాటంలో ఇటూ-అటూ ఊగులాడుతూ ఉంటారు. కాని, సామ్రాజ్యవాదం యింకా నిర్మూలించబడలేదు. పెట్టుబడిదార్లు, వ్యాపారస్థులు, యితర భారతీయుల మాదిరిగానే అణచివేయబడుతూన్న వర్గం. ఈ వర్గంలో జాతీయాభిమానం గలవారు కాంగ్రెసును బలపరిచారు. అయితే, వారు సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించేటందుకు విప్లవ కార్యక్రమాన్ని యిచ్చి పోరాటానికి నాయకత్వం వహిస్తారని మనం అనడం లేదు. కాని, వారు విప్లవ నిరోధక శక్తులలో చేరిపోలేదు. సామ్రాజ్యవాదుల అండను చేరి వారితో లాభాలు పంచుకొనే స్థితికి రాలేదు.

నూతన దశ.

గత 4 సంవత్సరాలనుండీ—అనగా 1934 వ సంవత్సరం తరువాత—ఇండియాలోను, ప్రపంచములోను, ఒక నూతన దశ పరిపక్వం అవుతోంది. మన కార్మిక - కర్షకులలో నూతన చైతన్యం బయల్దేరింది. కార్మిక-కర్షక పోరాటాలు వృద్ధిచెందుతున్నాయి. కాంగ్రెసు సాధారణ సభ్యులలో అతివాద తత్వం వ్యాపిస్తోంది. కాంగ్రెసులో ఒక సోషలిస్టు శాఖకూడా స్థాపించబడింది. కార్మికోద్యమంలో ఐక్యత యేర్పడి, దినదినాభివృద్ధి చెందుతోంది, కార్మికులు అంతకంతకు రాజకీయాలలో పాల్గొంటున్నారు. దేశం అంతటా వెల్లివిరుస్తూన్న కర్షకోద్యమాన్ని సంఘటన పరచడానికి అఖిల భారత రైతు సంఘంకూడా స్థాపించబడింది. సంస్థాన ప్రజలు బాధ్యతాయుత ప్రభుత్వం కొరకు అనేకచోట్ల పోరాటాలు ప్రారంభించారు. ఇండియాయొక్క నేటి నూతన దశలో యివి ప్రధానాంశాలు. 1929 లో ప్రారంభమైన ప్రపంచ ఆర్థికక్షోభ ఫలితంగా అంతర్జాతీయ



కామ్రేడ్ జి. అధికారి (వ్యాసకర్త)

సంయుక్త నాయకత్వం కావాలని కమ్యూనిస్టులంటారు

పరిస్థితులు క్రమక్రమంగా విషమావస్థకు వచ్చాయి. ఆర్థికక్షోభకు వెన్వెంటనే ధరల మాంద్యం, తరువాత స్వల్పమాత్రం ధరల పెరుగుదల, తిరిగి మరొక ప్రపంచ ఆర్థిక క్షోభ, సంభవించాయి. ఈ ఆర్థిక క్షోభయొక్క రాజకీయ స్వరూపమే ఫేసిజం. ఫేసిస్టురాజ్యాల విదేశాక్రమణవల్ల పూర్వపు సామ్రాజ్యవాద ప్రభుత్వాల బలాబలాలు తారుమారయ్యాయి. దానితో రెండవ సామ్రాజ్యవాద యుద్ధంకూడా దగ్గరకు వచ్చింది. తత్ఫలితముగా బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వలసరాజ్యాలమీద, ముఖ్యముగా భారతదేశ ప్రజలందరిమీద, పూర్వం కంటె తీవ్రతరమైన నిర్బంధవిధానం అవలంబించవలసి వస్తోంది. ఈ నూతన దశలో బ్రిటిష్ పెట్టుబడిదారీ వర్గానికీ, భారతీయ పెట్టుబడిదార్లకూ, మధ్యగల వైరం ఎక్కువౌతోంది. కాబట్టి దేశీయ పెట్టుబడిదార్లు బ్రిటిష్ పెట్టుబడిదార్ల అండనుచేరి లాభాలు పంచుకోవడము సాధ్యమేకాదు. పైపెచ్చు ఇండియాలో శాంతి వాతావరణాన్ని అభిలషిస్తారు సామ్రాజ్యవాదులు. త్వరలో రాబోయే ప్రపంచ సంగ్రామములో గ్రేట్ బ్రిటన్ జయం పొందడానికి యిది చాలా అవసరం. ఈ పరిస్థితులన్నింటిని బట్టీ, సామ్రాజ్యవాదాన్ని ఢీకొనడానికి; నూతన రాజ్యాంగ చట్టాన్ని ఎదుర్కొనడానికీ; సామ్రాజ్యవాద ప్రభుత్వంతో అంతిమ పోరాటం సల్పడానికి—"జాతీయైక్య సంఘటన" చక్కగా సాధ్యం అవుతుందని తెలుసుకోవచ్చు.

నాయకత్వం తప్పక ముందుకు పోగలదు

ఈ పరిశీలన యొక్క అర్థం, దేశీయ పెట్టుబడిదారీ వర్గం విప్లవ పంథాను చేబట్టిందనా? కానేకాదు. ఇటూ, అటూ, ఊగులాడే నీచస్థితి, త్వరగా లొంగిపోయే దుర్బలావస్థ, తన స్వలాభాలకొరకు ప్రజలందరి యొక్క హక్కుల్నీ, దేశస్వాతంత్ర్యాన్నీ, ప్రజాయుక్త ప్రభుత్వాన్నీ, అన్నింటినీ భగ్నం చేయడానికి సంశయించని స్వభావం,—యివి నేడు మన దేశీయ పెట్టుబడిదారీ వర్గాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయాయా? లేదు, లేదు, ఇప్పటికి అవన్నీ ఉన్నాయి. కాని, ఈ ఊగులాడే స్వభావాన్ని ఊగులాడకుండా కట్టివేయడం తప్పక సాధ్యమైనపని. నాయకత్వాన్ని పోరాటంవైపుకు ముందుకు తోయడం మన చేతుల్లో ఉన్నపని. కాంగ్రెస్ మంత్రుల పరిపాలనలో చట్ట సమ్మత పద్ధతులకే ఎక్కువ ప్రాధాన్యత యివ్వబడుతూన్న మాట వాస్తవమే. సంస్థాన ప్రజల పోరాట సందర్భములో మన నాయకు లవలంబిస్తూన్న రాజీ పంథా ఒడంబడికలకు దారితీస్తుందనడం కూడా యదార్థ విషయమే. కాని, యీ చట్టసమ్మత పద్ధతులతోబాటు దేశములో రైతు పోరాటాలు, కార్మిక పోరాటాలు, ఏ విధంగా వ్యాపించిపోతున్నాయో మనము గుర్తించాలి. అదే విధంగా సంస్థాన ప్రజలు పురాతన నిరంకుశ పరిపాలనా పద్ధతుల్ని రూపు మాపడానికి ఏ విధంగా పోరాటాలు సాగిస్తున్నారో గమనించాలి. అంతకంతకు ముందుకు నడుద్దాం అనీ, పోరాటానికి దిగుదాం అనీ, నానాటికీ ప్రజలు వాంఛిస్తున్నారు. యీ కోరికే త్రిపురీ కాంగ్రెసులో ప్యాసైన "జాతీయ వాంఛ" తీర్మానంలో ప్రతిబింబించబడియుంది. నాయకుల రాజీ ధృక్పథాన్ని డెలిగేట్లు వ్యతిరేకించారు. సంస్థానాలలోను, బ్రిటిషు ఇండియాలోను, కార్మిక-కర్షకుల దైనందిన పోరాటాలు ఎంత యెక్కువగా వృద్ధి పొందుతాయో, యీ పోరాటాలతో కాంగ్రెసు కమిటీలు ఎంత ఎక్కువ సంబంధాన్ని పెట్టుకుంటాయో, కార్మిక వర్గం రాజకీయాలలో ఎంత ఎక్కువ తీవ్రంగా పాల్గొంటుందో, అంత యెక్కువగా జాతీయైక్య సంఘటన యందలి సంయుక్త నాయకత్వం దేశానికి విప్లవ కార్యక్రమం యిచ్చి, స్వాతంత్ర్య పోరాటాన్ని నడిపిస్తుంది.

అర్థంలేని చిలుక భాష

'జాతీయైక్య సంఘటన' యందలి రాజీలకు ప్రాకులాడేవారు సహితం నేడు ఐక్యతను కాపాడాలని కోరుతున్నారు. ఎందువల్లనంటే, కాంగ్రెసుయొక్క, జాతీయోద్యమంయొక్క, ఐక్యత భగ్నం అయితే, సామ్రాజ్యవాదుల మీద ఒత్తిడి తేవడం సాధ్యంకాదు కాబట్టి, కార్మిక వర్గం, అతివాదశక్తులు, పోరాటం సాగించడానికి ఐక్యతను కాపాడటం సాధ్యమయి తీరుతుంది. ఏ విధంగా? ఎప్పుడూ తామే ముందడుగు వేస్తూ ఉండడంవల్ల, కార్మిక-కర్షకుల నిత్య పోరాటాలను యింకా విశాలవంతం చేయడం ద్వారా, కాంగ్రెస్‌కమిటీలే ప్రజాపోరాట సాధనాలుగా తయారయేటట్లు కృషి చేయడంద్వారా. "అందర్నీ కలుపుకురావడానికి జాతీయైక్యతట" అని రాయి గేలిచేశాడు అతడు "విప్లవ శక్తులన్నీ ఏకం కావాలి" అంటాడు. ఇందుకు మొట్టమొదట ప్రస్తుత కాంగ్రెసు నాయకత్వాన్ని కూలద్రోయాలంటాడు. దాన్ని ఏ విధంగా సాధిస్తాడు? గాంధీవాదాన్ని ఎడతెగక విమర్శించడం ద్వారా జాతీయపోరాటాన్ని అభివృద్ధిపరచేందుకు ప్రత్యేక కార్మిక-కర్షక సంఘాలు అవసరం లేదంటాడు. రైతు సంఘాలు అతని దృష్టిలో పనికిమాలిన సంస్థలు. కార్మికవర్గం, ఆ వర్గాన్ని నడిపే పార్టీ అవసరమే లేదంటాడు. "మిక్కిలి అనుభవశాలి అయిన మార్క్సిస్టు" నని చెప్పుకుంటూ, యీ కార్యక్రమం అంతా "అర్థంలేని చిలుకభాష" అంటాడు మనం అస్పష్టమైన కార్యక్రమాలను వేస్తాం అని రాయివాదన అయితే ఆయన వేసే స్పష్టమైన కార్యక్రమం యేమిటో చూదాం. మొట్టమొదట "అభివృద్ధి నిరోధకమైన నేటి నాయకత్వాన్ని" ఊడగొట్టాలి. ఏవిధంగా? ఏమో, అప్పుడు కొత్త నాయకత్వం ప్రత్యక్షమై, కాంగ్రెసును విప్లవ కార్యక్రమంతో కూడుకొని యున్న ఒక ప్రజాపార్టీగా పునర్నిర్మాణం చేస్తుంది. అప్పుడు, అధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికి, విప్లవ పోరాటానికి, అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఆ తర్వాత పోరాట సంస్థనుండి పరిపాలనా సంస్థగా కాంగ్రెసు మార్పు చెందుతుంది! (ఇంకా ఉంది.)

పల్నాడు రైతుల కడగండ్లు

రశీదులడిగినందుకు జరిమానాలు!

శ్రీ పోరెడ్డి బుచ్చిరెడ్డి వగైరా 40 మంది శంకరాపురం గ్రామస్థులు తమకు జరుగుతూన్న అన్యాయాలను గురించి యీక్రింది విజ్ఞప్తిని కాంగ్రెసు ప్రభుత్వానికీ, కాంగ్రెసు కమిటీలకు, పంపుకొన్నారు.

శంకరాపురం గుంటూరు జిల్లా పల్నాడు తాలూకాలోని గ్రామం. యిందు గాదెవారి పల్లె భట్టువారి పల్లె, యినపరాజుపల్లె కాచవరం అని నాలుగు నివాసగ్రామములు యున్నవి. యీ నాల్గు గ్రామములకు ఒక కరణమున్నూ, యిద్దరు మునసబులున్నూ ఉన్నారు. యీ నాలుగు నివాస్లు కలిసి జనాభా 2,381. రు 9300-0-0 శిస్తు. 1920 సంవత్సరపు నాన్‌కో ఆపరేషన్ పన్నుల తిరస్కారణనుండి జనవరిలో జనవరి, ఫిబ్రవరి రెండు నెలల కిస్తీలు వసూలు చేస్తూ వచ్చారు. అన్నిగ్రామాలలో మూడు దఫాలవారి కిస్తీలు వసూలు చేస్తూ వుంటే, మా గ్రామాలలో రెండుమూర్లే (జనవరి, మార్చి) వసూలుచేయుటము రైతులకు భారముగా వున్నది. యిది యిట్లుండగ యీ సంవత్సరము పంటలు లేకను. యేదైనా కొద్దిగా పండితే ఎలుకలు నరికివేయుటము వల్లను, ఋణపరిష్కార చట్టమువల్ల షాహుకార్ల వొత్తిడివల్లను, జనవరికిస్తీ అంటే రెండు నెలల కిస్తీ నకసారి చెల్లించడము మరీభారము అయినది. అందుచేత యీ సంవత్సరము కిస్తీలు మూడు దఫాలుగా వసూలు చేయవలని నదిగా గ్రామ వుద్యోగస్తులను కోరితిమి.

ప్రభుత్వమువారు యీ సంవత్సరము పోర్టు సెంటు జార్జి గజెట్‌లోను, జిల్లా గజెట్‌లోను ప్రకటించిన ప్రకారం. మేము యిచ్చు పన్నులకు పట్టా నెంబరువారీగా రసీదులు యివ్వవలనిన దని మా గ్రామ అధికారులను మాలో శ్రీ అకుల మట్టయ్యగారు అడిగిరి. అందుపై అట్లా కావలసినవారు యెవరో అంతా వొస్తే చెప్పుతాను యిప్పుడు తొందర యేమిలే అని జనవరి 9 వ తేదీన అనిరి. అందుపై ది 10-1-39 తేదీన దాదాపు నలుబది మంది రైతులము పై అధికార్లందరు యున్నచోటికి వెళ్ళి మూడు కిస్తీలు మూడు దఫాలుగా వసూలుచేయవలని నడిగను. వసూలు చేసిన మొత్తములకు పట్టా నెంబర్లవారిగా భుక్తముగా రసీదులు యివ్వవల సినదిగాను కోరితిమి. వారు, జనవరి ఫిబ్రవరి కిస్తీలురెండు జనవరిలోనే చెల్లించవలె ననిన్ని, యిచ్చిన డబ్బుకు రసీదు అంటే యిన్ని రూపాయిలు ముట్టినవి అని రశీదు యిస్తామేగాని, యే పట్టాక్రింద అనుభవము దాని క్రింద జమవ్రాసి యివ్వవలసిన ప్రసక్తియే తమకు లేదనిన్ని అనిరి. గ్రామములో జాయింటు పట్టాలు వివరముగా మావద్ద లెక్కలు ఉన్నవి. ఆప్రకారంగా యిస్తాము అంటిమి. లేదా వారి వద్ద నున్న వివరముల ప్రకారం వ్రాసితే యిస్తాము అంటిమి. అందుకు వారు కాదనిరి. అటు తర్వాత మేము చేయునదిలేక ది 12-1-39 తేదీన గురజాల శ్రీ తహశీలు దారువద్దకు వెళ్ళి మూడు కిస్తీలు మూడు దఫాలుగా వసూలు చేయవలశినదిగను, రశీదులు పట్టా నెంబర్లువారిగా యిప్పించవలసినదిగా కోరితిమి, మహజర్లమూలముగా కూడ కోరితిమి. పట్టా నెంబరువారీగా రశీదులు యిస్తే వయికం అప్పుడే గురజాలలోనే చెల్లించుతామని వయికమును కూడా చూపితిమి. అంతట శ్రీ తహశీల్‌దారుగారగు ధర్మరాజయ్యగారు శ్రీ రివిన్యూ యినస్పెక్టరుగారిని పంపి వసూలు చేయిస్తాననియు, మూడు దఫాలుగా కిస్తీలు వసూలు చేయిస్తాననియు, యిచ్చిన వయికము నకు పట్టాలవారిగా రశీదులు యిప్పిస్తామనియు. చెప్పిరి. ఆ ప్రకారమే 16-1-39 తేదీన కారంపూడి ఫిర్కా రివిన్యూ యినస్పెక్టరుగారు వచ్చిరి. ఆనాడు ఇతరపనులు చూచుకొని 17, 18 తేదీలలో మేము కోరినట్లు వీలు అయినంత వరకు యిప్పించిరి. ఆ రెండు రోజులతోనే చాలవరకు వసూలు అయెను. ఆ ప్రకారమే ఫిబ్రవరికోకూడా జరిగిపోవునని ఆశించితిమి. అందుచేత ప్రత్యేకముగ అధికార్లవద్దకు పోవడముగాని మహజర్లు పంపుకోవడముగాని జరపమైతిమి. అధికార్లు వస్తారనిన్ని. తేడాలు వుంటే ఆఖరు కిస్తీలో సరిచేసుకోవచ్చుననిన్ని. త్వరలో జమాబంది జరుగనున్నది కావున జమాబంది ఆఫీసరుకు తెల్పుకోవొచ్చుననిన్ని, ఆ కిస్తీ వసూలు యిచ్చివేసితిమి.

మార్చినెలలో జమాబంది. గుంటూరు రివిన్యూ డివిజనల్ ఆఫీసరు శ్రీ గజపతిరావుగారు జమాబంది ఆఫీసరు. మా గ్రామం జమాబంది 8 తేది అయినందున ఆరోజు సుమారు 30 మంది రైతులమువెళ్ళి యింతవరకు జరిగిన సమాచారాలు చెప్పినాము జనవరిలో అధికారులువొచ్చి చెల్లించమనిన ప్రకారం చెల్లించినామని ఫిబ్రవరి మార్చి కిస్తీలో సరిచేసుకోవొచ్చునని చెల్లించినాము. కావున యీ కిస్తీలో పట్టానెంబరు, ఆ నెంబరుకింద భుక్తము, వివరముగా వేసియిస్తే చెల్లించుతామని మహజరు మూలముగా మనవి చేసుకుంటిమి. అందుపై వారువారలను మందలించి,తాహసీలుదార్లవారితో రైతులకు క్రమంగా రశీదు లిచ్చి పన్ను వసూలు చేయవలసినదిగా వుత్తరవులు యిచ్చినట్టు మా సముద్దారుగారి ద్వారా మాకు జమాబంది కాలంలో తెలియచేసిరి. యింకా కొన్ని సంగతులు చెప్పుకోబోగా తహశీలుదారుగారు అడ్డమువచ్చి మీరు కోరిన ప్రకారం ఆర్డరు వేసినారు. తానే వస్తాననిన్ని అమలు జరుపుతామని హామీయిచ్చిరి. అందుపై మేము ఇండ్లకు చేరితిమి. ఆ తర్వాత శ్రీ తహశీలుదారుగారు 11 వ తేది రాత్రి 8 గంటలకు మా గ్రామం వచ్చిరి. వచ్చి మాలో శ్రీ అకుల మట్టయ్యగారిని పిలిపించిరి. తీవ్రంగా, తిరస్కారముగా హేయంగా, అనరాని మాటలు ఆడిరి. అంతకు ముందు జమాబంది ఆఫీసరుగారి యెదుట మాట్లాడిన ధోరణికి, హామీకి, యీ ధోరణికి తేడాచూస్తే కారణం బోధపడలేదు. యింత మార్పుకు కారణం గ్రహించలేక పోతిమి. పట్టా నెంబరువారి రసీదులు యిస్తే అంతా పన్నులు చెల్లించడమునకు సంసిద్ధులుగావున్నామని చెప్పితిమి. మేమంతా వారి దగ్గరకు వెళ్ళితిమి. సంగతి సందర్భాలు స్వయముగా విన్నవించితిమి.

మరుదినం 12 వ తేది వుదయం అనరాని మాటలు అంటూ సమ్ముల అందరిని పిలిపించిరి. మాలో పోరెడ్డి బుచ్చిరెడ్డిగారు తాను చెల్లించవలసిన మిగత రు 88-14-0 యిచ్చి, తనకు భుక్తప్రకారం నెంబరు వారీగా రశీదు యివ్వమనెను. కాని భుక్తప్రకారం లెక్క చెప్పటానికి కరణం తిరస్కరించెను. కరణం అంటే వుద్యోగం చేస్తువున్న అక్టింగు కరణం కాక శలవులోవున్న పాతకరణం. దానికి తహశీలుదారుగారు కరణంగారిని మందలించ వలసిన దానికి బదులుగా, కరణం చెల్లించమన్నంత చెల్లించి రశీదు తీసుకొని తర్వాత వ్యవహారం జరుపుకోండి; మీ భుక్తాల లెక్క తేల్చడం మా పని కాదన్నారు. అందరి ఆస్తి జప్తు చేస్తామని బెదరించినారు. శ్రీ తహశీల్‌దార్ల వారు మండిపడుతూ మాలో అకుల మట్టయ్యగారిని చాలా తూలనాడినారు. చివరకు తిట్టి, మీరంతా పన్నులు యివ్వనివ్వక చేస్తూవున్నారా యని చాలా నీచంగా మాట్లాడినారు. అంతేగాక ప్రజలను బెదరగొట్టినారు. తిరస్కారంగా మాట్లాడినారు. పోలీసువారిని పిలిపిస్తానుఅనిన్ని ఆస్తి అంతా జప్తుచేయిస్తా ననిన్ని అన్నారు. కరణం వ్రాసిన రిపోర్టు నాధారపరచుకొని పోలీసు వారికి వ్రాసినానుఅనిన్ని, పోలీసులను పిలిపించి యిండ్లు జప్తు చేస్తాము ఆలోచించుకోమనిన్ని అనెను.

రశీదులు యివ్వమన్నందుకా యింత ప్రతిఫలమని మేము తలంచితిమి. ప్రజలు దొమ్మికి వొచ్చినారనీ, దౌర్జన్యంచేసిరనీ, పోలీసులకు రిపోర్టుచేసేసూచనకూడా కనపరచిరి. ప్రభుత్వాన్ని తిరస్కరించడం మా వుద్దేశం యెంతమాత్రం కాదు. కావున యేమైననసరే యిస్తామని పన్ను చెల్లించితిమి. కాని, పిటీషనులపై సంతకములు చేసినవారిపై పక్కాకక్కరిపద్ధ యూపాయి అదనుగా జరిమానా వసూలుచేస్తాను చూడమంటూ కరణంగారు వసూలు చేస్తూవున్నారు.

ఏ ప్రభుత్వము న్యాయసమ్మతంగా రశీదులు యిస్తేనేగాని పన్నులు యివ్వవద్దని బహిరంగంగా ప్రకటించిందో, ఆ ప్రభుత్వాన్నే రశీదు లివ్వమంటే, యిదియా ఫలితము?

మునగాలలో సత్యాగ్రహమా?

రామాపురం గ్రామం మునగాల ఎస్టేటులోనిది. లోగడ ఈ గ్రామంలో రైతుల పశువులను చెర్వులోనికి రాకుండా జమీందారు సె. 144 క్రింద ఆర్డర్లు నిప్పించియుండెను. అప్పుడు ఆ ఆర్డరును ధిక్కరించి సత్యాగ్రహ మొనర్పుటకు రైతులు నిశ్చయిరి. కాని కొందరి సలహా వల్ల విరమించిరి. నేడు తిరిగి ఒక స్కూలు విషయంలో తగాదా ప్రారంభమైనది. తన ప్రభుత్వముగా సాగుతున్న రోజులలో పిల్లల కొరకు స్కూలును కట్టించుటకై జమీందారు రైతుల వద్ద రు. 360-లు వసూలు చేసెను. స్కూలు కట్టుటకై అపూరునుండి వెళ్ళిపోయిన ఒకరి స్థలము ఆక్రమించబడింది. పునాదులను కట్టుటకై ఇమ్మడి పాపయ్యగారను పూర్వపు జమీన్‌రైతు సంఘాధ్యక్షుని రాయి ఉచితంగా బలాత్కారంగా తేబడింది. ఇక గ్రామస్థులందరూ, స్థలములో నున్న గోతులను పూడ్చుకుట బస్సుకట్టి రాళ్లతెచ్చుట, గోడలు పెట్టుట వగైరా పనులన్నియు జేసిరి. కలకోవగ్రామం నుండి స్కూలుకు తాటాకు, పాతకలప ఉచితంగా తేబడింది. వడ్రంగులు వగైరాలు ఉచితంగా పనిజేసారు. చివరకు రైతుల డబ్బుతో, రైతు స్థలంలో, రైతు సంఘాధ్యక్షుని రాయితో, రైతుల కాయకష్టంతో, ఆ స్కూలు తయారయింది.

స్కూలులో ఒక గది. ప్రక్కన వసారా. వసారాలో ఎలిమెంటరీ పాఠశాల పెట్టబడుతూ వున్నది. గది మాత్రం సత్రమువలె అందరికి ఉపయోగపడుతూ వున్నది. రైతులు అస్కూలులో కూర్చొని తాళ్ళు పేనుకొనుట, పను కొనుట మొదలగు రీతుల ఉపయోగించుకొనేవారు. జమీందారు ఉద్యోగులు కూడా ఎప్పుడైనా శిస్తు వసూళ్ళ కొరకు అగ్రామం వెళ్ళినపుడు అస్కూలులోనే కూర్చొని పోతూ వుండేవారు. తిరిగి రైతు సంఘము పునరుద్ధరింపబడినపుడు జమీందారు ఆ స్కూలును ఆక్రమించుకొనుటకై ప్రయత్నించాడు. స్కూలు ఆవరణలో ఒకమూల నూయి త్రవ్వటకుపోగా రైతులు ఆటంకపర్చారు. సముద్దారు చేతిలో పలుగును లాక్కొని నెట్టిపారేశారట ఏమైనా రైతులు జమీందారును మాత్రం ఆ స్కూలును ఆక్రమించుకోనీయ లేదు.

తిరిగి ఈనాడు తగాదా ప్రారంభమైనది. రైతులు జమీందారుతో చేసుకున్న రాజీ జమీందారు కఠినత్వమువల్ల విఫలమైనది. కాబట్టి జమీందారు తిరిగి స్కూలును స్వాధీనపర్చుకొనుటకు ప్రయత్నించాడు. ది 13-5-39 న నందూరి ప్రసాదరావుగారు అస్కూలు వసారాలో రైతాంగ విద్యాలయాన్ని ప్రారంభించారు. వెంటనే జమీందారు జిల్లా పోలీసు సూపరెండెంటుకు స్కూలును రైతులు దౌర్జన్యముగా ఆక్రమించుకొన్నట్లు రిపోర్టు పంపారు. మరునాడు అస్కూలు ఆవరణలోనే పరంధామయ్యగారు ఎఱ్ఱజండాను స్థాపనచేసారు. ది 15-5-39 మునగాల సబ్‌యినస్పెక్టరు విచారణకువచ్చారు. రైతులు యదార్థ విషయములను తెల్పగా రిపోర్టు వ్రాసుకొని వెడలిపోయారు. కాని, ఈస్కూలు విషయంలో రైతులపై 144 సె॥ ప్రయోగింపబడునను పుకార్లు లేచాయి రైతుల న్యాయమైన ఇట్టి విషయములలోకూడ అబద్ధపు రిపోర్టుల నాధారంజేసికొని నిర్బంధములు సాగింపబడినచో, రైతులు సత్యాగ్రహమును ప్రారంభింపవలసి వచ్చును.

కాంగ్రెస్ హయాంలో నేనా యీ జబర్దస్తీలు?

చెర్వుపల్లె పోలీసు బంద బూతులతో రైతుసభను భగ్నం చేశాడు

ఆత్మకూరు సర్కిల్ - సబ్ - ఇన్‌స్పెక్టర్ల అమానుష చర్యలు

సోంపేటలో ఒక పోలీసువాని దౌర్జన్యం

కామ్రేడ్ జి. సి. కొండయ్య

చెర్వుపల్లె (నెల్లూరు జిల్లా) రైతులు 12 వ తేదీ వాళ్ళవూరిలో ఒక బహిరంగసభ యేర్పాటు చేసి నన్ను వుపన్యాసమివ్వ ఆహ్వానించారు. అపేక్షప్రకారం నేను 6 గంటలకు చెర్వుపల్లెలో దిగాను. దిగుచుండగనే, అగ్రామ యువకుల కలుసుకొన్నాను. మీటింగు ప్రయత్నములో వుంటినాము. అంతట అగ్రాను రైతులు వారికి జరుగు అన్యాయములు నాతో చెప్పుకొన్నారు. యింకా చెప్పుచుండిరి. యింతలోనె నేనొచ్చిన సంగతి యెవ్వరోపోయి పోలీసు స్టేషనులో చెప్పిరట. అంతట ఆ గ్రామంలో కొంతమంది రౌడీలను నన్ను వూరిలోనుంచి తరిమెయ్యమని పంపిరి. ఆ రౌడీలు నా దగ్గరకు వచ్చి నీదేవూరు మావూరు కెందుకొచ్చావు? యింతట పోలేకుంటే నీకు ప్రాయశ్చిత్తము చేస్తాము; నిన్ను యెవ్వరు రమ్మంటే వచ్చావు? పోతావా లేదా? అని యింకా అసహ్యంగా మాట్లాడిరి, అప్పుడు నన్నాహ్వానించిన రైతులు వారికేదో చెప్పి పంపి వేసిరి. తర్వాత మీటింగుకురమ్మని అందరికీ తెలియజేసి సాయంత్రం 8 గంటలకు మీటింగు ఏర్పాటు చేసాము. అప్పుడక్కడుండిన యిద్దరు రౌడీలతో, గలాటా చేయకుండా వుండండి; మిమ్ము అవమానపరచే మాటలేవయినా మాట్లాడితే నన్నడగండి జవాబు యిస్తాను అని నేనుతెల్పి,వుపన్యాసం ప్రారంభించాను. రైతులంతా శ్రద్ధగా యేవిధమైన గలాటా లేకుండా వింటున్నారు. యింతలో అవూరి పోలీసు స్టేషన్ రైటరు సుబ్బయ్య అను పోలీసు తప్పత్రాగి తూలుతూ, పెద్దగా అరుస్తూ సభ దగ్గరకువచ్చి, నాతో, వరే నీవు పొమ్మని చెప్పితే యెందుకు పోలేదురా. లంజాకొడకా యేంజెప్పి యేంజేస్తావురా? కలెక్టరు మాదిరిగా మాట్లాడుతున్నావు గదరా! నీవు పల్లెలమీద తిరుగుతూ, రైతులవద్ద లంచాలు గుంజుతూ, నెల్లూరు అల్లూరుతిరిగి కాంగ్రెసుఅని డప్పాలు కొట్టుకొంటూ, రైతుల మోసగిస్తావటరా? లంజాకొడకా నీవు మామీద లంచాలు తీసుకొన్నారని అర్జీలు పెట్టుతావటరా? నీ యమ్మ (మొదలుగాగల బూతుమాటలు) మర్యాదగా పోతావా తన్నాలనా? ఒరే (రైతులవైపు మళ్లి) యధవల్లాలా, మీకు మూడిందేమిరా? వాడి మాటలు వింటున్నారు! వాడిని యెవ్వరురా రమ్మన్నది? మిమ్ములనందరనీ రేపు సాయంత్రానికి జైలుకు తోలుతానురా. మిమ్మల సి.టీ. ఆక్టులో పెట్టిస్తానురా? కానివ్వండి లంజాకొడుకుల్లారా అని యింకా వ్రాయ వీలులేని దుర్భాషలు మాట్లాడినాడు. ఒరే వాడిని యిక్కడకు తీసుకొచ్చి మాపై అర్జీలు పెట్టిస్తారటరా? అంటూ అల్లరిచేసి, మీటింగు జరగనీయకుండా చేసాడు. యీ పోలీసు రౌడీ చేష్టలకు చాలమంది రైతులు జడిసి వెళ్ళిపోయేరు. కొంతమంది యీ తిట్టులకూ, మీటింగు ఆగిపోయినందుకు, పోలీసులపైకి ఉద్రేకులైరి. అనేక విధములైన భావాలు వారిలో పొడచూపినవి. నాకు రామదుర్గాలో జరిగిన అల్లరులు జ్ఞాపకానికొచ్చినవి. రైతు యువకుల దృష్టి పోలీసు స్టేషన్‌వైపుకు మరలింది, దౌర్జన్య భావంతో, వారిహృదయాలు రగుల్కొన్నాయి, నన్ను ప్రశ్నించ మొదలుపెట్టారు. యిక యెందుకు మా బ్రతుకులు మా ప్రాణాలు పోలీసు స్టేషన్‌ముందు వదల్తాము. అంటూ వుద్రేకపూరిత వాక్యాలు వారినోట రాజొచ్చాయి, ఆ రైతులకు సమాధాన వాక్కులు చెప్పి వారి ఉద్రేకమును చల్లార్చితిని. అంతటతో మీటింగు విఫలమైంది. యిక ఆ రాత్రిఅంతా సోదరులు నాకు కావలి కాసారు.

పోలీసులు యీవిధంగా ప్రజల బెదరించితే, వారిగుట్టు బయట పడకుండా పోతుందని వారి భావముకాబోలు. కాని యిందువల్ల ప్రజలు ఒక పాఠాన్ని నేర్చుకొన్నారు. పోలీసుల యీ రౌడీజానికి కారణం లేకపోలేదు. ఏప్రియల్ 3 వ తేదీని జరిగిన లంచగొండి కేసును కాంసాపేట రైతు నా ద్వారా అర్జీలు పెట్టడం, అది విచారణకు రావటం, పోలీసులు ఆ రైతును బెదరించి, కొంత డబ్బు యిచ్చి ఆ కేసును మాఫ్ చేయటం, జరిగింది. ఏప్రియల్ నెలాఖరు లోపున 3 కేసులు యీ మాదిరివే జరిగినవి. యీకేసులు అక్రమంగా రైతులపైనపెట్టి, బనాయించి లంచాలు, తన్నులతో సమాప్తమయినవి. అవి అన్నీ రైతులు నాతో చెప్పిరి,యేమో చేస్తారని పోలీసులుఅనుకొని, యీ విధంగా గుట్టు బైట పడుతుందేమోనని మీటింగు జరగనీయకూడదనీ విఫలం చేసారు. జరిగిన అక్రమ కేసులలో వుదాహరణకు యిక్కడ ఒకటి వ్రాస్తాను

పోయిన నెల 17-వ తేదీన పోలీసులూ, ఆ గ్రామంలో పోలీసుల వెన్నంటివుండే రౌడీలు కలసి, అందులో ఒక రౌడీ యింటి గోడ వూడదీసి, యింటిలోని పెట్టెలు కొన్ని వూరిబయట వేయించి సుమారు 7 మంది రైతులపై కేసులో సంబంధం వుందని బనాయింపు చేసి 7 మందినీ పోలీసుస్టేషన్‌కు పిలచి, వారి యిష్టముచ్చినట్లు తన్ని వదలిరి. తర్వాత, ఆత్మకూర్ సర్కిల్ సబ్‌యిన్‌స్పెక్టరు మరునాడు వచ్చి, పైవారిని వూరిబయటకు తీసుక వెళ్లి సర్కిల్-సబ్-యిన్‌స్పెక్టర్లు లాఠీలతో కొట్టి, యింకా యెన్నోవిధాల వాండ్ల శరీరాలు కుందిరట, తర్వాత మళ్ళీ స్టేషన్‌కు తీసుకెళ్లి రైతులను క్రింద పడవైచి బూటు కాళ్ళతో ఎగిరి గుండెలపై దుముకుట, చేతులు రెండింటిని ముందుకు లాగి సరిగోడపై కొట్టుట, మొదలుగాగల చర్య లవలంబించి, 8 రోజులు ఆత్మకూరు జైలులో నిర్బంధించి, కేసు తేలలేదని అని రపరాధుల వదలివేసిరట. యీ చర్యలకు రైతులు వోర్చలేక, యీ దౌర్జన్యమును అణచుటకు సంసిద్ధులై యున్నారు. యిదేవిధంగా పోలీసులు ఆ పల్లెలన్నిటిల్లో దౌర్జన్యం సాగిస్తున్నారు. ఈ విషయములన్నీ రైతులు సభలో నాతో చెప్పిరి. ఇది యేమౌతుందోనని పోలీసులు మీటింగు జరగకుండా రౌడీజము అవలంబించి సభను విఫలము చేసేరు.

కాంగ్రెసు మంత్రుల హయాములో యీ విధంగా ప్రజలు హింసలు పడుతున్నారంటే సిగ్గుతో తల వంచుకోవలసిన అవస్థ పట్టుతూంది. నెల్లూరుజిల్లా కాంగ్రెసువారు యీ విషయము లన్నిటిపైనా ఒక ఎన్‌క్వయరీ కమిటీని వేసి విచారిస్తే యిట్లాంటివి యింకెన్నో బయలుపడతయి. అవిధంగా కాంగ్రెసువారు పూనుకొనకపోయినా, పరిస్థితులు విషమిస్తాయి.

★ ★ ★

సోంపేట

ఒక విలేఖరి యీవిధంగా మాకు వ్రాయుచున్నాడు.

నిన్నటి దినము అనగా 10 మే 39 నాడు రాత్రి 10 గంటల సమయ మప్పుడు సోంపేట (ఉ. విశాఖపట్నం)లో యిరువురు పోలీసులు లక్ష్మినారాయణ, శీతారాములూ ఈ యిద్దరు తప్పత్రాగి, కొరికానపొట్టెడను ఆసామిని వారిశక్తి కొలది లాఠీలతో చావమోదారు. స్పృహతప్పి రక్తము కక్కుకుంటూ రోడ్డు మీద పడిఉన్న అకొరికాన పొట్టెడ్ని కొందరు పెద్ద మనుష్యులు ఆసుపత్రికి చేర్చారు. డాక్టరుగారేవోమందు లిచ్చిరేగాని ఇప్పటికింకా తెలివి రాలేదు. నోటి వెంబడి, ముక్కు వెంబడి రక్తము స్రవించుచునే ఉన్నది. బతుకు తాడో చస్తాడో తెలియదు. దీనికి కారణం, ఒక కులతగు వునందు యీపొట్టెడనే ఆసామి, సారాత్రాగి అల్లరి చెస్తున్నాడట. కాని, పోలీసువారే త్రాగి తప్పులేదు కాబోలు! ఇంతకూ వార్ని అడిగే వారెవరు లేకపోలేదు

ఈమధ్య అఖిలభారత కాంగ్రెసు వర్కింగు కమిటీ కలకత్తాలో సమావేశమయి నప్పుడు మదరాసు ప్రధాన మంత్రిగారగు గౌ॥ సి. రాజగోపాలాచారిగారు అక్కడకు వెళ్లినప్పుడు యీపోలీసువారి దుండగములు నివేదించుటకు సోంపేట స్టేషన్‌వద్ద వారికి కొన్ని విజ్ఞప్తులు యీ గ్రామస్తులు, తాలూకా కాంగ్రెసు సంఘము వారు దాఖలు చేసియుండిరి. కాని నేటివరకు వారిపై చర్య తీసుకున్నట్లు కనపడదు. కారణమేమొతెలియదు. కాబట్టి యిప్పటికయినా ప్రజల సంరక్షణార్థమై కంకణము కట్టుకున్న యీ కాంగ్రెసు మంత్రులు పోలీసువారి దుండగములను అణచుటకు తగిన చర్య తీసుకొందురని నమ్ముచున్నాను.

★ ★ ★

గ్రామ రైతు సంఘ సమావేశము

నెల్లూరు జిల్లా, కోవూరు తాలూకాలోని యిందుపూరు గ్రామ రైతుసంఘ సాధారణ సమావేశము 7-5-39 వ తేదీ సాయంకాలం గ్రామదేవాలయమువద్ద శ్రీ నూకలపాటి వెంకటరెడ్డిగారి అధ్యక్షతను జరిగెను. సమావేశములో యీ క్రింది తీర్మానములు ఆమోదించబడెను.

1. చెన్నకేశ్వరస్వామి దేవస్థానమునకు సంబంధించిన భూములను సర్వేనెంబర్ల ప్రకారం రిజిస్టరు కవుళ్ల వ్రాయించుకొనుటకు దేవస్థాన మేనేజింగు ట్రస్టీగారు ఇందుపూరు కరణంగారిని ఏ యే భూమికి ఏ యే సర్వే నెంబరు ఉన్నదీ తెలియజేయవలసినదని అడుగగా, ఆయన నిరాకరించుటవల్లను, అల్లూరు ఫిర్కా రివెన్యూ ఇన్‌స్పెక్టరుగారు తాను యీ విషయములో ఏమీ చేయజాలనని చెప్పుటవల్లను, జిల్లాకలెక్టరుగారు వెంటనే కలుగజేసుకొని సర్వే నెంబర్లు తెలియచేయవలసినదిగా కోరుచూ తీర్మానించబడెను.

2. నాలుగవ వాయిదా శిస్తు కట్టుటకు బాకీ సంజాయిషీ లెక్కలను రైతులకు చెప్పుటకుగాను యీనెల 10 వ తేదీ మొదలు నెలాఖరు వరకూ ఉదయం 7 గం. మొదలు 10 గం. వరకూ యిందుపూరు గ్రామకరణముగారిని రచ్చవద్దకు వచ్చునట్లుగా యేర్పాటు చేయవలసినదని అల్లూరు ఫిర్కా రివిన్యూ యిన్‌స్పెక్టరుగారిని యేటూరు బలరామిరెడ్డి, బస్వారెడ్డి బైరాగిరెడ్డిగార్లు కోరగా "యీనెల 10 వ తేదీ లోపల కరణముగారు లెక్కలను మునసబ్ గారికి పంపుననియూ, ఆలెక్క ప్రకారం శిస్తు కట్టకున్న 10 వ తేదీనుండి జప్తుచేసి శిస్తు వసూలు చేయబడుననియూ, మీరు కట్టవలసిన శిస్తుకన్నా యెక్కువ కట్టినయెడల దావాచేసి రాబట్టుకొనవలెననియూ" రివిన్యూ ఇనస్పెక్టరు గారు చెప్పిరి. కాబట్టి కరణముగారు సరియైన లెక్కలను చెప్పకున్న శిస్తుకట్టిన చాల నష్టపడుదుముగాన మా గ్రామకరణముగారిని రచ్చవద్దకు వచ్చి సరియైన లెక్కలు చెప్పునట్లు యేర్పాటు చేయవలసినదిగా నెల్లూరు జిల్లా కలక్టరువారిని కోరుచున్నాము.

(సం.) యన్. శంకరయ్య,
యిందుపూరు గ్రామరైతు సంఘ కార్యదర్శి,
7-5-39.

రాజకోటలో మహాత్ముని పరాజయం

గాంధీజీ కోరినట్లు 12 వ తేదీలోగా దర్బార్ వీరవల్లా ప్రజాభిప్రాయాన్ని సంతృప్తిపరచే సంస్కరణలను ప్రకటించి, ఆశుభవార్తను మహాత్మునికి తెలుపలేకపోయాడు. అందుపై 12 వ తేదీకి గాంధీజీ రాజకోట చేరుకున్నాడు.

రాజకోట చేరుకొని పరిషత్ నాయకులతో సంప్రదించాడు. మితవాదులతో మాట్లాడాడు. "మీరు కోరినంతవరకైనా చిల్లిగవ్వ తగ్గకుండా వీరవల్లా సంస్కరణలు ఇవ్విస్తాడని నిక్కచ్చిగా చెప్పగలరా" అని గాంధీజీ మితవాదులను అడిగాడు. "నమ్మకం చాలదు" అని మితవాదులు వెలిబుచ్చారు. "అయితే ఆ సంగతి ముందు తేల్చుకోండి. పై వ్యవహారము తరువాత మనం ఏం చేసేదీ ఆలోచిద్దాము" అని మితవాదులతో గాంధీజీ చెప్పాడు. మరునాడు మళ్ళీ మితవాదులు. గాంధీ కలుసుకుని మాట్లాడారు. "ప్రజా పరిషత్తుద్వారా కాకపోయినా, గౌరవమైన రాజీయే సంప్రాప్తమైతే ఏమీ అభ్యంతరములేదు. వీరవల్లా ఇస్తానన్న సంస్కరణల ప్రణాళిక ముందుగా సంపాదించండి. తరువాత చూతాం" అని గాంధీజీ మితవాదులకు మాటయిచ్చాడు.

మహమ్మదీయులకు, భయ్యాట్లకు గాంధీజీ వాగ్దానము చేసిన దానిని గురించి గందరగోళము హెచ్చయింది. వారు పూట పూటకు గాంధీజీని వేధించివేస్తున్నారు. నిజముగా సంస్కరణల కమిటీని ఏర్పరచవలసినది రాజకోట ఠాకూరు. అందులో 7 గురు గ్వయర్ తీర్పు ప్రకారము పటేలు ఇష్టంవచ్చినవాళ్ళు ఉండాలి. నిజంగా భయ్యాట్లు, మహమ్మదీయులు తమ సీట్లకోసము పేచీ పెట్టాలనుకుంటే ఠాకూర్‌సాహెబుతో పెట్టాలి గాని గాంధీజీని వేధించడం సరికాదు. ఠాకూర్ సాహెబుకు అనుకూలముగా ఉండే 3 గ్గురు మెంబర్లతోనూ కలసి సంపూర్ణ బాధ్యతాయుత ప్రభుత్వాన్ని స్థాపించకోరే ప్రజా పరిషత్ ప్రయత్నాలను వ్యర్థము చేద్దామనే ఉద్దేశ్యముతోనే గాంధీజీని వాళ్ళు కోరారు. దీనికి వీరవల్లా సమిధ వేశాడు. వారుకూడా ప్రజాపరిషత్తుతో సహకారము చేస్తారని గాంధీజీ అభిప్రాయపడ్డాడు. కాని కథ అంతా అడ్డం తిరిగింది.

ఈ విధముగా, దురుద్దేశ ప్రేరితులయి మహమ్మదీయ భయ్యాట్ నాయకులు ప్రజలలో చీలికలను పుట్టించుతున్నారు. ఏవో రకపు సంస్కరణలు ఇవ్విస్తానని మితవాదులను వీరవల్లా భ్రమపెడుతున్నాడు. గాంధీజీ ప్రాణాలొడ్డి సంపాదించిన గ్వయ్యర్ తీర్పు ప్రకారము, తమకు సంపూర్ణ బాధ్యతాయుత ప్రభుత్వం ప్రాప్తించి తమ కష్టాలన్నీ గట్టెక్కుతాయని మిగతా ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. దానిని అమలు జరిపించమంటున్నారు. ఈ విధముగా ఒక వంకనుండి ప్రజా సంరంభము హెచ్చుతోంది.

గాంధీజీ గ్వయర్ త్రీర్పును త్యజించుట

"నేను గ్వయర్‌త్రీర్పును విసర్జించివేస్తున్నాను" అని గాంధీ అకస్మాత్తుగా ప్రకటించాడు. కారణంచెపుతూ" గ్వయర్ తీర్పును సంపాదించడములో సరియైన అహింసా పద్ధతిని నేను అవలంబించలేదు. రాజకోట ఠాకూరు తన వాగ్దానాన్ని అమలుజరుపునట్లు అతనిని నిర్బంధ పెట్టుటకు పేరమౌంట్ పవర్ (బ్రిటిష్ ప్రభుత్వము) తక్షణము కలుగజేసుకోవలసిందని, నేను నిరాహార దీక్ష బట్టాను. ఇది హృదయపరివర్తనకైగావించే విధానం గాదు. ఇది నిర్బంధం. అందుచే నాదీక్ష హింసా కలుషితమైంది. నేను ఠాకూర్‌సాహెబ్‌ను ఉద్దేశించే నిరాహార దీక్ష పూని యుండినచో యీ కలుషము నాఉపవాసమునకు అంటివుండెడిది గాదు" అన్నాడు.

"గ్వయర్‌తీర్పును అమలుజరుపుటకు ఇంకా వీరవల్లా ప్రిముఖులు వీలైన ఆటంకాలన్నీ కల్పించి గమనాన్ని దుర్గమనం చేస్తున్నారు. గ్వయర్ తీర్పుకు పూర్వము నాతో మిత్రభావముతో వర్తించే మహమ్మదీయులు, భయ్యాటులు యీనాడు నాతో విరోధం పూనారు. వారి స్టేట్‌మెంట్లు ఇప్పుడు నావద్ద ఉన్నాయి. నేను గ్వయర్ తీర్పునే విసర్జించివేయుటవలన, ఇప్పుడు భయాట్లకు గాని, మహమ్మదీయులకు గాని నేను ఇచ్చేదేమీ లేదు. రాజకోట ఠాకూర్‌సాహెబ్‌నుండే, రావలసినవన్నీ రాబట్టుకోండి. కాని మొదటినుండి ఇంతవరకూ యీ విషయములో నేను శ్రమ కల్గించిన వైస్రాయి మొదలగువారందరికి నా క్షమార్పణ చెప్పుకొంటున్నాను."

"గ్వయ్యర్ తీర్పును వదలివేయడంవల్ల 75 వేల ప్రాణాలు నష్టపెటమౌతున్నానని నా సహచరులంతా భావిస్తున్నారు. ఇది నావంటి రాజకీయ నాయకుడికి తగనిపని అంటున్నారు. నేనే నాయకుడిని అని వారికి నమ్మకము ఉంటే నేను చేసినట్లల్లా చూస్తూ-ఆ పనులు అవకతవకగా కనిపించినా సరే-ఊరుకోవాలి."

"ఇప్పుడు ఠాకూరుసాహెబు మీద ఒత్తిడి అంతా తగ్గిపోయింది. ప్రజలను పూర్తిగా సంతృప్తి పరచడానికి వారు పూనుకోవాలి అని నేను కోరుతున్నాను." అని గాంధీజీ గ్వయ్యర్ త్రీర్పుకు స్వస్తి వాక్యము చెప్పేశాడు.

మహాత్ముని యీప్రకటనపై, మహమ్మదీయ నాయకులు తెల్లబోయారు. భయ్యాత్‌లు తమకుగలిగిన వాగ్దానభంగాన్ని గురించి గ్వయ్యర్ ఎదుట పెట్టమన్నారు. రాజకోట ఠాకూరు మహాత్ముని గొప్పతనాన్ని ప్రశంశించాడు—కాని ప్రజలపై గల నిర్బంధ విధానాన్ని మాత్రము తొలగించలేదు. సంస్కరణల ప్రకటన, రాజకీయ ఖైదీల విడుదల, జరుగనేలేదు. ప్రజా ఉద్యమములో పాల్గొన్న పలువురు లాయరు ప్రముఖులు ప్రాక్టీసుచేయడానికి వీలులేదన్ని నిషేధింపబడ్డారు. 'రాజకోట పోరాటం, అనే పుస్తకము నిషేధింపబడింది. ప్రజలపై నిర్బంధ విధానం నానాటికీ హెచ్చుతూంది.

ప్రజా పోరాటాన్ని కట్టిపెట్టి, వైస్రాయి ద్వారాను, న్యాయమూర్తుల తీర్పుల ద్వారాను, శాసనబద్ధ పద్ధతుల ద్వారాను ప్రజల సమస్యలను పరిష్కారము చేయించవచ్చునని తలచిన మహాత్ముని అభిప్రాయముయొక్క ఫలితముయిలా పరిణమించింది! ప్రజాపోరాటంద్వారా హక్కులు సంపాదించుకోవాలన్నప్పుడు మహాత్మునికి భయ్యాట్ మహమ్మదీయ నాయకులనుండి నేడు సంభవించిన చిక్కులుసంభవించలేదు. సాగితే ప్రజాపోరాటమే ప్రజాసామాన్యాన్నందరినీ ఏకముచేసి స్వలాభాపేక్షపరులయిన నాయకుల వలలలోనుండి వారిని రక్షించి, వారి ఆశయాలను నెరవేర్చి యుండేది.

ప్రజా హక్కులు నెరవేరాలంటే ప్రజా పోరాటమే శరణ్యం అని యీఘటన మరియొకమాటు రుజువు చేసింది. శాసనబద్ధ పద్ధతుల ద్వారా సామ్రాజ్య వాదులను, వారి సహాయకులను మార్చడానికి తావులేదని గొంతెత్తి చాటింది.

జాతీయ వాంఛా తీర్మాన ప్రచారం
నర్సాపురం తాలూకా

నర్సాపురం తాలూకా కాంగ్రెసు సంఘ, కాంగ్రెసు సోషలిస్టుపార్టీల యాజమాన్యమున ఒక వలంటీయరు దళము బయలుదేరి తాలూకా అంతయు సంచారము చేయుచున్నది. ఎండలు చాల మిక్కుటముగ యున్నను దళమువారు కాలినడకను దినమునకు 3, 4 గ్రామములలో ఊరేగింపులు సభలు జరిపి వుపన్యాసములు ఇచ్చుచున్నారు. త్రిపురీ కాంగ్రెసు మహాసభ ప్యాసుచేసిన జాతీయ వాంఛా తీర్మానమును ప్రజలకు విపులముగా అర్థము చెప్పుచున్నారు. 15 వ తేదీ చించినాడ నుంచి బయలుదేరి ఎలమంచిలి మీదుగ మల్లపాలెం చేరిరి. మల్లిపాలెంలోను, నాగని లెంలోను బహిరంగ సభలు జరిగాయి. కామ్రేడ్స్ ఉ. రామం, కె. రామారావుగార్లు జాతీయ వాంఛా తీర్మానమును గురించియు, ఫెడరేషను వ్యతిరేక వుద్యమాన్ని గురించియు విపులముగా వుపన్యసించిరి. మరునాడు దొడ్డిపట్లమీదుగ, నీరుల్లిపాలెం, వల్లూరు గ్రామాలలో బహిరంగసభలు వూరేగింపులు జరిపిరి. అన్ని గ్రామాలలోను తాలూకా కాంగ్రెసు సంఘ కార్యదర్శి ఉ. సూరపరాజుగారు దళము వెంటనేవుండి గ్రామ సంఘములను ఏర్పాటు చేయుచున్నారు.

17 వ తేదీన బీరులాపురం, కాంబొట్లపాలెం గ్రామాలలో బహిరంగ సభలు జరిపి రాత్రికి పెనుమర్రు గ్రామంచేరి అచ్చట నగర సంకీర్తనానంతరం బహిరంగ సభ జరిపిరి. సభలో కామ్రేడ్ అల్లూరి సత్యనారాయణగారు ఫెడరేషనును గురించి, రాబోవు ప్రపంచ యుద్ధమును గురించి విపులముగా మాట్లాడి ఫెడరేషనును ప్రతిఘటించవలెనని, సామ్రాజ్యవాద యుద్ధాలలో భారత జాతి పాల్గొనరాదని, బ్రిటిషు సామ్రాజ్యవాదులకు ఏవిధముగాను సహాయము చేయరాదని, హెచ్చరించారు. భారత జాతీయ వాంఛను గూర్చి చెప్పుచూ రాబోవు సామ్రాజ్యవాద యుద్ధ సమయంలో మనము సంపూర్ణ స్వాతంత్ర్యమును సంపాదించుటకు సంసిద్ధముగా ఉండాలని హెచ్చరించారు.

18 వ తారీకున నేరేడిమిల్లి, రాలిపాడు గ్రామాలలో వూరేగింపులు, బహిరంగ సభలు జరిపిరి. రాత్రికి దళము గుమ్మలూరుచేరినది. రాత్రి ఊరేగింపు, పిదప సభ, జరిగినది. సభలో సామ్రాజ్యవాదం మనదేశాన్ని పీడిస్తున్న విధానాన్ని గురించి, ఏబది సంవత్సరముల కాంగ్రెసు చరిత్రను గురించి, ఇప్పుడు కాంగ్రెసులో ఏర్పడ్డ అతివాద మితవాద భేదాలను గురించి, ఫెడరేషనుయొక్క స్వభావాన్ని గురించి కాంగ్రెసు మంత్రులుచేయు ప్రజాహిత కార్యాలను గురించి, రాబోవు మహాసంగ్రామమందు బ్రిటిషు దొరతనానికి భారతీయులు సహాయపడక కాంగ్రెసు తీర్మానాన్ని అమలు జరుపుటను గురించి, నూతన ఇండియా చట్టాన్ని భగ్నంచేసి దానిస్థానే ప్రజాపరిషత్తు నేర్పరచి కాంగ్రెసు తీర్మానం అమలు జరుపుటనుగూర్చి, అందుకై చేయవలసిన త్యాగాన్నిగూర్చి విపులంగా ఉపన్యాసము లివ్వబడ్డాయి. రాత్రి యీ గ్రామంలోనే దళము విశ్రమించి 19 వ తారీఖున పెనుమదం, మట్టపర్రు గ్రామాలు చూచుకొని దళము జిన్నూరు చేరుకొన్నది. అని శ్రీ కోసూరి సుబ్బరాజుగారు తెలుపుచున్నారు.

* * *

ఇతర స్థలాలు

బీరం రామనాథంగారు వెంకటగిరి నుండి ది. 25-4-39 తేదీని బయలుదేరి తిరుపతి, చంద్రగిరి, చిత్తూరు, మదనపల్లి, టి. వడుము, దారమొల్లపల్లి, బిసైగారిపల్లె, పరమట గ్రామాదులలో, జాతీయ వాంఛా తీర్మానమునుగురించి, యుద్ధవ్యతిరేకతను గురించి, మైసూరు సమ్మర్ స్కూలును గురించి ప్రచారం గావించారు. ది 1-5-39 వ తేదీని టి. వడుము గ్రామంలో మే దినోత్సవము జరిపించారు. సభలలో రష్యాలోని ప్రజల సౌఖ్యాలనుగురించి హిందూదేశ స్వాతంత్ర్య ఉద్యమాలను గురించికూడ వివరింపబడినదని ఒక విలేఖరి తెలియజేయుచున్నాడు.

* * *

కాంగ్రెస్ సభ్యులను చేర్పించుట

ఈ సంవత్సరం కాంగ్రెసు ప్రాథమిక సభ్యులను చేర్పించుటకు ఆగష్టు 31 ఆఖరు తేదీ అని అ. భా. కాం. కమిటీ ప్రధాన కార్యదర్శి కృపాలినీగారు ప్రకటిస్తున్నారు.

* * *

పశ్చిమ గోదావరి జిల్లా

కాంగ్రెసు అధ్యక్షులు సత్యనారాయణమూర్తి గారి విజ్ఞప్తి.

సోదరులారా!

ఈ నెలలో జరుగవలసిన వాలంటీరుల శిక్షణా శిబిరము ఏర్పాటులు అనివార్య కారణములచే ఆపుచేయవలసి వచ్చినది. కాని ది 16-5-39 న సమావేశమై కార్యనిర్వాహక వర్గమువారు శిబిరము ఏర్పాటులను వ్యవసాయముల అనంతరము చేయ నిశ్చయించిరి. సంఘమువారు యిప్పటిలగాయతు జూన్ నెల ఆఖరువరకు త్రిపురీ కాంగ్రెసు కావించిన జాతీయ వాంఛా తీర్మానమును, ప్రస్తుతము ప్రభుత్వము మనపై రుద్దదలచిన ఫెడరేషనువల్ల దేశస్వాతంత్ర్యమునకు కలుగనున్న హానిని గురించియు, యుద్ధప్రతికూలతను గురించియు, రానున్న భారత స్వాతంత్ర్య పోరాటమునకు వాలంటీరులు తయారుకావలసిన అవశ్యకతను గురించియు మన జిల్లాలో అన్ని గ్రామాదులలోను ప్రచారము చేయుటకు తీర్మానించినది. యీ తీర్మానమును ఆచరణలోనికి తీసుకొని వచ్చుట ప్రతి కాంగ్రెసుసంఘ సభ్యునియొక్క కర్తవ్యమై యున్నది.

నర్సాపురం తాలూకాలో ప్రచారక దళము కాలి నడకను ప్రచారము సాగించుచున్నది. కొద్ది రోజులలోనే అన్ని తాలూకాలలోను ప్రచారము ప్రారంభింపబడును. యీ ప్రచారం జయప్రదంగా కొనసాగుటకు ప్రజలు, కాంగ్రెస్ సేవకులు అందరు తోడ్పడ కోరుచున్నాను. ప్రస్తుతం కాంగ్రెస్ మెంబర్లను చేర్పించుటలోచేయబడుచున్న అక్రమములు వాటివలన కలుగుచున్న ఫలితమున్నూ తెలియచెప్పుచు ప్రతి పౌరుడు 0-4-0 అణాలు చందా ధనమును స్వయముగా చెల్లించి సభ్యులుగా చేరవలసిన ఆవశ్యకతగురించియు ప్రబోధించ వలెను.

జిల్లా, తాలూకా కాంగ్రెసుసంఘ సభ్యులు కాంగ్రెసు సంఘాధికార్లకు ప్రచారమున తోడ్పడుటకు శక్తికొలది కొలదిరోజులైనను ప్రచారక దళమునందు పాల్గొని ప్రచారము చేయ కోరుచున్నాను.

మన జిల్లాలో సుమారు 860 గ్రామాదులు గలవు. జిల్లాకాంగ్రెస్ కమిటీలో సుమారు 150 మందిసభ్యులు కలరు. సభ్యునకు ఆరు గ్రామముల వంతున పూనుకొనినచో మూడురోజులలో కాంగ్రెసు నేషనల్ డిమాండు తీర్మానమును జిల్లాలో అన్ని గ్రామాదులలోను సమావేశములు జరిపి తెలుపగలుగుదుము.

సోదర సభ్యులందరు పై విషయములను గమనించి జిల్లాలో కాంగ్రెసు యొక్క స్వాతంత్ర్యనినాదమును మారుమ్రోగని గ్రామము లేదనువరకు దీక్షతో ప్రచారము సాగించెదరని ఆశించుచున్నాను.

సోదరులారా:

జూన్ ఆఖరువార మందుగాని జూలై మొదటివారము నందుగాని జిల్లా కాంగ్రెసు సాధారణ సంఘ సమావేశము జరుపబడును. కావున యీ విషయమును సభ్యులందరు గమనించి తాము పంపదలచుకొన్న తీర్మానమును జూన్ 10 వ తేదీలోగా పంపగోరెదను.

ఇట్లు,
కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి,
అధ్యక్షులు,
ప॥ గో॥ జిల్లా కాం॥ సంఘము.

* * *

తూముల తగ్గింపు.

కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పెనుగంచిప్రోలు గ్రామము తాలూకు మునియేరు బ్రాంచి తువ్వకాల్వ క్రింద యిప్పటికి సుమారు 50 సంవత్సరములనుంచి 6 అంగుళముల తూములు వుండివున్నవి సదరు 6 అంగుళముల తూముల గుండా వచ్చెడి నీటివల్ల మేము సదరు భూములను సాగుచేసి జీవనము చేయుచున్నాము. 1938 సంవత్సరములో పి. డబ్ల్యు. డి. వారికి పిటీషనులు పెట్టుకోగా శ్రీ యగ్జిక్యూటివ్ యింజనీరు కృష్ణా సెంట్రల్ డివిజన్ దొరవారు ది 15—8—1938 తేదీన సదరు కాల్వమీదకు దయచేసి, 6 అంగుళముల నుండి 4 అంగుళములకు తగ్గింపబడిన తూములను, ఆతూముల క్రింద భూములను పరిశీలించి 4 అంగుళముల తూములుగుండా వచ్చెడి నీరు సదరు భూములకు సరిపోవుటలేదనిన్నీ సకాలములో నాట్లు పడలేదనిన్నీ రైతులకు చాలా యిబ్బంది కలుగుచున్నదని సదరు 4 అంగుళముల తూములస్థానే 5 అంగుళముల తూములు యిచ్చియున్నారు. కాని, 5 అంగుళములు యిచ్చినప్పటికీ నీరు చాలక కొంతభూమి ఎండిపోయినది. యిట్టి సందర్భములలో సదరు డిపార్టుమెంటువారు ది 12-4-1939 తేదీన సదరు 5 అంగుళముల తూములనుగూడా తగ్గించి మాకు తెలియకుండా మరల 4 అంగుళముల తూములను పెట్టియున్నారు. ది 25-4-1939, 8-5-39 తేదీలలో మేము శ్రీ యగ్జిక్యూటివ్ యింజనీరు మొదలయిన వారలకు పిటీషనులు పెట్టియున్నప్పటికీ మామొర ఆలకించి సదరు తూములను యిచ్చియుండలేదు. కాబట్టి కాంగ్రెసు సంఘమువారునూ, ప్రభుత్వమువారున్ను సదరు తూముల విషయమై సరిఅయిన చర్య తీసుకొని, అనాదినుంచి వున్న 6 అంగుళముల తూములను యిప్పించి మా జీవనములు నిల్పగలందులకు అనేకవిధముల ప్రార్థిస్తూ యున్నాను అని పెనుగంచిప్రోలు రైతుల తరఫున ఒక విలేఖరి వ్రాయుచున్నాడు.

* * *

నోటీసు.

తూ॥ గో॥ జిల్లా కాం॥ సో॥ పార్టీ
సాంవత్సరిక సమావేశము.

జూన్ నెల 4, 5 తారీఖులలో రాజమండ్రి ఆఫీసులో పై సమావేశము జరుగును గాన సభ్యులెల్లరు విచ్చేయవలయును.

3 జూన్ '39 తేదీ శనివారం ఉదయం 8 గంటలకు పై పార్టీ కార్యనిర్వాహకవర్గ సమావేశము పై స్థలములోనే జరుగును.

ఎజండా.

1. పార్టీ కార్య నివేదిక
2. కాకినాడ సమ్మెలు
3. నిర్మాణ సమస్యలు
4. భావి కార్యక్రమము
5. ఇతరములు

పి. అనంతం,
కార్యదర్శి,
రాజమండ్రి, 18-5-39,

* * *

పోలీసు నిఘా తొలగించాలి.

15—5—39 వ తేదీని సమావేశమైన నెల్లూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక వర్గంలో కామ్రేడ్సు దువ్వూరి బలరామ రెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య గారలమీద పోలీసు నిఘాను తొలగించ వలసినదిగా మద్రాసు ప్రభుత్వమును కోరుచూ తీర్మానించబడెను.

ఆంగ్లో-టర్కిష్ (ఇంగ్లండు-టర్కీ) ఒడంబడికతో ఫేసిస్టు డిక్టేటర్ల త్రోవకు కొంత అడ్డు పడింది. ఇదివరదాకా, టర్కీని తటస్థంగా ఉంచాలని జర్మనీ ప్రయత్నించింది. కాని ఈ ఒడంబడికతో ఆప్రయత్నం భంగమైనది. దీనితో కొంతవరకు శాంతిశక్తులు బలపడ్డాయి. ఈ ఒడంబడికకు సోవియట్ తన సంతోషాన్ని వెలిబుచ్చుతోంది. సోవియట్ ప్రభుత్వ పత్రికయగు ఇజ్వెస్టియా ఇలా వ్రాసింది.

"ఇది శాంతికూటమి (పీస్ ఫ్రంటు)ని ఏర్పరచడానికి మెట్టు. దాడి నరికట్టడానికి సాధనం."

ఆంగ్లో-టర్కిష్ ఒడంబడిక తర్వాత ఫ్రాంకో-టర్కిష్ (ఫ్రాంసు-టర్కీ) ఒడంబడిక జరిగే సూచనలు కన్పించుతున్నాయి. ఇదివరకు ఫ్రాంసు-టర్కీలమధ్య 'సాంజక్'ను గురించిన వివాదంకూడ పరిష్కారమౌతుంది. పోతే ఇక మిగిలినది ఆంగ్లో-సోవియట్ (ఇంగ్లండు-రష్యా) ఒడంబడిక.

ఆంగ్లో-సోవియట్ సంభాషణలు

ఆంగ్లో-సోవియట్ ఒడంబడిక ఇంతవరకు కుదరక పోవడానికి కారణం ఏమిటి? మేమిది వరకే చెప్పాం. ఛాంబర్లేను అంతరంగికంగా ఈమైత్రిని వాంఛించడంలేదని. అందువల్లనే ఇంత ఆలస్యం ఇదివరకే అనేకసార్లు చెప్పినా మళ్ళా ఒకసారి. బ్రిటన్ సూచనలు, దానికి సోవియట్ ప్రత్యుత్తరమూ, విచారించడం అనవసరంకాదు.

సోవియట్, బ్రిటన్ ఫ్రాంసులకు తూర్పు యూరప్‌లోనేగాక పశ్చిమ యూరప్‌లోకూడ మిలటరీ సహాయం గావించుతానన్నది దానికి బదులుగా బ్రిటన్, ఫ్రాంసులను మిలటరీ సంధికి రమ్మన్నది. ఇంకా విశదంగా చెప్పాలంటే ఏ పోలండుపైన్నో, రుమేనియాపైననో గాక ఫ్రాంసు, బ్రిటన్‌లమీద ఫేసిస్టు డిక్టేటర్లు (ముస్సోలినీ, హిట్లరు) పడినా రక్షించుతానన్నది. కాని దీనికి ఛాంబర్లేను అంగీకరించడంలేదు. బ్రిటన్ ఫ్రాంసులు, తాము దానికి బదులుగా సోవియట్‌పైన ఇటలీ జర్మనీలు పడితే రక్షించవలసి వస్తుంది దీనికి బ్రిటన్ ఒప్పుకోడంలేదు. పోలండ్, రుమేనియాలకు బ్రిటన్ ఫ్రాంసులిచ్చినట్లే సహాయ వాగ్దానాన్ని సోవియట్ ఈయాలట! పైగా బ్రిటన్ ఫ్రాంసులు, తమ వాగ్దానాలను అమలు పరచకపోతే సోవియట్‌కూడా అమలు పరచనక్కరలేదని బ్రిటన్ హామీనిచ్చింది. అంటే, జకోస్లోవేకియాను బ్రిటన్, ఫ్రాంసులు ద్రోహం చేసినట్లుచేస్తే, సోవియట్ ఒక్కటి పోలండుకోసం పోరాడనక్కరలేదులే అని అర్థం. ఈ సూచనలను సోవియట్ పూర్తిగా తిరస్కరించింది కారణం, "సోవియట్ ఇతరులకోసం సహాయంచేయాలి; కాని సోవియట్‌పైననే దాడిచేస్తే ఇతరులు సహాయంచేయరు" అనే నీతిమీద ఈ ఒడంబడిక ఉండటంవల్ల.

మళ్ళీ బ్రిటన్ గావించిన సూచనల పైన రష్యా జవాబు పంపింది. జవాబులోని విషయాలు బహిర్గతం కాలేదు. కాని ఈ జవాబు ఇదివరకు సోవియట్ పత్రిక "ఇజ్వెస్టియా" పత్రిక సూచించినట్లు ఉంటుందని ఊహ. సోవియట్ తన జవాబులో కోరినది ఇది. "ఇచ్చిపుచ్చుకోవడం మీద ఆధారపడ్డ పరస్పర సహాయాన్ని సోవియట్ కోరుతుంది. బ్రిటన్, ఫ్రాంసు, సోవియట్, పోలండులు ఈ సంధికి రావాలి. కనీసం మొదటి మూడు రావాలి. దాడి నెదుర్కొంటానికి ఇచ్చే హామీలు ఇదివరకు వలె గాక, ఇంకా ముందుకు రావాలి. అంటే తూర్పు యూరప్‌లోను, మధ్య యూరప్‌లోను అన్ని సరిహద్దులకు ఈ రక్షణ ఉండాలి." బ్రిటన్ మళ్ళీ గావించిన సూచనలలోకూడ పోలండు - ఫిన్‌లాండ్ మధ్యనున్న బాల్టిక్ రాజ్యాలమాట లేదు. ఆ రాజ్యాలగుండా జర్మనీ ఎదుర్కొంటే రక్షణమాట ఏమిటి అనే సోవియట్ అడుగుతున్నది.

ఇంకా ఈ సూచనల గురించి జినీవాలో బ్రిటిష్ విదేశాంగ మంత్రియగు లార్డ్ హాలిఫాక్సు లండన్ సోవియట్ విదేశ రాయబారియగు మైస్కీతో మాట్లాడుతాడు. మొదట పొటెమ్కిన్ (సోవియట్ విదేశ సహాయమంత్రి) సంభాషణలు సాగించాలని నిశ్చయింపబడినా, ఇపుడు మైస్కీని పంపడానికే సోవియట్ నిశ్చయించింది. ఈ సంభాషణల గురించిన చర్చ కామన్సు సభలో వచ్చింది.

పార్లమెంటులో చర్చ.

లాయడ్‌జార్జి హాస్యపూరితంగా గావించిన ఉపన్యాసంలో చాలా సత్యముంది. అతడిలా అన్నాడు:

"రష్యాను గురించిన వ్యవహారం చూస్తే మన మేం చేస్తున్నామో మనకు తెలియదు. రష్యా లేకుండా పని జరిగితే, లేకుండా ఉండాలనే పెద్ద కోర్కె ఉంది. రష్యా ఎన్నోనెలల క్రిందటే సహాయం గావించటానికి సిద్ధమైంది. ఆ బహూకరింపబడిన బలమైనగుర్రం (రష్యా) నోరువంక చూస్తున్నాం. కాని దాని పళ్ళవంక జూచి భయపడుతున్నాం. కాని ఒక దేశం తర్వాత మరొక దేశ స్వాతంత్ర్యాన్ని హరించే జంతువుల (జర్మనీ-ఇటలీ) కోరల జూచి భయపడటం లేదు. పైగా వాటితో మనకు సంధులు, స్నేహితాలు ఉన్నాయి. మనం వాటి పంజాలతో చేతులు కల్పుతున్నాం."

సోవియట్‌తో సంభాషణల గురించి ఛాంబర్లేను ప్రకటనవలన ఎట్టిమార్పు కనపడటంలేదు. బ్రిటిష్ వైఖరిలోమార్పులేదనే తెలియజేస్తున్నది. ఛాంబర్లేను అన్న వాక్యాలే అందుకు నిదర్శనం.

"బహుశా సోవియటు ఇందుకు భయపడవచ్చు. మా సూచనలలో పోలండ్, రుమేనియాలు తప్ప మరికొన్ని ప్రభుత్వాల విషయం లేదని వారభిప్రాయమై యుండవచ్చు. కాని అదేవిధంగా కొన్ని పశ్చిమ ప్రభుత్వాలపై దాడి సల్పితే మనల్ని యుద్ధంలోకి లాగినప్పుడు సోవియట్ సహాయం చేయాలనే షరతులు కూడా మేం సూచించలేదు." ఇంకోచోట. స్టాలిన్ "దాడికి గురియైన దేశాలను రక్షిస్తా"మన్నాడు కదా. ఎందుకు మావలెనే, పోలండు రుమేనియాలకు అభయమివ్వరాదు అని ఛాంబర్లేను అన్నాడు. పైగా పొటెమ్కిన్‌ను జినీవా పంపనందులకు విచారాన్ని తెల్పియజేశాడు.

ఛాంబర్లేను వాదనలో అర్థంలేదు. పడమటి రాజ్యాలకు కూడ సోవియటు సహాయం చేస్తానన్నది. కాని ఛాంబర్లేనే నిరాకరించాడు: "మాకు మీ సహాయం పడమట దేశాలకు అక్కర్లేదు; మీకు బాల్టిక్ రాజ్యాలవద్ద మా సహాయం ఇవ్వం" అని ఛాంబర్లేను మాటల కర్థం. కాబట్టి మాటలుమారినా, చేతలు మేము

నాజీ పులిని పెంచిన

ఆంగ్లో - సోవియట్ ఒడంబడిక కుదిరినా

ఫేసిస్టు డిక్టేటర్లు మరొక

కటిలాగానే ఉన్నాయి. పొటెమ్కిన్‌ను జినీవాకు సోవియట్ పంపక పోవడాన్ని నిందిస్తూ ఛాంబర్లేను అన్న వాక్యాలు చూడండి.

"ఈ రెండు ప్రభుత్వాల మధ్య దొరరాని ఒక ముసుగు లేక గోడ అడ్డుగా ఉంది."

కాబట్టి ఈ సంభాషణ ఫలితాలు ఇప్పటి సూచనల కంటె మించిపోతాయని అనుకోలేము. చర్చిల్, ఈడెన్‌లుకూడా సోవియట్‌తో సంధి కావాలని తీవ్రంగా విజ్ఞప్తిచేశారు. ఛాంబర్లేనుపై ప్రజల ఒత్తిడి బాగానేఉంది. ఈ ఒత్తిడికి ఛాంబర్లేను లొంగుతున్నాడా? లొంగుతున్నాడు కాని హృదయపూర్వకంగా పని చేయడంలేదు.

హాలిఫాక్సు ఫ్రెంచి ప్రధాని దలదీర్‌తోను విదేశమంత్రి బోనెట్‌తోను సంభాషణలు గావించాడు.

మైస్కీతోకూడ సంభాషణలు జరిగాయి. త్వరలోనే సంధి జరగవచ్చునని లండన్ పత్రికలు 22 వ తేదీన వ్రాస్తున్నాయి.

ఒడంబడిక ఎలా ఉంటుంది?

ఒకవేళ ఆంగ్లో-సోవియట్ ఒడంబడిక జరిగినా అది ఎలా ఉంటుంది? పూర్వం సోవియటు కోరినట్లు మిలటరీ సంధికాదు. కాని ఇదివరకు ఫ్రాంసు-సోవియటులకుగల సంధి లాంటిదే జరగవచ్చు. ఇలాంటి సంధికి రావాలని ఫ్రాంసు సోవియటుపై ఒత్తిడి తెస్తున్నది. ఈ సంధివల్ల కొంత ఉపయోగమున్నా; ఫేసిస్టులను అరికట్టడానికి, దిట్టమైనదికాదని చెప్పాలి. ఈ ఒడంబడిక చేసుకోడానికి బ్రిటన్ ఫ్రాంసులు ఇలా వాదిస్తాయి.

"(1) ఆంగ్లో-సోవియట్ ఒడంబడిక జరిగితే, ఫ్రాంసు కూడా వేరే అనవసరం. ఇదివరకు చేసికొన్న ఫ్రాంకో-సోవియట్ ఒడంబడిక ఉన్నది. కాబట్టి ఫ్రాంసు, ఇంగ్లండు, సోవియట్‌లు కలిసినట్లే.

అలాగే టర్కీ, రష్యాలకు మైత్రిఉంది. టర్కీ ఇంగ్లండులకు ఒడంబడిక కుదిరింది. ఫ్రాంసుతో కుదరబోతున్నది. కాబట్టి టర్కీ, ఫ్రాంసు, ఇంగ్లండు, బ్రిటన్‌లు ఐక్యంగా ఉన్నట్లే. ఇంతకంటె ఏమి "పీస్‌ఫ్రంటు" (శాంతిరాజ్యాల కూటమి) కావాలి?" అంటారు.

ఇలా వాదిస్తాయిగాని హిట్లర్-ముస్సోలినీలకు ఖచ్చితమైన జవాబుగా ఈ మూడుదేశాలు కలిసి మిలిటరీ ఒడంబడిక చేసుకోడానికి ఇష్టపడవు. కనీసం సోవియట్ కోరినట్లు పరస్పర సహాయ ఒడంబడిక (బాల్టిక్ దేశాల రక్షణతో సహా) కు అంగీకరించవు.

లండన్ టైమ్సు (ఛాంబర్లేను ప్రభుత్వ పత్రిక) అపుడే వ్రాస్తున్నది.

"పోలండ్, సోవియట్ యూనియన్, ఫ్రాంసు, బ్రిటనులకు నానాజాతిసమితి 16 వ సూత్రం ఉండనే ఉన్నది. దానివలన దాడిసల్పేవారిపై ఆర్థిక, సైనిక ఆంక్షల విధించవచ్చు. దాని ఆధారం మీద ఒడంబడిక ఉండాలి కాని, ఆ సూత్రాన్ని మించి పోరాదు." మైస్కీ-హాలిఫాక్సుల సంభాషణలు ఫలించి ఈ వారంలోనే ఒడంబడికకు వస్తారనే విషయం మీద వ్యాఖ్య చేస్తూ ఇదే పత్రిక ఇలా వ్రాసింది:

"ఇంత ఆలస్యం బ్రిటన్-ఫ్రాంసు-రష్యాల సంప్రదింపులలో ఎందుకు జరగాలో తెలియడంలేదు. నానాజాతిసమితి సూత్రం ఉన్నది. పైగా ఈ మూడు దేశాలు దాడిని అరికట్ట నిశ్చయించుకొన్న వేగదా?"

కాబట్టి, రేపు జరిగే ఆంగ్లో-సోవియటు ఒడంబడిక అతుకు బొతుకులతో నిండి ఉంటుందని చెప్పాలి. ఈ మాత్రం ఒడంబడికకైనా ఛాంబర్లేను ఎందుకు ఒప్పుకుంటున్నాడు? ఇన్నాళ్ళు ఎందుకు వెనుదీశాడు? ఇంత ఆలస్యం ఎందుకు చేస్తున్నాడు? ఈ ప్రశ్నలకు జవాబు చెప్పేముందు యూరప్ స్థితిగతులు ఈవారంలో ఎలా మారినవో చూడాలి.

ఛాంబర్లేను ద్వంద్వనీతి

ఛాంబర్లేను ఒకప్రక్క సోవియట్ సహకారానికి ప్రాకులాడుతున్నా మరొక ప్రక్క ఫేసిస్టు డిక్టేటర్లకు కొంచెం సందు వదలిపెట్టే ఉంచాడు.

నేటి ప్ర

స్పానిస్టు విజయోత్సవం మాడ్రిడ్‌లో జరుగుతున్నది. అచట జరిగే సైనిక ప్రదర్శనానికి, ఫ్రాంకో ఆహ్వానాన్ని బ్రిటన్ అంగీకరించింది. ఈ విషయం పార్లమెంటులో చర్చకు వచ్చినపుడు కమ్యూనిస్టు మెంబర్ గలాఘర్ "విజయబహుమానం క్రింద జిబ్రాల్టర్‌ను ఫ్రాంకోకు ఇస్తారా?" అని ప్రశ్నించి గేలిచేశాడు.

బొహీమియా, మొరేవియాలను జర్మనీ ఆక్రమించిన జర్మనీని ఖండించిన బ్రిటనే, స్లోవేకియాను గుర్తించింది (రికగ్నైజ్ చేసింది.) మొన్న పార్లమెంటు చర్చలో ఛాంబర్లేను ప్రకటనకూడ ఇలాగే ఉంది.

"వరుస వరుసగా లొంగిపోతూ శాంతిని మేం కొనము. అలా చేస్తే దాడి సలిపేవారే కోర్కెలు వృద్ధి అవుతాయి. కాని దాని అర్థం మేము ఇతరదేశాల సహేతుకమైన కోర్కెలను పూర్తిచేయటాన్ని గురించి (ప్రస్తుత పరిస్థితులలో కొంత సర్దుబాటు అవసరం అయినా) సంభాషణలు జరపడానికి నిరాకరించం."

ఈ అభిప్రాయమే డాంజిగ్ విషయమై కన్పించుతోంది.

డాంజిగ్ భవిష్యత్తు

గతవారం డాంజిగ్‌లో నాజీలు చేస్తున్న అల్లర్లను వివరించాం. ఈవారం మరింత క్లిష్టంగా ఉన్నవి పరిస్థితులు. డాంజిగ్‌లోని

ఛాంబర్లేను రాజనీతి

ఛాంబర్లేను ప్రభుత్వం పోవాలి.

దాడికి సిద్ధంగా ఉన్నారు.

నాజీలు పోలండు పత్రికలను నిషేధించడమే గాక, మత సంబంధమైన రెండు ఉత్సవాలను కూడా నిషేధించారు. మ్యూనిక్‌లోని 1000 మంది పోలండ్ యూదులను వెళ్ళగొట్టారు నాజీలు. ఈస్టు ప్రష్యా సరిహద్దువద్దనున్న కాల్దావ్‌వద్ద పోలిష్ "కస్టమ్సు హౌసు"పై నాజీలు దాడి సల్పారు. కస్టమ్సు ఆఫీసర్లు ఆ ఇండ్లను వదలిపోయారు. ఆ భవనాలను పడగొట్టారు. పోలిషు వైస్ కమీషనరు పెర్కొవెస్కీ విచారించడానికి పోతే, అతనికి పోలీసు రక్షణ నీయలేదు. వైస్‌కమీషనర్ డ్రైవరును నాజీలు ఎదుర్కొంటే అతడు కాల్చాడు. దానిఫలితంగా ఒకజర్మను చచ్చాడు. ఈఘటనలకు ప్రోత్సాహం, నాజీ సెనేట్‌గాని, లేకస్థానిక నాజీ పార్టీగాని, లేక జర్మన్ ప్రభుత్వం గాని ఇచ్చి ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు.

పోలిష్ కమీషనర్, డాంజిగ్ సెనేట్‌కు ఒక హెచ్చరిక పంపాడు. దానిలో జరిగిన ఘటనలను సరిగా విచారించి నష్టపరిహారం ఇవ్వాలని. దానికి జవాబుగా, అమాయక జర్మన్ పౌరుని కమీషనర్ డ్రైవరు చంపినందుకు పరిహారం ఇవ్వాలని ఎదురు అడిగారు నాజీలు.

నాజీల ఈ దౌర్జన్యానికి కారణం వేరే

పంచం

చెప్పనక్కరలేదు. ఇలా కలహాలను రెచ్చగొట్టి, జకోస్లోవేకియాను మ్రింగడం మనం చూడనేచూచాం. డాంజిగ్‌ను జర్మనీ ఆక్రమించితే బ్రిటను ఏమి చేస్తుంది? ఛాంబర్లేనుకు ఇంకా డాంజిగ్‌ను ఇప్పించాలనే ఉన్నది. దీనికి సాక్ష్యం టైమ్సు పత్రికయే. మే మొదటివారములో టైమ్సు ఇలా వ్రాసింది.

"డాంజిగ్ సమస్య యుద్ధం చేయవలసినంత సమస్యకాదు. తెలివి తేటలతోగూడిన రాజనీతియే దానికి గావలసింది."

దీనికితోడు మే 5 వ తేదీన పోలండు విదేశ రాయబారి లండన్ ఉపన్యాసం కూడ అలాగే ఉన్నది.

హిట్లర్-ముస్సోలినీల ప్రయత్నాలు

డాంజిగ్‌లో రాజిన నిప్పును చల్లార్చకుండా అల్లరు చేయిస్తున్నాడు హిట్లరు. స్పెయిన్‌లో ఫ్రాంకో ప్రభుత్వము "నేషనల్ కంపల్సరీ సర్వీసు" పెట్టి ఆయుధ సామగ్రిని ఉత్పత్తి చేస్తున్నది. దీనికి జర్మనీ సాయపడుతున్నది. జిబ్రాల్టర్‌కు అరమైలులోనున్న ప్రదేశాలలో ఫ్రాంకో ప్రభుత్వము కందకాలు త్రవ్వించి, మిలిటరీ సన్నాహాలు కావించుతున్నది. ఫ్రెంచి సరిహద్దు ప్రదేశాలను హిట్లర్, ముస్సోలినీలు పరీక్షించడానికి నిశ్చయించుకొన్నారు. రుమేనియా, బల్గేరియాలమధ్య ఘర్షణలు ప్రోత్సహించుచున్నారు.

1913 లో దక్షిణ డొబ్రుజ్జా బల్గేరియానుండి రుమేనియా లాక్కొంది. ఇప్పుడక్కడ అల్లర్లు ప్రారంభించారు. ఈ మధ్యనే కాల్పులుకూడ జరిగాయి. రుమేనియన్లకు వ్యతిరేకంగా బల్గేరియనులు సోఫియా వద్ద రెండు గంటలు ప్రదర్శనం చేశారు. "రుమేనియా నశించుగాక, రుమేనియా హంతకులు నశించెదరుగాక" అంటూ కేకలువేశారు. ఈ విధంగా హిట్లర్, ముస్సోలినీలు బల్గేరియానుండి రుమేనియాపై ఒత్తిడి తెస్తున్నారు.

యుగోస్లోవియా కూడ రోం - బెర్లిన్ యాక్సిస్ (ఇటలీ-జర్మనీల కూటమి) లో కలుస్తుందని న్యూస్ క్రానికల్ తెల్పుతూంది.

డెన్మార్కు, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్‌లను తటస్థంగా ఉండాలని, నాన్ ఎగ్రెషన్ పాక్టు (ఒకరిపై ఒకరు దాడి సల్పరాదనే సంధి) చేసికోవాలని జర్మనీ కోరింది. ఒక్క డెన్మార్కు ఇందుకు అంగీకరించింది. తక్కినవి అంగీకరించలేదు. అంతే సోవియట్ - ఇంగ్లండుల రాయబారాలు వాటిని ఉత్సాహ పఱచిన వన్నమాట.

పోతే ఇటు బాల్టిక్ రాజ్యాలలోని లిథూనియాతో జర్మనీ వర్తకసంధిని గావించుకొంది. మెమెల్‌కు దగ్గరగా ఒక రేవు కట్టుకోడాన్కి జర్మనీ అంగీకరించింది. ఈ ఒడంబడిక వల్ల, జర్మనీకి రష్యాపైకి బాల్టిక్ దేశాలగుండా వెళ్ళడం మరింత సులభమైంది.

ఇంతేగాక జర్మనీ కాలనీల (వలసదేశాల) అందోళన మళ్ళా ప్రారంభించింది. వియన్నాలో రీష్ కలోనియల్ కాంగ్రెసు జరిగింది. వరుసగా 3 దినాలు కాలనీలను గురించి ఆందోళన జరిపారు. రీష్ కలోనియల్ అధ్యక్షుడు మాట్లాడుతూ "హిట్లర్ బ్రిటన్‌కు, శతృత్వం వహించడంలేదు. కాని అతని 'కాలనీలు కావాలనే కోర్కె'ను మాత్రం తీర్చాలి. పూర్వపు జర్మనీ కాలనీలు తిరిగి వచ్చి తీరతాయి; ఒక్క సంవత్సరానికైనా సరే, పదిసంవత్సరాలకైనా సరే వచ్చి తీరతాయి."

వియన్నాలో జర్మన్ కలోనియల్ సైన్యాల 50 వ వార్షికోత్సవం జరుపుతూ కాలనీలు వచ్చేవరకు విచార సూచకమైన చిహ్నాలు ధరించాలని అన్నారు.

ఈవిధంగా ఒకప్రక్క డాంజిగ్, మరొక ప్రక్క కాలనీలు కావాలనీ హిట్లరు అందోళన ప్రారంభించాడు.

మొన్న మొన్నటి ఉపన్యాసాలలో కొంత మెత్తదనం చూపించిన ముస్సోలినీ ఒక్కసారి గంతు వేసి గర్జించాడు.

"మా బ్లాకు (జర్మనీ-ఇటలీ) శాంతిని కోరుతుంది. కాని మా అప్రతిహత జైత్రయాత్రను తన్నకేదలిచే, తియ్యాన్షనరి ప్రభావాన్ని ప్రతిఘటించడానికి ప్రయత్నించినాయా, మేము శాంతిపరులకులను నెత్తిన రుద్దుతాం. ప్రస్తుతం నిశ్శబ్దంగా ఉన్నాం. కాని సమయం వచ్చినపుడు ఇటాలియనులు జవాబుచెబుతారు."

దీనినిబట్టి త్వరలో నే మరొకదాడి జరుగుతుందని చెప్పక తప్పదు. అయితే అది ఏది; డాంజిగా? లేక దక్షిణాఫ్రికాలోని యుగండా, టాంగనీకాలా? ఈ దాడిని ఎదుర్కొంటానికి బ్రిటన్ తయారుగా ఉందా?

ఛాంబర్లేను రాజనీతి

పూర్వము బ్రిటిషు నీతి వేరు. నేడు బ్రిటిషు నీతి వేరు. పూర్వము, ఆ యా దేశాలు కొట్టుకులాడుతుంటే బ్రిటన్ మధ్యగా ఉండి (బాలన్సు ఆఫ్ పవర్ పాలసీ) తన అధికారాన్ని చెలాయించుతూ ఉండేది. ఈరాజనీతిని ఛేంబర్లేన్ భగ్నము చేశాడు.

పూర్వము—ప్రపంచయుద్ధానికి పూర్వం —జర్మను ఫ్రాంసులే రంగముమీద కన్పించేవి. కొన్నాళ్ళవరకు—ప్రపంచ యుద్ధానంతరముకూడా—ఇవే కన్పించిచా. ఈనాడు బలమైన దేశాలు వేరు. ఈనాడు సోవియట్ యూనియను, అమెరికాలు బలమయిన దేశాలు. ఈదేశాలను ఎదుర్కొవాలంటే బ్రిటనుకు తగిన బలముగల భాగస్తుడు కావాలి. అందుకోసము జర్మనీని బలిపించాలి. అందుకే ఒకదాని తర్వాత ఒకటి—చిన్న చిన్న రాజ్యాలను బ్రిటను అర్పించింది జర్మనీకి.

అమెరికా, సోవియట్‌లతో బ్రిటను కలవడం అంటే అది ప్రపంచ శాంతికి దారి తీస్తుంది. అది ఛేంబర్లెనుకు అవసరము లేదు. పూర్వములాగానే తాను బాలన్స్ ఆఫ్ పవర్ పాలసీ (తాను ఎటు చేరితే అటు జయము మొగ్గేటటువంటి రాజనీతి)ని అవలంబించాలి. అందుకోసరమే ఇదివకు ఛేంబర్లేన్ తటస్థవిధానము అవలంబించాడు.

బ్రిటన్‌కుసోవియట్ రష్యాతోవిరోధం ఉండటము సహజమే, కాని అమెరికాతో ఎందుకు అన్నప్రశ్న వస్తుంది. ఈరెండు సామ్రాజ్యాల మధ్య సహజముగా సామ్రాజ్యవాదానికి ఉండే లక్షణమైన వర్తకపు పోటీ ఉంది. జర్మనీ తన (అమెరికా) వర్తకానికి పెద్దదెబ్బ కొట్టేటట్లుంది దానిని బ్రిటన్ ప్రోత్సహించుతోంది తనమీద వైరభావంవల్ల. ఛాంబర్లేనుకీసంగతిఅమెరికాకు తెలుసు. అందువల్ల అమెరికా పూర్వం నుండి తటస్థంగా ఉంటున్నా, ఈనాడు నైతికంగా కలుగజేసుకొంటున్నది. రూజవెల్టు శాంతి సందేశం, అమెరికాలోని ఫేసిస్టు వ్యతిరేక ప్రచారం, ఛాంబర్లేను నాటకానికి అడ్డు తగిలినాయి. జర్మనీ వ్యతిరేక ప్రజాభిప్రాయం ఎక్కువ బ్రిటన్‌లో కలిగేటట్లు అమెరికా చేసింది.

నాజీపులి

ఈ పరిస్థితులలో ఛాంబర్లేను ఏం చేస్తాడు? అతని పని క్లిష్టమయింది. ఈ ఆరేండ్లనుండీ హిట్లర్ అనే నాజీ పులిని పెంచాడు. ఆ పులిని సోవియటుపైన దూకించుదామని తలచాడు. కాని అపులి పెద్దదయ్యాక యజమాని (ఛాంబర్లేను) మాంసాన్నే తినబోతున్నది. దీన్ని అదుపులో పెట్టడం ఎలా? పులుల్ని పెంచడం చాలా కష్టమైనపని. దానికి లొంగనన్నా లొంగాలి, లేదా దానిని బెదరించనన్నా బెదరించాలి. ఛాంబర్లేను బెదరించదలచాడు. ఒక్కసారిగా హిట్లర్ వ్యతిరేక ఉపన్యాసాలు సాగించాడు. ఆయుధాల్ని వృద్ధిచేశాడు. కాని ఈకొరడా (ఆయుధపెంపకం వగైరా) సరిపోలేదు. అందుకని "ఇదిగో సోవియట్, ఫ్రాంసు, అమెరికాలతో కలుస్తున్నాం జాగ్రత్త" అని అన్నాడు. ఇంకా "ఇదిగో ఫ్రాంసు, అమెరికా, సోవియటులతో కలపడమేగాదు. పోలండ్ రుమేనియా, మరి ఇతర చిన్నదేశాలనుకూడ ఒక్క క్షణములో కలిపివేస్తాను. మేం బలహీనంగా ఉన్నామని తలచేవు. జాగ్రత! మేమంతా కలిస్తే ఇటలీ మాత్రం నీతో ఉంటుందా? (ఈ బెదరింపు చూసే హిట్లర్ గభాలున ముస్సోలినీకి మిలటరీ సంధి నెత్తిన రుద్దాడు.) నీపని ఇంతటితో సరి. లేదా మేం చెప్పినట్లు విను. మేమొకదారి (రష్యాపైకి) గీస్తాం. ఆరోడ్డున మా జోలికి రాకుండా పో. పోయావా, నీకేమి కావాలో చెప్పు. డబ్బా, సైన్యమా, రాజనీతి సహాయమా, ఏది కావాలో అది ఇస్తాము." ఇలా అని నయాన, భయాన, హిట్లరును బుజ్జగించడానికే ఛేంబర్లెను ప్రయత్నించాడు.

నేడు ఏదో రకపు ఒక ఒడంబడిక సోవియట్‌తో కుదురుతుందని లండన్ పత్రికలు వ్రాస్తున్నాయి. ఎలాంటి సంధి జరిగినా శాంతి శక్తులకు బలపరుస్తుందని మనం సంతోషింపవచ్చు. ఊరక సంతోషించడము గాకుండా, నిజమగు శాంతి ఏర్పడేటట్లు ఛాంబర్లేను ప్రభుత్వాన్ని లొంగదీయడానికి బ్రిటిషు ప్రజాభిప్రాయం వృద్ధికావాలి. దానికి ఈ ఒడంబడిక ప్రాతిపదిక కావాలి అయితే ఒక సంగతి మనం మరచిపోరాదు. జకోస్లోవేకియా విషయమై ఫ్రాంకో-సోవియట్ సంధి పనిచేయలేదు. కారణం ఆ ఒడంబడికను ఛాంబర్లేను ప్రోత్సాహంతో దలదీర్ అమలు జరపక పోవడమే. నేడు ఆంగ్లో-సోవియట్ ఒడంబడిక జరిగినంత మాత్రాన లాభంలేదు. ఆ ఒడంబడికను అమలు జరిపే ప్రభుత్వంకావాలి. అంటే ఛాంబర్లేను ప్రభుత్వం పోవాలి.

గ్రంథావలోకనం

చీనా-జపాను
చకోస్లోవేకియా-జర్మనీ

రచయిత : కి. రంగాచార్యులు

112 పేజీలు : వెల ఒంటావాయలకు 0-4-0
ఇతరులకు 0-6-0

పుస్తకాలకు : రామానుజాచార్య విద్యా సమితి'
విజయనగరము.

ఈ గ్రంథంలోని మొదటి భాగం "చీనాపై జపాను మండిపడుతుంది". 1914 మొదలుకొని 1937 లో చైనా-జపాను యుద్ధప్రారంభమువరకు చరిత్రను ఈయాలని గ్రంథకర్తగారు ప్రయత్నించారు. ఎన్నో విషయాలు, ఎన్నో ఉదంతాలు తెల్పినా పుస్తకమంతా "గలీలు"తో నిండి నంద విషయ విశదీకరణ-గాని, విభజన గాని చేసేదేమి మొదటినుండి చివరవరకు ఒకే ఒక ప్రవరణం.

యుద్ధాలను మూలకారణాలు, తెలియని ఉండే అర్థిక, రాజకీయ కారణాలు ప్రాముఖ్యతను వివరీకరించకుండా యుద్ధం చెప్పగొట్టడానికి కల్గించే ఘటనలను జపాను పైన కని పెంచినా, అనుమానిస్తుడా? చెప్పి. యుద్ధం (ప్రారంభించడం) మాత్రమే పేర్కొని ఆ ఘటన లే యుద్ధానికి దారి తీసాయని వ్రాశారు. కాని అసలు కారణాలను విశదీకరించ ప్రయత్నించలేదు. ఉదాహరణకు

"ఇట్టిపంటలు మనసులను కాల్చివేయు మందాగా రాసిరాను చీనా దేశమునందును జపానువారికిని, చీనావారికిని చెల్లాటలు జరిగెటు మొదలుపెట్టినవి."

మరొకచోట 1937 లో చీనాపై జపాను పెత్తనానికి కారణం, స్పైన్ యుద్ధంలో చిక్కిన ప్రపంచమంతా మున్సిపుండుటయని వ్రాస్తా.

"స్పైను గలీలతో పాశ్చాత్య ప్రభుత్వములు తలక్రిందలవలె కొట్లాడుకొనుట ప్రారంభించినవి" అని అన్నారు.

ఇంకేగాను, చైనా కమ్యూనిస్టు పార్టీని గురించి వీరి విషయ పరిజ్ఞానం మరింత ఆశ్చర్యం కలుగచేస్తుంది.

"రష్యా దేశములో సోవియట్" పక్షము ఏకమత్యము గలుగజేసి యరాజకమును లేకుండ జేసినది కనుక యీసిద్ధాంతమును అవలంబించినచో చీనా దేశములో కూడనట్టి ఫలములే కలుగునని నాక యీ ప్రజలలో పుట్టుటచే సామ్యవాదమును ప్రజలనుసరించిరి గాని సామ్యవాద సిద్ధాంతములపై నుంచు నమ్మకముచే వారిటుల గావింప లేదని కొందరి మతము. ఏది యెట్టులున్నను రాజకీయ పక్షమును నేర్పాటు చేయుటతప్ప వేరెట్టి లాభమును సామ్యవాదము ననుసరించుటచే చీనాకు కలుగలేదు"

పూర్వము చైనాలో కొంత రాజ్యం చైనా కమ్యూనిస్టుపార్టీ అధిపత్యం క్రింద ఉన్నదన్న సంగతే వీరికి తెలియదు. జపానువారిని తీవ్రముగా ప్రతిఘటించే కార్యక్రమాన్ని సాగించినవి కమ్యూనిస్టులన్న విషయము తెలియదు.

ఈ ఉదాహరణలు చాలు, ఈ చరిత్రను ఏవిధంగా వ్రాసినది తెలియజెప్పటానికి. వీరు వ్రాసిన "గలీల"తో నిండిన చరిత్ర పాఠకులను మరింత "గందరగోళం" చేస్తుంది.

★

రెండవ భాగం "చకోస్లోవేకియా-జర్మనీ" దీనిలోకూడ అనేక లెక్కలు — తేదీలూ ఉన్నాయి. కాని నేటి గర్భితల అర్థం చేసికొనే వ్యక్తవమేలేదు. "జర్మనులను బాధించుతున్నారు. వారు జర్మనులతో కలవాలి." అనే హిట్లరు కృత్రిమ సిద్ధాంతాన్నే ఈయనా నమ్ముతున్నారు. ఉదాహరణకు :

"ఆ సరిహద్దుకావల జర్మనీలో నున్నవారి స్థితి మిగుల బాగుగనేయున్నది. నిరుద్యోగము వారిని బాధింపలేదు. ఇట్లు సుఖముగను గౌరవముగను తోడివారు తమ దేశములో జీవించుట జూచి తమ సోదరులతో గలియుటకుం బ్రయత్నించిన తప్పేమి?" అని అన్నారు.

జర్మన్ నాజీ సిద్ధాంతం తెలిసినవారుగాని, జర్మన్ చరిత్ర తెలిసినవారుగాని జర్మను ప్రజలు సుఖంగా ఉన్నారని, నిరుద్యోగము లేదనీ చెప్పసాహసించలేరు. ఇంకోచోట

"ఇపుడు హిట్లర్ కత్తిని ఝళిపించిన కాని సుడెటను జర్మనులకు న్యాయము జరిగినది కాదు." అని ముగింపు వాక్యాలలో వ్రాశారు. నిజంగా జరిగిన న్యాయమేమిటో చరిత్రే చెప్పింది. 'జర్మన్‌ల రక్షణార్థం' సుడెటన్ భూమిని కాజేసిన హిట్లర్ న్యాయమూర్తియే అయితే, బొహీమియా, మొరేవియాలను కాజేయవలసిన అవసరం ఏమిటి? సామ్రాజ్యవాద సూత్రాల్నిగాని, ఫేసిస్టు రాజనీతినిగాని ఏమాత్రం అర్థం చేసుకొన్నా రచయిత ఇలా వ్రాసి ఉండేవారు కారు.

విషయమింత 'అధ్వాన్నం'గా ఉండటంగాక భాషకూడా బాగులేదు. గ్రాంథికం. ఇలాంటి రాజకీయాలను, వ్యావహారికంలో సుబోధకంగా వ్రాస్తే బాగుంటుంది.

★

వెలుగురవలు

రచయిత : కామ్రేడ్ నాగభైరవ శివరామకృష్ణయ్య

40 పేజీలు : వెల రెండణాలు

పుస్తకాలకు : సహచర సంఘం,
అమృతలూరు, తెనాలితాలూకా

ఈ గ్రంథానికి కొడాలి ఆంజనేయులుగారి పీఠిక, వల్లభరావు, భగవంతరావుగార్ల అభిప్రాయాలు ఉన్నాయి.

ఈ గ్రంథ రచనకు కారణం గ్రంథకర్త పీఠికలో చెప్పికొన్నటుల "ఆపుకోలేని ఉత్సాహం". ఈ రచనలోని విషయం నేడు దేశాన్ని కలవరపెడుతున్న" దారిద్ర్యం-ధనికవర్గాలు-సామ్రాజ్యవాదం-కర్మ సిద్ధాంతం-సోషలిజం" వగైరా.

ఆంజనేయులుగారు సెలవిచ్చినటుల గ్రంథకర్తకు "బహు గ్రంథావలోకనము లేకుండానే, ఉత్కృష్ట విషయాలను గూర్చి,తన అభిప్రాయాలను వ్రాయాలనే సాహసం" ఉంది. అందుకు రచయిత తను అభినందించాలి. బహు గ్రంథావలోకనం లేనంతమాత్రాన ఆంజనేయులుగారు చెప్పినట్లు "దేశానికి గానీ. మన జాతికి గానీ, ముప్పంలేదు."కాని రచయిత పుస్తకాలు వ్రాయబూనుకునేముందు తన ఉత్సాహాన్ని విషయపరిజ్ఞాన లబ్ధికై ఖర్చు పెట్టాలని మా కోరిక.

భాష సంస్కృత పదభూయిష్ఠమై జోరుగా ప్రవహిస్తోంది. చక్కని కాగితంపైన ముద్రించి రెండణాలకే ఈయడంకూడా రచయిత 'త్యాగనిరతి' తెల్పుతుంది. యువరచయిత అభిప్రాయాలు తెలుసుకో గోరువారందరూ ఈపుస్తకం చదవాలి.

★

సంస్థానాలు

రచయిత:- వావిలాల గోపాలకృష్ణయ్య

152 పేజీలు:- వెల ఆరణాలు

ప్రకాశకులు:- "జ్యోతి సత్తెనపల్లి"

పుస్తకాలకు:- ఆంధ్రా రేడికల్ లిటరేచర్
సెల్లింగుడిపో, కొత్తపేట,
గుంటూరు.

నేడు భారతదేశాన్ని కలవరపెడుతున్నది సంస్థాన సమస్య. స్వాతంత్ర్యపోరాటంలో ఒక భాగమైన సంస్థాన ప్రజాసామాన్య పోరాటము అత్యున్నత స్థాయికి పోతుంది. సంస్థాన ప్రజా ఉద్యమాన్ని పరిశీలించడానికి సంస్థానాల చరిత్ర ఏమిటోతెలుసుకోవాలి. దానికి గోపాలకృష్ణయ్య గారి "సంస్థానాలు" ఎంతో అవశ్యకమైన గ్రంథం.

అనేక ముఖ్య సంస్థానాల తీసికొన్నారు. ప్రతి సంస్థానము యొక్క వైశాల్యం, జనాభా మొదలయిన విశేషాలు ఇవ్వడమేగాక సంగ్రహంగా సంస్థాన ఉద్యమ చరిత్రను ఇచ్చారు. ఇన్ని సంస్థానాల గురించి వ్రాసేటప్పుడు ఉద్యమ చరిత్రను విపులంగా రాయడం కష్టం అయినా ఒక్క పర్యాయంచూడగానే, హిందూదేశ సంస్థాన ఉద్యమ చరిత్ర కన్నులకు గట్టుతుంది.

సంస్థాన పోరాటాలలో నిమగ్నులైన సంస్థాన ప్రజావాసులకేగాక, రాజకీయాలలో అసక్తులయిన వారందరికీ ఈ గ్రంథం చదవడం అవుసరం.

★

సోవియట్ రష్యా

సంపాదకుడు : నండూరి సత్యనారాయణ

20 పేజీలు : అణా

పుస్తకాలకు : సౌఖ్యసాధన ప్రచారక గ్రంథమాల. తాడేపల్లి గూడెం.

సోవియట్‌లో నేడు మతము, వివాహనీతి లేదనీ, అందుచేత నీతి బాహ్యాలనీ చేయబడుచున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ రష్యాలోని మతస్వాతంత్ర్యం, వివాహము యెడల సోవియట్ పౌరుల దృక్పథం, నేటి సోవియట్ పౌరుని జీవితం మొదలయిన విషయాలు రచయిత వివరించారు.

సోషలిస్టు ప్రచారానికి చక్కని కరపత్రం ఇది.

రామాపురంలో 144

మునగాల ఎస్టేటులో రామాపురం స్కూలు తగాదాను గురించిన వార్త వేరొకచోట ప్రకటించాము ఇప్పుడు ఆ స్కూలు ఆవరణలోనికి 2 నెలల వరకు ప్రవేశించరాదంటూ బెజవాడ జాయింటు మేజిస్ట్రేటు ఎన్. యస్. మణి, ఐ. సి. యస్. గారు కామ్రేడ్స్ నండూరి ప్రసాదరావు, పిల్లపాటి వెంకట్రామనర్సయ్య (మునగాల జమీన్ రైతు సంఘాధ్యక్షులు) మొదలగు 22 మందిపై 144 సెక్షను నోటీసులు జారీ చేశారు. మునగాల జమీందారుగారి పిటీషనుపై ఈ నోటీసు జారీ చేసినట్లు అర్థములోనే వుంది.

కాంగ్రెసు వార్తలు

పెనుమంట్ర

గ్రామకాంగ్రెసు సంఘ ఎన్నికలు

19-5-1939 తేదీ సాయంకాలము 9½ గంటలకు గ్రామకాంగ్రెసు ఎన్నికలు శ్రీ ఎన్. ఆనందరావుగారువచ్చి జరిపించినారు. ఈ సంఘమునకు యీ దిగువ వారిని ఎన్నోకోవడ మయినది.

అధ్యక్షులు : శ్రీ రాగు చినరాజన్నగారు
కార్యదర్శి : శ్రీ మంతెన సూర్యనారాయణ రాజుగారు

కార్యవర్గము
తేతలి కనికిరెడ్డిగారు
ద్వారంపూడి సోమిరెడ్డిగారు
ముదునూరి కనకరాజుగారు

ఇట్లు
మంతెన సూర్యనారాయణరాజు
గ్రామకాంగ్రెసు సంఘ కార్యదర్శి

* * *

వెంకటగిరి

టౌన్ కాంగ్రెసు కమిటీ ఎన్నికలు

వెంకటగిరి టవున్ కాంగ్రెసు సంఘ కార్య నిర్వాహకవర్గపు ఎన్నికలు 23-4-39 తేదీన నదీతీర బాలికా పాఠశాల భవనములో ఎలెక్షన్ ఆఫీసరుగారగు శ్రీ పునుగోటి వెంగల్వరాయి నాయుడుగారిచే జరుపబడెను.

శ్రీ చీర్ల గురునాథంగారు అధ్యక్షులుగాను శ్రీ పొట్టి ముత్యాలుగారి సుబ్బరామయ్యగారు కార్యదర్శిగను పోటీలేకనే ఎన్నుకొనబడిరి.

* * *

కొవ్వూరు తాలూకా

కానూరగ్రహారం
గ్రామకాంగ్రెస్ ఎలక్షన్

ది 14 ఆదివారం ఉదయం 8 గంటలకు కానూరు అగ్రహారం గ్రామ కాంగ్రెస్ కమిటీ ఎన్నికలు జరిగాయి.

అధ్యక్షులు : భమిడి పేరయ్యగారు
ప్రధాన కార్యదర్శి : రామడుగుల వెంకట సుబ్బారావుగారు

విశాఖపట్టణము

మున్సిపాల్టీవారు 120 మంది కార్మికులను తొలగించుట

మే 10 వ తేదీ సాయంత్రం విశాఖపట్టణం పురపాలకసంఘ సమావేశము ఛైర్మను శ్రీ మద్ది పట్టాభిరామరెడ్డిగారి అధ్యక్షతక్రింద జరిగినది. మున్సిపాలిటీల యొక్క తనిఖీ అధికారిచే కావింపబడిన ఉద్యోగుల తగ్గింపు సూచనను పరిశీలించి మొత్తము 120 మందిని పనులనుండి మాన్పించుటకు నిశ్చయించిరి. వారిలో 6, 7 గురు మాత్రమే గుమాస్తాలు. మిగిలినవారందరు 10, 8 రూపాయల జీతములు తెచ్చుకొను కార్మికులు. ఈ తీర్మానమునకు కార్మికసంఘసభ్యులగు యె. అప్పారావుగారు తమ అసమ్మతిని ప్రకటించిరి.

ఈ మునిసిపాలిటీ కాంగ్రెసుపార్టీ అధికారంలో నున్నది. 120 మంది కొద్ది జీతాలవారిని తగ్గించినందున దాదాపు 1000 రూపాయలకంటె మునిసిపాలిటీకి ఎక్కువ ఆదాయము కలుగదు. కాని దీనివల్ల 120 కుటుంబాలు సుమారు 600 మంది అల్లాడవలసి వచ్చినది. 120 మందిని తగ్గించుటకు సరియయిన కారణములు కూడా లేవు. దీని విషయము రాష్ట్రకాంగ్రెసు వారు వెంటనే తగు చర్య తీసుకొని ఈ 120 మందిని తిరిగి ఉద్యోగములలో చేరునట్లు చేయుదురని ఆశించుచున్నాము.

ప్యారి కంపెనీ పనివారల సమ్మె.

9 వ తేదీని నెల్లికుప్పం కార్మికుల సమ్మె ఆపు చేయబడినది. ప్రధాని రాజాజీ సంతకముతో సమ్మె వెంటనే ఆపుచేయాలని లేనియడల పనివారందరిని పనిలో ప్రవేశపెట్టుకొనునట్లు చేయుట దుర్లభమని, కొంతమంది వ్యక్తుల ప్రోత్సాహమువల్ల కాంగ్రెసు ప్రభుత్వపు సలహాకు వ్యతిరేకముగాకూడ సమ్మె చేసిరని, పనివారల వుద్దేశము తనకు గిరిగారికి వ్యతిరేకముగా సమ్మెచేయాలని కాకపోయిననూ తుదకు వ్యతిరేకముగా చేయుచున్నట్లు అన్వయింపబడుచున్నదని పనిలోనికి పోయినవారిని కాపాడుట ప్రభుత్వపు విధి అని తెలియచేయుచూ కరపత్రములు పంచిపెట్టబడినవి. స్థానిక యం. యల్. యేలు యీ కరపత్రములు కార్మికులకు తెలియజేసి, జైలునందున్న యూనియన్ కార్యదర్శిచేతకూడ సమ్మె అపుజేయుట మంచిదని జాబు తెచ్చిన తర్వాత సమ్మె అపుచేయబడినది. 144 శెక్షనుకూడ ఉపసంహరించబడినది. రాణిపేటలో కూడ ప్రధాని విజ్ఞప్తిపై సమ్మెఅపుచేయబడినా సామర్లకోటలో యింకనూ సాగుచున్నది. బహిరంగసభలు, ప్రదర్శనాలు తీవ్రముగ జరుగుచున్నవి.

శరత్ చంద్ర చటర్జీ

రచించిన

బడదీదీ

పుస్తకంగా వెలువడింది. మహాకవి రవీంద్రుని వంటివారిచే ప్రశంసింప బడినది. దీనిని న్యూఢియే టప్పువారు చిత్రంగాకూడా తీశారు.

వెల నాలుగణాలు మాత్రం

ప్రతులకు నేడే వ్రాయండి

నవశక్తి కార్యాలయం

బెజవాడ

పరిణీత

ఇంతవరకు నవశక్తిలో వరుసగా ప్రకటింప బడుతూ వచ్చిన శరత్‌చంద్రుని నవల పుస్తకరూపంలో వెలువడింది.

చక్కని గెటప్. వెల నాలుగణాలు.

పుస్తకాలకు

నవశక్తికార్యాలయం

బెజవాడ.

నిర్మాణ సమస్యలు

ఫెడరేషన్‌కు వ్యతిరేకంగా పోరాటము సాగించడానికి దేశములో సన్నాహాలు జరుగుతున్న సమయములో నిర్మాణావశ్యకతనుగూర్చి ప్రత్యేకముగా తెలుపనవసరములేదు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు పార్టీ వారిచే ప్రకటించబడిన ఈ పుస్తకము. స్వాతంత్ర్య యోధులకు ఈ నిర్మాణ సమస్యను పరిష్కరించడానికి అనేక సూచనల నిస్తుంది. వెల అణా. వెంటనే నవశక్తి ఆఫీసుకు వ్రాయండి.

నవశక్తి

పార్టీ సభ్యులు ముఖ్యంగా గమనించాలి

	మే నెల కోటా	మూడు వారాలలో చేర్పించినది.
విశాఖపట్టణం	10	0
తూ. గోదావరి	30	2
వ. గోదావరి	30	6
కృష్ణా జిల్లా	50	14
గుంటూరు	30	4
నెల్లూరు	25	8
రాయలసీమ	10	1
చిత్తూరు	5	1
కర్నూలు	5	2
ఇతర స్థలాలు	15	2
	200	40

* * *

ఈ నెలలో 40 చందాదార్లనే చేర్పించారు. పార్టీసభ్యులు తమ విధిని నిర్వర్తించడం లేదు. పత్రిక పరిస్థితులందరు సభ్యులు ఎరిగినదే. పార్టీసభ్యులు తమ విధిని నిర్వర్తిస్తేనే, పత్రికను మరింత అభివృద్ధి చేయగలం. ఇది గమనించ కోరతాం. — సంపాదక వర్గం.

* *

చందా వివరాలు

సంవత్సర చందా	రూ 3—0—0
అర్ధ సంవత్సర చందా	1—10—0
విడిప్రతి	0—1—0

బర్మా రేట్లు

సంవత్సర చందా	రు 5—0—0
విడి ప్రతి	0—1—6

* * *

ప్రకటన రేట్లు

"కాలం" వెడల్పు 2" (2 అంగుళాలు)

20 అం॥ లోపల ప్రతి అంగుళానికి		రూ. 0—6—0
20" అం॥ పైన	,,	0—4—0
100" అం॥ పైన	,,	0—3—0
పేజీ	రు 10—0—0 లు	
½ పేజీ	6—0—0 లు	
¼ పేజీ	3—0—0 లు	

షరా:—ఈ రేట్లుపైన కమిషన్‌లు. డిస్కౌంటులు ఇవ్వబడవు. రు 0—8—0 లకు తక్కువ ప్రకటనలు తీసుకొనబడవు. నెలకగు డబ్బు ముందుగా ఇవ్వవలెను.

ప్రత్యేక చోటునకు, ప్రత్యేక రేట్లు.

[illegible]



[illegible]



[illegible]

Published by M. Chandrasekhara Rao
Printed by Tummala Venkata Ramiah } at Navasakti Press, Governorpet, Bezwada.

END OF ISSUE